జాతీయ తెలుగు దినపత్రిక

# ప్రజాజ్యోతి

ప్రతి అక్షరం ప్రజల కోసం

రంగారెడ్డి | శనివారం 18 జనవరి 2025 | సంపుటి : 17 | సంచిక : 291 | వెల: రూ.5 | పేజీలు: 08 | RNI NO.APTEL/2010/36516

విక్రం సంవత్సరం - పింగళ 2081, ఆషాఢము 3 ఇండియన్ సివిల్ క్యాలెండర్ - 1946, ఆషాఢము 17 పుర్ణిమంతా - 2081, ఆషాఢము 16 అమాంత - 2081, ఆషాఢము 3 తిథి శుక్లపక్షం తదియ నక్షత్రం పుష్యమి

Published from GUNTOORU, VIJAYAWADA, VISHAKAPATANAM, TIRUPATHI http://www.prajajyothinews.com Mail: prajajyothidaily@gmail.com




## వచ్చే విద్యా సంవత్సరం నాటికి

# తల్లికి వందనం

- పీఎం కిసాన్ పథకం డబ్బులు వేసిన వెంటనే.. అన్నదాత సుఖీభవ
- ఏపీ కేబినెట్ సంచలన నిర్ణయాలు..
- గ్రామ, వార్డు సచివాలయ ఉద్యోగుల హేతుబద్ధీకరణ
- పేదలకు పట్టణాల్లో 2 సెంట్లు, గ్రామాల్లో 3 సెంట్లు స్థలం
- అభ్యంతరం లేని ఆక్రమిత స్థలాల క్రమబద్ధీకరణ
- 62 నియోజకవర్గాల్లో కొత్తగా 63 అన్న క్యాంటీన్ల ఏర్పాటు
- షేధిత జాబితా నుంచి తొలగించిన భూములపై అధ్యయనానికి మంత్రుల కమిటీ
- మంత్రి వర్గంలో పలు కీలక నిర్ణయాలకు ఆమోదం



**అమరావతి**

ఆంధ్రప్రదేశ్ కేబినెట్ సమావేశం ముగిసింది. ఈ సమావేశంలో కీలక నిర్ణయాలు తీసుకున్నారు. ప్రభుత్వ పథకాల అమలు, పోలవరం ప్రాజెక్టు, అమరావతి నిర్మాణ పనులు, పేదలకు భూమి పంపిణీ వంటి అంశాలపై ప్రధానంగా చర్చించారు. ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు అధ్యక్షతన జరిగిన ఈ మంత్రివర్గ సమావేశంలో.. తల్లికి వందనం పథకం అమలు విషయంపై సీరియస్ డిస్కషన్ నడిచింది. వచ్చే విద్యా సంవత్సరం నాటికి తల్లికి వందనం ఇవ్వాలని కేబినెట్ నిర్ణయించింది. అలాగే కేంద్ర ప్రభుత్వం అమలు చేస్తున్న పీఎం కిసాన్ పథకం డబ్బులు వేసిన వెంటనే.. రాష్ట్ర ప్రభుత్వం తరపున అన్నదాత సుఖీభవ వేయాలని నిర్ణయించారు. ఇక పోలవరం డయాఫ్రామ్ వాల్‌ను వెంటనే ప్రారంభించామని నిర్ణయించారు. రాధాజాని అమరావతి పనులు కూడా వెంటనే ప్రారంభమవుతానని ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు ఈ కేబినెట్ భేటీలో చెప్పారు. గ్రామీణ ప్రాంతాల్లో మూడు సెంట్లు, పట్టణ ప్రాంతాల్లో రెండు సెంట్లు స్థలం పేదలకు - మిగతా3లో



## అధికారులు అప్రమత్తంగా ఉండాలి

- సంవత్సరాల తరబడి ఉద్యోగుల కేసులు పెండింగ్‌లో ఉండటంపై ఆయన కన్నెర్ర
- ఎన్ని కేసులు పెండింగ్‌లో ఉన్నాయో.. వాటి వివరాలేంటో నివేదిక సిద్ధం చేయాలి
- ఉద్యోగుల పనితీరుపై సునిశితమైన విజిలెన్స్ ఉండాలి
- వారు అప్రమత్తంగా, అత్యుత్తమంగా పని చేయడానికి ఇది ఉపకరిస్తుంది
- విజిలెన్స్ పెండింగ్ కేసులపై నివేదికను మూడు వారాల్లో ఇవ్వాలి

**అమరావతి**

ఆంధ్రప్రదేశ్ ఉపముఖ్యమంత్రి పవన్ కల్యాణ్.. అధికారులపై ఆగ్రహం వ్యక్తం చేశారు. సంవత్సరాల తరబడి ఉద్యోగుల కేసులు పెండింగ్‌లో ఉండటంపై ఆయన కన్నెర్ర జేశారు. ఎన్ని కేసులు పెండింగ్‌లో ఉన్నాయో.. వాటి వివరాలేంటో నివేదిక సిద్ధం చేయాలని అధికారులకు ఉపముఖ్యమంత్రి సూచించారు. పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి, అటవీశాఖ ముఖ్య కార్యదర్శులకు ఈ మేరకు ఆదేశాలు జారీ చేశారు. ఉద్యోగుల పనితీరుపై సునిశితమైన విజిలెన్స్- మిగతా3లో



## 31 నుంచి పార్లమెంటు బడ్జెట్ సమావేశాలు

- ఈ నెల 31 నుంచి పార్లమెంటు బడ్జెట్ సమావేశాలు
- ఈసారి రెండు విడతలుగా పార్లమెంటు బడ్జెట్ సమావేశాలు
- జనవరి 31 నుంచి ఫిబ్రవరి 13 వరకు తొలి విడత సమావేశాలు
- ఫిబ్రవరి 1న కేంద్ర బడ్జెట్
- మార్చి 10 నుంచి ఏప్రిల్ 4 వరకు రెండో విడత సమావేశాలు

## రష్యా తరుపున యుద్ధంలో పోరాడి 12 మంది భారతీయులు మృతి

- రష్యా తరపున యుద్దం చేస్తున్న 16 మంది భారతీయులు మిస్సింగ్
- ఉక్రెయిన్‌తో జరుగుతున్న యుద్ధంలో రష్యా తరపున పోరాడుతున్న భారతీయులు
- ఇప్పటివరకు 12 మంది మృతి
- రష్యా సైన్యం నుంచి బయటకు వచ్చిన 96 మంది



## మహిళా సాధికారికత లక్ష్యంగా




- మహిళలకు రూ.2,500 సాయం, గ్యాస్ బండపై రూ.500 సబ్సిడీ
- నగర వాసుల జీవన ప్రమాణాలు మెరుగుపరచేందుకు కొత్తగా చర్యలు
- బడుగు వర్గాలతో సహా సమాజంలోని అన్నివర్గాలను సంక్షేమానికి పార్టీ కృషి

## ఆయుష్మాన్ భారత్ అతిపెద్ద స్కామ్

- ఇది నకిలీ స్కామ్ అని సుప్రీంకోర్టు ధృవీకరించడం తనకు సంతోషంగా ఉంది
- ఢిల్లీలోని ఆప్ ప్రభుత్వం ఆయుష్మాన్ భారత్ ఆరోగ్య పథకాన్ని అమలు చేయడంలేదు
- ఆమ్ ఆద్మీ పార్టీ (ఆప్) కన్వీనర్ అరవింద్ కేజ్రీవాల్



# ప్లాంట్‌కు ఊపిరి



- రూ.11,440 కోట్ల ప్యాకేజ్
- కేంద్ర మంత్రి అశ్వినీ వైష్ణవ్ అధికారికంగా వెల్లడి
- వైజాగ్ స్టీల్ ప్లాంట్‌కు ఆర్థిక ప్యాకేజీని ప్రకటించినందుకు గాను ప్రధాని మోదీకి ఎక్స్ వేదికగా కేంద్రమంత్రి రామ్మోహన్ నాయుడు ధన్యవాదాలు
- విశాఖపట్నం ఉక్కు కర్మాగారానికి ఆంధ్రప్రదేశ్ ప్రజల హృదయాల్లో ప్రత్యేక స్థానం ఉంది: మోదీ
- విశాఖ ఉక్కు పరిశ్రమపై కేంద్రం కరుణ
- రూ.11.440 కోట్లతో భారీ ప్యాకేజి ప్రకటన
- ప్రధాని మోదీకి, కేంద్రానికి ధన్యవాదాలు తెలుపుతున్న కూటమి నేతలు

**విశాఖపట్నం**

విశాఖ స్టీల్ ప్లాంట్‌కు కేంద్రం శుభవార్త చెప్పింది. స్టీల్ ప్లాంట్‌కు రూ.11,440 కోట్ల ఆర్థిక ప్యాకేజీని కేంద్రం ప్రకటించింది. ఈ విషయాన్ని కేంద్ర మంత్రి అశ్వినీ వైష్ణవ్ అధికారికంగా వెల్లడించారు. ఇటీవల ప్రధాన మంత్రి నరేంద్ర మోదీని కలిసినప్పుడు స్టీల్ ప్లాంట్‌కు ఆర్థిక ప్యాకేజ్ ఇవ్వాలని ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు కోరారు. ఈ క్రమంలో స్టీల్ ప్లాంట్ ఆపరేషనల్ పేమెంట్స్ కోసం రూ.11,440 కోట్ల ఆర్థిక ప్యాకేజ్ ప్రకటించింది కేంద్ర ప్రభుత్వం. వైజాగ్ స్టీల్ ప్లాంట్‌కు ఆర్థిక ప్యాకేజీని ప్రకటించినందుకు గాను ప్రధాని మోదీకి ఎక్స్ వేదికగా కేంద్రమంత్రి రామ్మోహన్ నాయుడు ధన్యవాదాలు తెలిపారు. "విశాఖ స్టీల్ ప్లాంట్‌కు ఊపిరి పోసేలా రివైవల్ ప్యాకేజీ ప్రకటించిన ప్రధాని నరేంద్ర మోదీకి, కేంద్ర ప్రభుత్వానికి ప్రత్యేక ధన్యవాదాలు. నష్టాలను అధిగమించి, ప్లాంట్ పూర్తి స్థాయి ఉత్పాదనతో లాభాల బాట పెట్టేందుకు ఈసాయం ఎంతగానో ఉపయోగపడుతుంది. ఆంధ్ర రాష్ట్ర అభివృద్ధి, ప్రజల ఆకాంక్షల పట్ల ఎన్డీయే ప్రభుత్వ చిత్తశుద్ధికి ఇదే నిదర్శనం" అంటూ కేంద్రమంత్రి రామ్మోహన్ - మిగతా3లో

## ఇద్దరు పిల్లలు ఉంటేనే ఎన్నికల్లో పోటీ

- స్థానిక సంస్థల ఎన్నికల్లో కొత్త చట్టం తెస్తాం
- భవిష్యత్‌ను ఊహించి అభివృద్ధి ప్రణాళికలు
- రాష్ట్రంలో జనాభా పెంచేందుకు ప్రోత్సాహకాలు
- అమరావతి, పోలవరం నిర్మాణ పనులు వేగవంతం
- పోలవరం నుంచి బనకచర్లకు నీళ్లు తీసుకెళ్తే రాష్ట్రం సస్యశ్యామలం



**అమరావతి**

ఇద్దరు పిల్లలు లేకపోతే స్థానిక సంస్థల ఎన్నికల్లో పోటీ చేయకుండా చట్టం తెస్తామని, భవిష్యత్‌ను ఊహించి అభివృద్ధి ప్రణాళికలు చేస్తున్నామని ఏపీ ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు వ్యాఖ్యానించారు. రాష్ట్రంలో జనాభా పెంచేందుకు ప్రోత్సాహకాలు ఇస్తామని ముఖ్యమంత్రి ప్రకటించారు. అమరావతి, పోలవరం నిర్మాణ పనులు వేగవంతం చేశామని, పోలవరం నుంచి బనకచర్లకు నీళ్లు తీసుకెళ్తే రాష్ట్రం సస్యశ్యామలం - మిగతా3లో

## మహా కుంభమేళా వెళ్లే భక్తులకు సూపర్ ఆఫర్..

# ఐఆర్‌సీటీసీ సరికొత్త టూర్

ఉత్తరప్రదేశ్ రాష్ట్రంలో ప్రయాగ్ రాజ్‌లో మహా కుంభమేళా అత్యంత వైభవంగా జరుగుతోంది. దేశవిదేశాల నుంచి కోట్లాదిమంది భక్తులు ఇక్కడ పుణ్య స్నానం చేయడానికి పెద్ద ఎత్తున తరలివస్తున్నారు. దాదాపు 40 కోట్ల మందికిపైగా ఈ మహా కుంభమేళాకు వస్తారని అధికారుల అంచనా. జనవరి 14న ప్రారంభమైన మహా కుంభమేళా మొత్తం 45 రోజుల పాటు జరుగనుంది. ఈ నేపథ్యంలోనే ప్రయాణీకుల కోసం ఐఆర్‌సీటీసీ స్పెషల్ టూర్ ప్యాకేజీని తీసుకొచ్చింది.

**దానాపూర్ ఎక్స్‌ప్రెస్..**

తెలుగు రాష్ట్రాల నుంచి ఈ మహా కుంభమేళాకు వెళ్లే భక్తుల కోసం దానాపూర్ ఎక్స్‌ప్రెస్ జర్నీతో సరి కొత్త ప్యాకేజీని ప్రకటించింది. ఇండియన్ రైల్వే క్యాటరింగ్ అండ్ టూరిజం కార్పొరేషన్ ప్రయాణీకుల కోసం ఎప్పటికప్పుడు స్పెషల్ టూర్ ప్యాకేజీలను అందుబాటులోకి తీసుకొస్తోన్న సంగతి తెలిసిందే. ప్రయాణికుల అభిరుచులకు తగ్గట్టు అతి తక్కువ ఖర్చుతో ప్రత్యేక టూర్స్ ఆఫర్ చేస్తోంది. ఈ క్రమంలోనే మహా కుంభమేళా టూర్ ప్యాకేజీని అందుబాటులోకి తెచ్చింది.

**తెలుగు రాష్ట్రాల్లో..**

మొత్తం 6 రోజులపాటు అంటే 5 రాత్రులు, 6 పగళ్ల పాటు ఈ ప్యాకేజీ ఉంటుంది. 3 రోజుల పాటు ఉదయం టిఫిన్, రాత్రిపూట భోజనం ఉంటుంది. అంతేకాకుండా ట్రావెల్ ఇన్సూరెన్స్ కూడా ఉంటుంది. ఈ ట్రైన్? జర్నీ హైదరాబాద్ నుంచి ప్రారంభమవుతుంది. తెలంగాణ, ఆంధ్రప్రదేశ్ రాష్ట్రాల్లో సికింద్రాబాద్, కాజీపేట, వరంగల్, ఖమ్మం, విజయవాడ, రాజమంత్రి, ఏలురు, తుని, దువ్వాడ, విజయనగరం రైల్వే స్టేషన్లలో మహా కుంభమేళకు వెళ్లాలనుకునే భక్తులు ఈ ట్రైన్? ఎక్కొచ్చు. ఈ టూర్‌లో భాగంగా భక్తులు వారణాసి కూడా కవర్ చేయవచ్చు.ఈ నెల 17, 19, 24 తేదీల్లో అదేవిధంగా వచ్చే నెల ఫిబ్రవరిలో 2, 7, 14, 16, 21 తేదీల్లో ఈ ఆధ్యాత్మిక యాత్ర టూర్ ప్రారంభం కానుంది.



**టికెట్ ధరలు ఇలా ఉన్నాయి:**

థర్డ్ ఏసీలో సింగిల్ షేరింగ్ - రూ. 48,730
డబుల్ షేరింగ్ - రూ. 31,610
ట్రిపుల్ షేరింగ్ - రూ. 29,390
5-11 ఏళ్ల చిన్నారుల కోసం..
(విత్ బెడ్) - రూ. 22,890
విశౌట్ బెడ్ - రూ. 14,650
స్లీపర్ క్లాస్‌లో సింగిల్ షేరింగ్ - రూ. 45,700
డబుల్ షేరింగ్ - రూ. 28,570
ట్రిపుల్ షేరింగ్ రూ. 26,360
5-11 ఏళ్ల చిన్నారులు:
విత్ బెడ్ రూ. 19,860
విశౌట్ బెడ్ - రూ. 11,620

## రష్యా తరుపున యుద్ధంలో పోరాడి 12 మంది భారతీయులు మృతి

**న్యూఢిల్లీ:** ఉక్రెయిన్ తో జరుగుతున్న యుద్ధంలో రష్యా తరపున పోరాడుతున్న 16 మంది భారతీయులు కనిపించకుండా పోయినట్టు విదేశాంగ ప్రతినిధి రణధీర్ జైస్వాల్ వెల్లడించారు. ఉక్రెయిన్ తో జరుగుతున్న యుద్ధంలో 126 మంది భారతీయులు పాల్గొన్నట్టు సమాచారం ఉందని తెలిపారు. వీరిలో 96 మంది సైన్యం నుంచి బయటకు వచ్చారని చెప్పారు. వీరిలో కొందరు స్వదేశానికి తిరిగొచ్చారని వెల్లడించారు. ఇప్పటి వరకు యుద్ధంలో పోరాడుతూ 12 మంది మరణించారని తెలిపారు. అక్కడే ఉండిపోయిన వారిని త్వరగా స్వదేశానికి రప్పించేందుకు చర్యలు తీసుకుంటున్నామని చెప్పారు. ఉక్రెయిన్‌పై యుద్ధంలో రష్యా తరుపున పోరాడిన భారతీయుల్లో 12 మంది మరణించారు. మరో 16 మంది ఆచూకీ తెలియడం లేదు. విదేశాంగ మంత్రిత్వ శాఖ ఈ విషయాన్ని నిర్ధారించింది. యుద్ధంలో మరణించిన భారతీయుల మృతదేహాలను, గాయపడిన వారిని దేశానికి రప్పించేందుకు ప్రయత్నిస్తున్నట్లు వివరించింది. ఉక్రెయిన్‌తో యుద్ధంలో రష్యా తరుపున ఫైట్ చేసిన కేరళకు చెందిన బినిల్ బాబు మరణించాడు. గాయపడిన మరో భారతీయుడు జైన్ టికె, మాస్కోలోని ఆసుపత్రిలో చికిత్స పొందుతున్నాడు. కాగా, తాజా మరణాల నేపథ్యంలో ఉక్రెయిన్ యుద్ధంలో రష్యా తరుపున పోరాడుతున్న భారతీయులపై విదేశాంగ మంత్రిత్వ శాఖ స్పందించింది. విదేశాంగ మంత్రిత్వ శాఖ ప్రతినిధి రణధీర్ జైస్వాల్ శుక్రవారం మీడియాతో మాట్లాడారు. ఇప్పటి వరకు 126 మంది భారత పౌరులు రష్యా సైన్యంలో పని చేశారని తెలిపారు. 96 మందిని రష్యా ఆర్మీ నుంచి డిశ్చార్జ్ చేయడంతో వారు దేశానికి తిరిగివచ్చినట్లు చెప్పారు. మరోవైపు రష్యా సైన్యంలో చేరిన వారిలో 12 మంది భారతీయ పౌరులు మరణించారని రణధీర్ జైస్వాల్ తెలిపారు. ప్రస్తుతం రష్యా ఆర్మీలో 18 మంది భారతీయులు మిగిలి ఉన్నట్లు చెప్పారు. అయితే వీరిలో 16 మంది ఆచూకీ తెలియడం లేదని అన్నారు. వారు తప్పిపోయినట్లుగా రష్యా పేర్కొన్నదని వివరించారు. మిగిలిన భారతీయులను రష్యా ఆర్మీ నుంచి డిశ్చార్జ్ చేసి త్వరగా స్వదేశానికి పంపాలని ఆ దేశాన్ని భారత్ కోరిందన్నారు.

## ఆయుష్మాన్ భారత్ అతిపెద్ద స్కామ్




**న్యూఢిల్లీ:** ఆయుష్మాన్ భారత్ అతిపెద్ద స్కామ్ అని ఆమ్ ఆద్మీ పార్టీ (ఆప్) కన్వీనర్ అరవింద్ కేజ్రీవాల్ ఆరోపించారు. ఇది నకిలీ స్కామ్ అని సుప్రీంకోర్టు ధృవీకరించడం తనకు సంతోషంగా ఉందని చెప్పారు. కేంద్రంలో ప్రభుత్వం మారి దర్యాప్తు చేపడితే ఆయుష్మాన్ భారత్ పథకంలో జరిగిన భారీ అవినీతి గురించి ప్రజలకు తెలుస్తుందని అన్నారు. కాగా, ఢిల్లీలోని ఆప్ ప్రభుత్వం ఆయుష్మాన్ భారత్ ఆరోగ్య పథకాన్ని అమలు చేయడంలేదు. ఈ నేపథ్యంలో పీఎం ఆయుష్మాన్ భారత్ హెల్త్ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ మిషన్ (పీఎం-అభీమ్)ను ఢిల్లీలో అమలు చేయడానికి జనవరి 5 లోగా కేంద్ర ఆరోగ్య మంత్రిత్వ శాఖతో అవగాహన ఒప్పందం (ఎంవోయూ)పై సంతకం చేయాలని డిసెంబర్ 24న ఆప్ ప్రభుత్వాన్ని ఢిల్లీ హైకోర్టు ఆదేశించింది. మరోవైపు ఢిల్లీలోని ఆప్ ప్రభుత్వం దీనిపై సుప్రీంకోర్టును ఆశ్రయించింది. ఢిల్లీ హైకోర్టు ఆదేశాలను సవాల్ చేసింది. జస్టిస్ బీఆర్ గవాయ్, జస్టిస్ అగస్టిన్ జార్జ్ మాసిహ్‌లతో కూడిన ధర్మాసనం శుక్రవారం ఈ పిటిషన్‌పై విచారణ జరిపింది. ఆయుష్మాన్ భారత్ అమలు కోసం ఒప్పందం చేసుకోవాలన్న ఢిల్లీ హైకోర్టు ఆదేశాలపై స్టే విధించింది. కేంద్రం, ఇతరుల స్పందన కోరుతూ నోటీసులు జారీ చేసింది.

## మహిళా సాధికారికత లక్ష్యంగా



న్యూఢిల్లీ: దేశ రాజధాని వాసులకు పలు సంక్షేమ చర్యలకు భరోసా ఇస్తూ భారతీయ జనతా పార్టీ ఢిల్లీ అసెంబ్లీ ఎన్నికల మేనిఫెస్టో 'సంకల్ప్ పత్ర-1'ను శుక్రవారంనాడు ప్రకటించింది. పార్టీ ప్రధాన కార్యాలయంలో ఈ మేనిఫెస్టోను బీజేపీ జాతీయ అధ్యక్షుడు జేపీ నడ్డా విడుదల చేశారు. ఓటర్లను ఆకర్షించే ప్రయత్నంలో భాగంగా ఢిల్లీలోని ప్రతి మహిళలకు రూ.2,500 ఆర్థిక సాయం అందిస్తామని బీజేపీ ప్రకటించింది. మహిళా సాధికారికత లక్ష్యంగా వారికి మరింత ఆర్థిక పరిపుష్టి కల్పిస్తామని హామీ ఇచ్చింది. పెరుగుదుల ధరవరలతో గృహాలపై పడుతున్న భారాన్ని దష్టిలో ఉంచుకుని ఎల్పీజీ సిలెండర్లపై రూ.500 సబ్సిడీ ఇస్తామని వాగ్దానం చేసింది. మేనిఫెస్టో విడుదల అనంతరం జేపీ నడ్డా మీడియాతో మాట్లాడుతూ, నగర వాసుల జీవన ప్రమాణాలు మెరుగుపరచేందుకు కొత్తగా చర్యలు తీసుకుంటూ అమల్లో ఉన్న సంక్షేమ పథకాలను కొనసాగిస్తామని చెప్పారు. బడుగు వర్గాలతో సహా సమాజంలోని అన్నివర్గాలను సంక్షేమానికి పార్టీ కృషి చేస్తుందన్నారు. 2014లో తాము 500 వాగ్దానాలు చేశామని, 499 వాగ్దానాలను అమలు చేశామని, 2019లో 235 వాగ్దానాల్లో 225 నెరవేర్చామని చెప్పారు. తక్కినవి కూడా వివిధ దశల్లో అమలుకు సిద్ధమవుతున్నాయని నడ్డా చెప్పారు.

**మేనిఫెస్టోలో కీలక వాగ్దానాలు**

-మహిళా సమృద్ధి యోజన కింద రూ.2,500 ఆర్థిక సాయం
-ఢిల్లీలోని పేద మహిళలకు రూ.500 సిలెండర్ సబ్సిడీ
-ప్రతి హోలి, దిపావళికి ఒక సిలెండర్ ఉచితం
-మహిళలకు 6 న్యూట్రీషనల్ కిట్‌లు, గర్భిణీ స్త్రీలకు రూ.21,000 సాయం
-తొలి మంత్రివర్గ సమావేశంలోనే ఆయుష్మాన్ భారతి యోజనకు నిర్ణయం, అదనంగా రూ.50,00 హెల్త్ కవర్.

## 31 నుంచి పార్లమెంటు బడ్జెట్ సమావేశాలు

**న్యూఢిల్లీ:** పార్లమెంటు బడ్జెట్ సమావేశాలు ఖరారయ్యారు. రెండు విడతలుగా జరిగే ఈ సమావేశాల్లో తొలి విడత జనవరి 31 నుంచి ఫిబ్రవరి 13 వరకు జరుగుతాయి. రెండో విడత సమావేశాలు మార్చి 10 నుంచి ఏప్రిల్ 4 వరకూ జరుగుతాయి. పార్లమెంటు సమావేశాల షెడ్యూల్ ప్రకారం, ఈనెల 31న పార్లమెంటులో రాష్ట్రపతి ద్రౌపది ముర్ము ప్రసంగంతో సమావేశాలు ప్రారంభవుతాయి. ఫిబ్రవరి 1న 2025-26 ఆర్థిక సంవత్సరానికి సంబంధించిన సాధారణ బడ్జెట్‌ను కేంద్ర మంత్రి నిర్మలా సీతారామన్ పార్లమెంటులో ప్రవేశపెడతారు. ఢిల్లీ అసెంబ్లీ ఎన్నికల కారణంగా ఫిబ్రవరి 5న, రవిదాస్ జయంతి నేపథ్యంలో ఫిబ్రవరి 12న పార్లమెంటు కార్యకలాపాలకు సెలవు ఇవ్వాలని నిర్ణయించారు. శుక్రవారం సాయంత్రం అధికారికంగా ప్రకటన వెలువడే అవకాశం ఉంది.

## ఆసుపత్రి రూఫ్‌టాప్‌పై హెలిప్యాడ్.. ఈ తరహాలో ఇదే మొదటిది



కోల్‌కతా: పశ్చిమబెంగాల్ రాజధాని కోల్‌కతాలోని ఓ ప్రైవేటు ఆసుపత్రి అరుదైన ఘనత సాధించింది. ఆసుపత్రి రూఫ్‌టాప్‌పై హెలిప్యాడ్‌ను నిర్మించి విజయవంతంగా ట్రయిల్ రన్ నిర్వహించింది. బెహలా ఫ్లైయింగ్ క్లబ్ నుంచి బయలు దేరిన అగస్టా 109 ఎస్‌పీ హెలికాప్టర్ శుక్రవారంనాడు ఆసుపత్రి రూఫ్‌టాప్‌పై సక్సెస్‌ఫుల్‌గా ల్యాండ్ అయింది. ఎమర్జెన్సీ హెల్త్‌కేర్ సేవల్లో ఇదొక కీలకమైన మైలురాయి అని ప్రైవేటు సూపర్ స్పెషాలిటీ దేసున్ హాస్పిటల్ ప్రకటించింది. ఎమర్జెన్సీ హెల్త్‌కేర్ సేవల కోసం దేసున్ హాస్పిటల్ రూఫ్‌టాఫ్ హెలిప్యాడ్ సేవలకు డైరెక్టర్ జనరల్ ఆఫ్ సివిల్ ఏవియేషన్ జనవరి 14న అనుమతి ఇచ్చింది. తొలి ట్రయిల్ రన్ నిర్వహించాలని ఆదేశాలిచ్చింది. శుక్రవారంనాడు నిర్వహించిన ట్రయిల్ రన్ విజయవంతం కావడంపై దేసున్ ఆసుపత్రి చైర్మన్ అండ్ మేనేజింగ్ డెరెక్టర్ సాజల్ దత్తా సంతోషం వ్యక్తం చేశారు. "ఇది మా అందరికీ గర్వకారణం. తీవ్ర ప్రాణాపాయంలో చిక్కుకున్న పేషెంట్లకు ఎమర్జెన్సీ సేవలు అందించేందుకు ఈ హెలిఫ్యాడ్ ఎంతో ఉపయోగపడుతుంది. పశ్చిమబెంగాల్‌కు మాత్రమే కాకుండా ఈశాన్య, తూర్పు భారతదేశంలోని వారందిరికీ ఈ అత్యవసర సేవలు అందుబాటులోకి తెస్తా" అని సాజల్ దత్తా తెలిపారు.

## కంగనా 'ఎమర్జెన్సీ'కి వ్యతిరేకంగా పంజాబ్‌లో నిరసన




**చండీఘడ్:** సినీ నటి కంగనా రనౌత్ నటించిన ఎమర్జెన్సీ చిత్రం ఇవాళ రిలీజ్ అవుతున్నది. మాజీ ప్రధాని ఇందిరా గాంధీ జీవితకథ ఆధారంగా ఈ చిత్రాన్ని తీశారు. అయితే ఆ ఫిల్మ్ రిలీజ్‌ను వ్యతిరేకిస్తూ ఇవాళ పంజాబ్‌లో సిక్కులు ఆందోళనకు దిగారు. అమృత్‌సర్‌లోని ఓ సినిమా హాల్ వద్ద భారీ సంఖ్యలో ఎస్‌జీపీసీ సభ్యులు ఆందోళన చేపట్టారు. ఎమర్జెన్సీ చిత్రంపై బ్యాన్ విధించాలని ఎస్జీపీసీ పంజాబ్ సర్కార్‌ను కోరింది.పంజాబ్‌లోని అన్ని సినిమా హాళ్లలో షోలను రద్దు చేయాలని కోరింది. కాంగ్రెస్ ఎంపీ, పంజాబ్ చీఫ్ అమరిందర్ సింగ్ రాజా.. మాట్లాడుతూ.. ఇలాంటి సినిమాలు తీసినప్పుడు, ఆ చిత్రాల్లో వాస్తవాలను వక్రీకరిస్తారని పేర్కొన్నారు. మసాలా లేకుండా సినిమా సక్సెస్ కాదన్నారు. ప్రజల్ని ఎంటర్‌టైన్ చేసేందుకు ఇలాంటి సినిమాలు తీయడం సరికాదన్నారు. ప్రభుత్వాలు, సెన్సార్ బోర్డులు .. ఇలాంటి చిత్రాలపై నిఘా పెట్టాలన్నారు. చిత్రంలో చూపించింది నిజం కాదు అని, అది కేవలం ఓ స్క్రిప్టు మాత్రమే అని ఆయన పేర్కొన్నారు.

## 255 మంది అధికారులకు నోటీసులు.. విషయం ఏంటంటే..

**బళ్లారి(బెంగళూరు):** ప్రభుత్వ అధికారుల పనితీరుపై జిల్లాలో 95 ఫిర్యాదులు నమోదు కాగా, వాటిని ఈ నెల 18వ తేదీన ఉప లోకాయుక్త అధికారి జస్టిస్ బి.వీరప్ప విచారించనున్నారు. వివిధ శాఖలకు చెందిన 255 మందిపై అధికారులు 95మంది లోకాయుక్తకు ఫిర్యాదు చేశారు. వీరందరికి జిల్లా లోకాయుక్త ఎస్పీ ఇప్పటికే నోటీసులు జారీ చేశారు. ఈ నెల 18వ తేదీన జరగనున్న ఉప లోకాయుక్త విచారణలో నోటీసులు అందుకున్న అధికారులు, ఆయా శాఖల ప్రధాన అధికారులు విచారణ కు హాజరు కావాల్సి ఉందని నోటీసులో సూచించారు. అన్ని కేసులు విచారణ జరపనున్న ఉప లోకాయుక్త అధికారి అదేరోజు ఆదేశాలు జారీ పిర్యాదులు పరిష్కరించనున్నట్లు సమాచారం. చాలా వరకు కేసులు ఇప్పటికే విచారణ జరిగాయి. ఇంకా కొన్నికేసులు విచారణ చేయాల్సి ఉంది. ఉప లోకాయుక్త అధికారి బళ్ళారి పర్యటన నేపథ్యంలో జిల్లా పాలనామండలికి చురుకు ముట్టినట్లు అయింది. లోకాయుక్త అధికారులు ఏ ప్రభుత్వ కార్యాలయానికి ఎపుడు వస్తారోనని అధికారుల గుండెల్లో రైళ్ళు పరుగెడుతున్నాయి. దీంతో రాత్రిపగలు తేడాలేకుండా ఆఫీసుల్లో పైళ్ళు సర్దేపనిలో నిమగ్నమయ్యారు.

జిల్లాధికారి ఆధ్వర్యంలో ఇప్పటికే వివిధ శాఖల అధికారులతో సమావేశాలు నిర్వహించి కార్యాలయాల్లో ఎలాంటి దోషాలు తలెత్తకుండా చూసుకోవాలని అధికారులకు సూచించినట్లు తెలుస్తోంది. దీంతో క్రింది స్థాయి ఉద్యోగులు, సిబ్బందికి కార్యాలయం ముఖ్యస్తులు విశ్రాంతి లేకుండా పనులు చేయిస్తున్నారు. గురువారం




ఉపలోకాయుక్త అధికారి ఆకస్మికంగా తనిఖీలు నిర్వహించారు. తెల్లవారు జామున బళ్ళారి ఏపీఎంసీ, జిల్లా ఆసుపత్రి, తాసీల్దారు కార్యాలయం, బళ్ళారి ఇనిస్టిట్యూట్ ఆఫ్ మెడికల్ కళాశాల(బిమ్స్)లో రోగులకు అందుతున్న వైద్యసేవలు గురించి పర్యవేక్షించడం గమనార్హం. జిల్లాస్థాయిలో అధికారులు, ప్రజా ప్రతినిధులు అవినీతికి సంబంధించి 30 కేసులు పెండింగ్‌లో ఉన్నట్లు, ఇందులో 15ఏళ్ళ క్రితం నమోదైన కేసులు ఉన్నట్లు తెలిసింది. కొన్నికేసులకు సంబంధించి చార్జ్‌షీట్ వేసేందుకు సంబంధిత అధికారుల నుండి అనుమతి కోరినట్లు తెలిసింది. కొన్ని అభ్యర్థులు తిరస్కరించగా, కొన్ని అభ్యర్ధలు మంజూరు చేసినట్లు విశ్వసనీయ వర్గాల ద్వారా సమాచారం. ఇటీవల జరిగిన శాసనసభ సమావేశాల్లో ఒక ప్రశ్నకు ప్రభుత్వం ఇచ్చిన సమాధానంలో ఈ వాస్తవాలు వెలుగుచూశాయి కేసుల స్వరూపం భిన్నంగా ఉండడంతో 18న విచారణ జరగనుందని అధికారుల సమాచారం.

## బార్‌లో అసభ్యకర ప్రవర్తన..

# 40 మందిపై కేసు నమోదు

**థానే:** మహారాష్ట్రలోని థానే జిల్లాలోని ఓ బార్‌లో అసభ్యకర ప్రవర్తన కింద 40 మందిపై కేసు నమోదు చేశారు. దీంట్లో 8 మంది మహిళా సర్వర్లు, మరికొంత మంది కస్టర్లు కూడా ఉన్నారు. బార్‌లో ఆ వ్యక్తులు అభ్యంతరకరంగా ప్రవర్తించినట్లు ఆరోపణలు ఉన్నాయి. కళ్యాణ్-షిల్ రోడ్డు మార్గంలో ఉన్న బార్‌లో అర్ధరాత్రి అధికారులు తనిఖీ నిర్వహించారు. ఆ సమయంలో బార్‌లో అసభ్యకర సంఘటన చోటుచేసుకున్నట్లు అధికారులు తెలిపారు. జనవరి 14వ తేదీ రాత్రి ఈ ఘటన జరిగింది. డోంబివాలిలోని మన్‌పాడా పోలీసులు.. బార్‌తో లింకున్న 23 మంది పురుషులపై కేసు బుక్ చేశారు. 8 మంది మహిళా సర్వర్లు, 8 మంది కస్టమర్లపై కూడా ఆ కేసు నమోదు చేశారు. కేసుతో లింకున్న ఎవర్నీ అరెస్టు చేయలేదు.



## సైఫ్ అలీ ఖాన్ కేసు.. పోలీసుల మరో ట్విస్ట్

ప్రముఖ నటుడు సైఫ్ అలీ ఖాన్‌పై దాడి హాట్ టాపిక్‌గా మారింది. దేశంలోని అన్ని చిత్రపరిశ్రమలను ఉలిక్కిపడేలా చేసిన ఈ కేసులో ఒక్కొక్కటిగా సంచలన విషయాలు బయటపడుతున్నాయి. గంటకో మలుపు తిరుగుతున్న ఈ కేసులో తాజాగా ముంబై పోలీసులు మరో బిగ్ ట్విస్ట్ ఇచ్చారు. వాడు వీడు కాదని.. అసలు నిందితుడు తమ అదుపులో లేడంటూ బాంబు పేల్చారు. ఇప్పటివరకు ఎవర్నీ అరెస్ట్ చేయలేన్నారు. సైఫ్ అలీ ఖాన్ కేసులో నిందితుడ్ని పోలీసులు అదుపులోకి తీసుకున్నారంటూ ఉదయం కథనాలు వచ్చాయి. దీనిపై పోలీసులు రియాక్ట్ అయ్యారు. పొద్దున బాంద్రా పోలీసు స్టేషన్‌కు తీసుకొచ్చిన వ్యక్తికి సైఫ్ మీద దాడితో సంబంధం లేదని స్పష్టం చేశారు. నిందితుడి కోసం తీవ్రంగా గాలిస్తున్నామని క్లారిటీ ఇచ్చారు. నిందితుడు తమ అదుపులో ఉన్నాడని వస్తున్న పుకార్లలో నిజం లేదని పేర్కొన్నారు. ఈ కేసులో ఇప్పటివరకు ఎవర్నీ అదుపులోకి తీసుకోలేదని చెప్పుకొచ్చారు.

# సంపాదకీయం

## సిఎం అభ్యర్థిలేని ఢిల్లీ ఎన్నికలు

ఢిల్లీ అసెంబ్లీ ఎన్నికలు బహుశా తొలిసారిగా, ఏ రాజకీయ పార్టీ కూడా ముఖ్యమంత్రి అభ్యర్థిని ప్రజల ముందు ఉంచలేని పరిస్థితుల్లో జరుగుతున్నాయి. మాజీ ముఖ్యమంత్రి, ఆప్ జాతీయ కన్వీనర్ అరవింద్ కేజ్రీవాల్ అధికార పార్టీకి ఎదురులేని నాయకుడైనప్పటికీ చట్టపరమైన చిక్కుల కారణంగా వారు ఆయనను తమ ముఖ్యమంత్రి అభ్యర్థిగా చెప్పలేకపోతున్నారు. బిజెపి, కాంగ్రెస్ రెండింటికీ దేశ రాజధానిలో తమ ముఖ్యమంత్రి అభ్యర్థిగా చూపించడానికి ప్రజాదరణ పొందిన లేదా బలమైన నాయకుడే లేరు. స్థానిక నాయకత్వం లేకపోవడంతో, వారు ఓటర్లను ఆకర్షించడానికి బయటి నుండి 'దిగుమతి చేసుకున్న' నాయకులు లేదా తమ హైకమాండ్‌లపై ఆధారపడుతున్నారు. మాజీ ఐపిఎస్ అధికారిణి కిరణ్ బేడిని తమ ముఖ్యమంత్రి అభ్యర్థిగా చూపించడం ద్వారా బిజెపి గతంలో ఒకసారి తప్పటడుగు వేసింది. ఓటర్లను లేదా బిజెపి కేడర్‌ను కూడా ఆమె ఉత్సాహపరచడంలో విఫలమయ్యారు. ఎన్నికల్లో పోటీ చేయడానికి ఆమె పుదుచ్చేరి లెఫ్టినెంట్ గవర్నర్ పదవికి రాజీనామా చేయాల్సి వచ్చింది. ఎన్నికల తర్వాత, ఆమె ప్రజాజీవితంలో ఎక్కడా కనిపించలేదు. అరవింద్ కేజ్రీవాల్ అధికార ఆప్‌కి కిరీటం లేని నాయకుడు కావడంతో సాధారణంగా అందరూ ఆ పార్టీ ముఖ్యమంత్రిగా భావిస్తున్నప్పటికీ ఆయన చట్టపరమైన చిక్కులను ఎదుర్కొంటున్నారు. సుప్రీం కోర్టు ఉత్తర్వుల ప్రకారం ఆయన అధికారిక ఫైళ్లపై సంతకం చేయలేరు లేదా సిఎం కార్యాలయంలోకి ప్రవేశించలేరు. దానితో ఆయనను తమ ముఖ్యమంత్రి అభ్యర్థిగా ఆప్ చెప్పలేకపోతున్నది. దానితో బిజెపి మార్గంలో ఆప్ కేజ్రీవాల్, సిఎం ఆతిశీ అనే డబుల్ ఇంజిన్ సర్కార్‌ను ప్రస్తావిస్తున్నారు. భారత ఎన్నికల కమిషన్ ఎన్నికల షెడ్యూల్ ప్రకటించడానికి చాలా ముందుగానే తన అభ్యర్థులందరినీ ప్రకటించడం ద్వారా ఆప్ సౌకర్యవంతమైన స్థితిలో ఉండగా, అభ్యర్థుల ఎంపికలో బిజెపి, కాంగ్రెస్ చివరి వరకు తికమకపడుతున్నాయి. అంతర్గత కలహాలు, బలమైన అభ్యర్థులను గుర్తించడంలో అనిశ్చితి వారి ఎంపికలను కష్టతరం చేశాయి. మొదట్లో, బిజెపి మాజీ కేంద్ర మంత్రి స్మృతి ఇరానీని సిఎం అభ్యర్థి కాబోతున్నట్లు ప్రచారం జరిగింది. కానీ, ఆర్ఎస్ఎస్ కార్యకర్తల బలమైన వ్యూహాత్మక నిర్వహణతో హర్యానా, మహారాష్ట్రలలో గొప్ప ప్రయోజనం పొందిన తర్వాత, బిజెపి ఇప్పుడు సొంతంగా సిఎం అభ్యర్థులను ప్రకటించే సాహసం చేయలేకపోతోంది. 26 ఏళ్లుగా ఢిల్లీలో అధికారానికి దూరంగా ఉంటూ వస్తున్న బిజెపి ఈసారి ఎట్లాగైనా అధికారం చేపట్టాలని పట్టుదలగా ఉంది. పదేళ్ల ఆప్ ప్రభుత్వం ఎదుర్కొంటున్న ప్రభుత్వ వ్యతిరేకత అందుకు అనుకూలం కాగలదని ఆశిస్తున్నది. మొహల్లా క్లినిక్‌లు, కార్పొరేట్ స్థాయిలో మున్సిపల్ పాఠశాలలను ఏర్పాటు చేయడం ద్వారా ప్రజలలో కొంతమేరకు కేజ్రీవాల్ దేశంలో మరే ఇతర ముఖ్యమంత్రి సాధింపలేని పాలనా విజయాలు సాధించినా గెలుపుకోసం అవి మాత్రమే సరిపోవు. ప్రపంచంలోనే అత్యంత కాలుష్యమైన, అపరిశుభ్రమైన దేశరాజధానిగా నేడు ఢిల్లీ అప్రతిష్ఠకు గురవుతున్నది. ప్రధాని నరేంద్ర మోడీ చెబుతున్నట్లు మరో మూడేళ్లలో భారత్ ప్రపంచంలో మూడవ అతిపెద్ద ఆర్థిక వ్యవస్థగా ఎదిగినా, 2047 నాటికి 'వికసిత్ భారత్'గా అభివృద్ధి చెందినా ఇటువంటి రాజధాని నగరంతో అంతర్జాతీయంగా భారత్ సగర్వంగా నిలబడలేదు. ఒక వంక మురికి కాలువగా మారిపోయిన యమునా నది, ఇంకోవైపు ఎటుచూసినా కనిపించే వ్యర్థపదార్ధాలు, ఇవికాకుండా కాలుష్యం..ఇవన్నీ కలిసి కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల అసమర్థత, వైఫల్యాలు ప్రజల ముందు నిలుస్తున్నాయి. అవినీతి వ్యతిరేక ఉద్యమం నుండి ప్రజాజీవనం ప్రారంభించిన కేజ్రీవాల్ స్వయంగా అవినీతి కేసులో జైలుకు వెళ్లిరావడం, ఆయన సహచరులు అనేకమంది వెళ్లడం కూడా ఆ పార్టీని ఆత్మరక్షణలో పడేస్తున్నాయి. ఆ కేసులు అన్ని రాజకీయ కక్షసాధింపుగా నమోదు చేసినవి అని చెబుతున్నా, ఆ కేసులు ఏవీ న్యాయస్థానాల ముందు నిలబడే అవకాశాలు లేకపోయినా జరగాల్సిన నష్టం జరిగిపోయింది. అందుకనే తన రాజకీయ జీవనంలో పెనుసవాల్‌ను ఇప్పుడు ఆయన ఎదుర్కొంటున్నారు. మరోవంక, సైతం బలమైన స్థానిక నాయకత్వం లేకపోవడంతో 2014 నుండి వరుసగా మొత్తం 7 లోక్‌సభ సీట్లను గెల్చుకుంటున్నప్పటికీ అసెంబ్లీ ఎన్నికలలో పరాజయం తప్పడం లేదు. మీడియాలో సంచలనాలు సృష్టించే నాయకులపై ఆధారపడుతుంది. కానీ ఆప్ మాదిరిగా క్షేత్రస్థాయిలో జనం మధ్యలో పనిచేసే నాయకులను ప్రోత్సహించడం లేదు. దానితో మొదటిసారిగా ఢిల్లీ మున్సిపల్ ఎన్నికల్లో సైతం పరాజయం తప్పలేదు. 'శేష్ మహల్' గురించి కొంతమేరకు కేజ్రీవాల్‌ను ఇరకాటంలో పడవేసిన బంగారు పూత పూసిన టాయిలెట్ ఫిట్టింగ్‌లు, స్విమ్మింగ్ పూల్ వంటి అద్భుతమైన ప్రచారాలు వివరాలు అవాస్తవమని వెల్లడి కావడంతో వెంటనే బిజెపి తమ ప్రచారాన్ని మార్చివేశారు. వారు కేజ్రీవాల్ ఉత్తరప్రదేశ్, బీహార్ ప్రజలను 'ద్వేషిస్తున్నాడని' ఆరోపించడంపై దృష్టి సారించారు. ఉత్తరప్రదేశ్, బీహార్ నుండి తీసుకువచ్చిన నమోదిత ఓటర్లలో అకస్మాత్తుగా, వివరించలేని పెరుగుదల ఉందని ఆప్ అభ్యంతరాన్ని వ్యక్తం చేయడాన్ని వారు ఈ విధంగా ఉపయోగించుకునే ప్రయత్నాలు చేశారు. ఏదో ఒక దుష్ప్రచారంతో ఆప్‌ను ఆత్మరక్షణలో పడవేసి ప్రయత్నం కాకుండా నేరుగా ఢిల్లీ ఓటర్లను ఆకట్టుకునే విధంగా బిజెపి ప్రచారం చేయలేకపోతున్నారు. చివరకు ప్రధాన మంత్రి సైతం వ్యక్తిగత విమర్శలతో కేజ్రీవాల్ ప్రభావం ప్రజలపై తగ్గించేందుకు ప్రయత్నం చేస్తున్నట్లు స్పష్టం అవుతుంది. అంతేగాని, ఢిల్లీ రూపురేఖలను తాము ఏ విధంగా మార్చగలమో చెప్పే ప్రయత్నం చేయడం లేదు. గతంలో యుపిఎ హయాంలో ఢిల్లీకి ఇతర రాష్ట్రాల మాదిరిగా పూర్తి రాష్ట్రస్థాయి అధికారాలు ఇవ్వాలని ఆందోళనలు జరిపిన బిజెపి గత పదేళ్లుగా ఢిల్లీ ముఖ్యమంత్రి అధికారాలను గణనీయంగా తగ్గించి వేసింది. పేరుకు రాష్ట్ర ప్రభుత్వమే అయినప్పటికీ ఓ మున్సిపల్ కార్పొరేషన్ మాదిరిగా ఢిల్లీ ప్రభుత్వాన్ని కేంద్రంలోని బిజెపి మార్చివేసింది. మరోవంక జమ్మూకశ్మీర్‌కు త్వరలో రాష్ట్ర హోదాను పునరుద్ధరిస్తామని స్వయంగా ప్రధాని మోడీ హామీ ఇచ్చి ఏళ్ళుగడుస్తున్నా ఆ దిశలో ఎటువంటి చర్యలకు పాల్పడటం లేదు. దానితో ఢిల్లీ ప్రభుత్వంలో గణనీయ మార్పులను తీసుకురాగలమనే భరోసాను ప్రజలలో బిజెపి కలిగించలేకపోతున్నది. ఢిల్లీ తీవ్రమైన నీటి ఎద్దడి ఎదుర్కొంటున్న సమయంలో పొరుగున ఉన్న హర్యానాలోని బిజెపి ప్రభుత్వం సహకరించే విధంగా కేంద్రం ఎటువంటి చొరవ తీసుకోలేకపోయింది. ఢిల్లీలోని దళితుల మద్దతు పొందటం బిజెపికి ఓ సవాల్‌గా మారే సూచనలు కనిపిస్తున్నాయి. అంబేద్కర్‌పై ఇటీవల రాజ్యసభలో హోం మంత్రి అమిత్ షా మాట్లాడిన విధానం ఈ పార్టీ పట్ల దళిత వర్గాలలో ప్రతికూల సంకేతాలు వ్యాపించేందుకు దోహదపడుతున్నాయి.

ఈ క్రమంలో 12 ఎస్‌సి రిజర్వ్‌డ్ సీట్లు, మెజారిటీ దళిత ఓట్లు ఉన్న 30 నియోజకవర్గాలపై దృష్టి సారించింది. 2015, 2020 ఢిల్లీ శాసనసభ ఎన్నికల్లో 12 ఎస్‌సి రిజర్వ్‌డ్ నియోజకవర్గాలలో బిజెపి ఒక్క సీటు కూడా గెలుచుకోలేక పోయింది. అంతకుముందు జరిగిన ఎన్నికల్లోనూ 2-3 సీట్లతోనే సరిపెట్టుకుంది. దళితుల ప్రాబల్యం గల నియోజకవర్గాలపై ప్రత్యేకంగా దృష్టి సారిస్తున్నప్పటికీ బిజెపి ఏమాత్రం వారిని ఆకట్టుకోగలదో చూడాల్సి ఉంది. వాస్తవానికి కేజ్రీవాల్‌తో సమానంగా ప్రజాదరణ గల నాయకులు ఎవ్వరూ బిజెపిలో లేరు. అందుకనే ముఖ్యమంత్రి అభ్యర్థిని ప్రకటించేందుకు బిజెపి వెనకాడుతుంది. పైగా పలు రాష్ట్రాల్లో ముఖ్యమంత్రి అభ్యర్థిని ప్రకటించకుండానే గెలుపొంది, ప్రభుత్వాలు ఏర్పాటు చేయడం, ప్రజాదరణతో సంబంధం లేకుండా ముఖ్యమంత్రులను ఎంపిక చేస్తున్న బిజెపి ఢిల్లీలో సైతం కేవలం ప్రధాని మోడీ ప్రజాకర్షణపైననే ఆధారపడుతుంది. అయితే గత ఏడాది లోక్‌సభ ఎన్నికల సమయం నుండి ఓటర్లను ఆకర్షించడంతో మోడీకి సైతం పరిమితులున్నాయని స్పష్టం కావడం బిజెపికి ప్రమాద సంకేతాలను సూచిస్తున్నది. ముఖ్యంగా ధరల పెరుగుదల, నిరుద్యోగం, ఉపాధి అవకాశాలు సన్నగిల్లడం వంటి అంశాలు బిజెపి నుండి యువతను, మధ్యతరగతి ప్రజలను దూరం చేస్తుంది. అందుకనే ఢిల్లీ ఎన్నికలు బిజెపి నాయకత్వంపై అగ్నిపరీక్షగా మారాయి. ఈ ఎన్నికలలో గెలుపొందితే జాతీయ స్థాయిలో బిజెపికి వ్యతిరేకంగా కాంగ్రెస్‌తో సంబంధం లేకుండా కేజ్రీవాల్, అఖిలేష్, మమతా బెనర్జీ వంటి వారు కలిసి బలమైన ప్రత్యామ్నాయం అందించే ప్రయత్నం చేసే అవకాశం ఉంటుంది. బిజెపికి సైతం జాతీయ స్థాయిలో రాహుల్ గాంధీ కాకుండా మరో నాయకుడు మోడీకి పోటీగా ఎదగడం ఇష్టం లేదు. అందుకనే కేజ్రీవాల్‌ను ఓడించడం ఆ పార్టీకి చాలా అవసరంగా ఉంది. ఢిల్లీ ఎన్నికలలో కాంగ్రెస్ ఓ రకంగా ఏకాకిగా పోటీ చేస్తున్నది. ప్రతిపక్షాలు ఆప్ పట్ల సానుకూలత వ్యక్తం చేయడం రాబోయే రోజులలో జాతీయ స్థాయిలో ఆ పార్టీ మరింత ఏకాకిగా మారే సంకేతాలను అందిస్తున్నది.

# ఇస్రో కిరీటంలో మరో కలికితురాయి




భారత అంతరిక్ష పరిశోధన సంస్థ (ఇండియన్ స్పేస్ రిసెర్చ్ ఆర్గనైజేషన్, ఇస్రో) ఘనమైన కిరీటంలో మరో కలికితురాయి చేరి మురిసింది. భవ్య భారతం మరో చారిత్రక అంతరిక్ష విజయం సగర్వంగా స్వంతం చేసుకుంది. 2024 ముగుస్తున్న శుభ గడియల్లో ఇస్రో ప్రయోగించిన 99వ పిఎస్ఎల్‌వి-సి60 మానవరహిత అంతరిక్ష ఉపగ్రహాల అనుసంధాన (స్పేస్ డాకింగ్ ఎక్సపరిమెంట్ మిషన్, స్పెడెక్స్) మిషన్‌ను 07 డిసెంబఱర్ 2024న శ్రీహరికోట అంతరిక్ష కేంద్రం నుంచి విజయవంతంగా ప్రయోగించగా 16 జనవరి 2025 వేకువ జామున అనుసంధాన లక్ష్యాన్ని ఛేదించడంలో విజయం సాధించిన అమెరికా, రష్యా, చైనా దేశాల సరసన 4వ దేశంగా చేరడం ప్రతి భారతీయుడికి గర్వకారణంగా నిలుస్తున్నది. ఈ అంతరిక్ష ఉపగ్రహ అనుసంధాన ప్రక్రియ విజయవంతం కావడంతో రానున్న రోజుల్లో ఇస్రో చేపట్టబోయే భారీ అంతరిక్ష యాత్రలకు కీలక పరిజ్ఞానాన్ని ఒడిసిపట్టనున్నది. స్పెడెక్స్ మిషన్ ద్వారా ఒక్కొక్కటి 220 కేజీల బరువు కలిగిన రెండు స్పేస్‌క్రాఫ్టు లేదా వ్యోమనౌకలను పిఎస్ఎల్‌వి రాకెట్ సహాయంతో భూమికి 475 కిమీ దూరంలో ఒకే కక్ష్యలో ఒక్కొక్క దానికి 15 కిమీ దూరం ఉండే విధంగా ప్రవేశపెట్టారు. ఈ రెండు స్పేస్‌క్రాఫ్టుల్లో ఒక దానిని 'టార్గెట్' అని, రెండవ దానిని 'చేజర్' అని పిలుస్తారు. ఈ రెండు వ్యోమనౌకలు 16 జనవరి 2025 ఉదయ వేళ వేగ నియంత్రణతో పరస్పరం దగ్గరకు తీసుకువచ్చి అనుసంధానం కావడంతో ఛేజర్ నెమ్మదిగా టార్గెట్‌కు చేరువై రెండు ఉపగ్రహాలు అనుసంధాన ప్రక్రియ పూర్తి కావడంతో స్పెడెక్స్ ప్రయోగం విజయవంతం అయినట్లు ఇస్రో శాస్త్రవేత్తలు సగర్వంగా ప్రకటించారు. స్పేస్‌క్రాఫ్టుల అనుసంధాన ప్రక్రియ టెక్నాలజీ పునాదిగా రానున్న రోజుల్లో అనేక అత్యాధునిక అంతరిక్ష సవాళ్లను అధిగమించడానికి మార్గం సుగమం అయినట్లు వివరిస్తున్నారు. స్పెడెక్స్ ప్రయోగాలతో ఉపగ్రహాల రిపేరింగ్ లేదా సర్వీసింగ్, 2035 నాటికి అంతరిక్షంలో "భారతీయ అంతరిక్ష స్టేషన్" ఏర్పాటు, చంద్ర మండల సాంపిల్స్ తీసుకురావడం, ఒక ఉపగ్రహం లేదా వ్యోమనౌక నుంచి మరో దానికి మెటీరియల్ బదిలీ చేయడం, ఒక స్పేస్‌క్రాఫ్ట్ నుంచి మరో స్పేస్‌క్రాఫ్ట్‌లోకి మానవుల బదిలీ, విద్యుత్ శక్తి బదిలీ, చంద్ర మండలంపై ప్రయోగాలను ముమ్మరంగా చేయడం, వ్యోమనౌకలకు ఇంధనం అందించడం, వ్యోమనౌకల జీవితకాలాలను పెంచడం, బహురాకెట్ల ప్రయోగాలను సులభంగా చేయడం, మేక్రోగ్రావిటీలో భారీ మౌళిక వనరులను అసెంబ్లింగ్ చేయడం, ప్రైవేట్ భాగస్వామ్యాలతో అంతరిక్ష ప్రయోగాలకు ఊపిరులూదడం లాంటి అత్యాధునిక అంతరిక్ష ప్రయోగాలకు ప్రయోజనాలు చేకూరనుంది. 2023లో "చంద్రయాన్-3" ప్రయోగంతో ఎవరూ ప్రయత్నించని చంద్ర మండల దక్షిణ ధృవంపై వ్యోమనౌక కాలుమోపడంతో ఆ ఘనత సాధించిన నాలుగవ దేశంగా కీర్తిని గడించడం చూసాం, హర్షాతిరేకాలు వ్యక్తం చేసాం. అదే ఊపులో 2024సో ఇస్రో చేసిన అంతరిక్ష ప్రయోగాల్లో అంతర్జాతీయ అంతరిక్ష ప్రయోగాల యాత్రలో భారతం తన స్థానాన్ని పదిలపరుచుకోవడం సంతోషదాయకం. 2024లో ఇస్రో ప్రయోగించిన ముఖ్య ప్రయోగాల్లో ఎక్స్-రే అధ్యయన పిఎస్ఎల్‌వి-సి58, సౌర అధ్యయనానికి ఉద్దేశించిన ఆదిత్య-ఎల్1 హారంలో ఆర్బిట్, అత్యాధునిక వాతావరణ అంచనాకు ప్రయోగించిన జిఎస్ఎల్‌వి-ఎఫ్14/ఇన్సాట్-3డిఎస్, విపత్తు/ పర్యావరణ నిర్వహణకు ఈఓఎస్-08, సమాచార వితరణకు జిఎస్ఏటి-ఎన్2ల తో పాటు ఏడాది చివరన విజయవంతంగా ప్రయోగించిన 99వ ఇస్రో ప్రయోగం "స్పెడెక్స్" ఉపగ్రహ అనుసంధాన ప్రయోగాలు భారత అంతరిక్ష పరిశోధనలకు మచ్చుతునకలుగా నిలుస్తున్నాయి. 2025 జనవరి చివర వారంలో ఇస్రో ప్రయోగించనున్న 100వ జిఎస్ఎల్‌విఎంకె-2 రాకెట్ మన ఇస్రో విజయ ప్రస్థానాన్ని కొనసాగించనుంది. 2028లో తొలి వీనస్ మిషన్ చేపట్టేందుకు ఇస్రో ఏర్పాట్లు చేస్తున్నది. 2027లో నిర్వహించనున్న మరో చంద్రయాన్-4 ప్రోగ్రామ్ ద్వారా చంద్ర మండలంపై సాంపుల్స్ సేకరించి మరో ఉపగ్రహ అనుసంధానంతో వాటిని తీసుకురానున్నారు. భారత అంతరిక్ష చరిత్రలో మరో వినూత్న అధ్యాయానికి తెర లేపిన ఇస్రో రానున్న రోజుల్లో పలు అత్యాధునిక సాంకేతిక కలిగిన ఉపగ్రహాల ప్రయోగంతో ప్రపంచ దేశాలను అబ్బురపరచాలని, 2035 నాటికి మనదైన భారతీయ అంతరిక్ష కేంద్రాన్ని ఏర్పాటు చేయాలని, నేటి డాకింగ్ ప్రయోగాలతో రేపటి అంతరిక్ష యాత్ర కొత్తపుంతలు తొక్కాలని కోరుకుందాం. స్పెడెక్స్ ప్రయోగం విజయవంతం కావడంలో అహర్నిషలు కృషి చేసిన శాస్త్రవేత్తల బృందానికి శుభాకాంక్షలు తెలియజేద్దాం.

# నటపరిపాలనా సార్వభౌముడు ఎన్‌టిఆర్



తెలుగువారు "అన్నగారు" అని అభిమానంతో, ప్రేమతో, ముద్దుగా పిలుచుకునే నందమూరి తారక రామారావు, అటు సినీరంగంలో అటు రాజకీయ రంగంలో మకుట రహిత మహారాజుగా ఖ్యాతిని ఆర్జించారు. తెలుగు, తమిళం, హిందీ భాషలలో కలిపి దాదాపు 400 చిత్రాలలో తన నటనా చాతుర్యాన్ని ప్రదర్శించారు. నటనకే పరిమితం కాక, పలు చిత్రాలను నిర్మించి, మరి ఎన్నింటికో దర్శకత్వం బాధ్యతలు చేపట్టారు. సినీ కళామతల్లి సేవలతో పాటు, ప్రజా సేవ కూడా చేయాలని నిర్ణయించుకొని, రాజకీయ పార్టీని స్థాపించి కేవలం తొమ్మిది మాసాల్లోనే ఆంధ్రప్రదేశ్ లో కాంగ్రెస్ పార్టీ ఏకచ్ఛత్రాధిపత్యానికి తెరదించి, హస్తానికి అధికారాన్ని గతం చేసి, తెలుగుదేశం పక్షాన హస్తగతం చేసుకున్నారు. మూడు విడతలుగా ఏడు సంవత్సరాల పాటు అవిభక్త ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రిగా పని చేశారు. పట్టుదలకు, క్రమశిక్షణకు మారుపేరుగా తెలుగు భాషకు, తెలుగు జాతికి, దేశవ్యాప్త గుర్తింపు తెచ్చిన బహుముఖ ప్రజ్ఞాశాలి, అఖిలాంధ్ర అందాల నటుడు నందమూరి తారక రాముడు. నాలుగు దశాబ్దాల సినీ ప్రస్థానంలో, పదమూడేళ్ల రాజకీయ జీవితంలో చిరస్మరణీయునిగా వెలుగొందారు ఆయన. ఎన్టీఆర్, విశ్వవిఖ్యాత నటసార్వభౌముడు"గా ఖ్యాతిగాంచారు. శ్రీరాముడు, శ్రీకృష్ణుడు, సుయోధనుడు రావణుని వంటి పౌరాణిక పాత్రల తో బాటు వైవిధ్య భరిత సాంఘిక, జానపద చిత్రాలలో విభిన్న పాత్రలను పోషించారు. సాటిలేని మేటిగా "చిత్రసీమ రారాజుగా భాసిల్లిన స్థితప్రజ్ఞులు రామారావు, 44 ఏళ్ల సినీ ప్రస్థానంలో, 13 చారిత్రక, 55 జానపద, 186 సాంఘిక, 44 పౌరాణిక చిత్రాలతో పాటు పలు తెలుగు, తమిళ చలన చిత్రాలలో విభిన్న పాత్రలకు జీవం పోశారు. 1982 మార్చి 29న తెలుగుదేశం పార్టీని స్థాపించి, కేవలం తొమ్మిది మాసాల కాల వ్యవధి లోనే, అప్పటి వరకు అప్రతిహతంగా కొనసాగిన కాంగ్రెస్ పాలనకు చరమగీతం పాడించి, ఆంధ్ర రాష్ట్ర ప్రభుత్వ పరిపాలనా పగ్గాలు చేత బుచ్చుకుని, ఎనిమిదేళ్ళు ముఖ్యమంత్రిగా, ప్రజల హృదయాలలో స్థిర స్థానం పొందారు. 1923 మే న కృష్ణాజిల్లా పామూరు మండలం నిమ్మకూరులో లక్ష్మయ్య, వెంకట రామమ్మ దంపతులకు జన్మించి, తారక రాముని"గా నామాంకితులై, విజయవాడ మున్సిపల్ స్కూల్లో, తర్వాత ఎస్.ఆర్.ఆర్ కళాశాలలో చదివారు. "కవి సామ్రాట్" విశ్వనాథ సత్య నారాయణ తెలుగు భాష ఉపాధ్యాయునిగా రామారావుకు "ఆడ వేషం" వేసే అవకాశం కల్పిస్తే, మీసాలు తీయకనే నటించి, "మీసాల నాగమ్మ" పిలువ బడ్డారు. విద్యాభ్యాస సమయంలో ఆస్తి హరించుకు పోగా, కొద్ది రోజులు పాల వ్యాపారం, కిరాణా షాపు, ఒక ముద్రణాలయాన్ని నడిపారు. 1942 లో మేనరికంగా బసవ తారకంను వివాహ మాడారు. నాటి ప్రఖ్యాత నటులు "కొంగర జగ్గయ్య, రక్త కన్నీరు నాగభూషణం, కె.వి.ఎస్. ముక్కామల" లాంటి నటులతో "నేషనల్ ఆర్ట్ థియేటర్" నాటక సంస్థను స్థాపించారు. తర్వాత కాలంలో సదరు సంస్థ కొన్ని చిత్రాలు కూడా తీసింది. జయకృష్ణ, సాయికృష్ణ, హరికృష్ణ మోహన కృష్ణ, బాలకృష్ణ, రామకృష్ణ, జయశంకర్ కృష్ణ, కుమారులు కాగా, పురంధరేశ్వరి, భువనేశ్వరి, ఉమా మహేశ్వరి కూతుళ్ళు కలిగారు. 1947లో పట్టభద్రులై మద్రాసు సర్వీస్ కమిషన్ పరీక్షలు రాసి 1100 మందికి, ఏడుగురిలో ఎంపికై సబ్ రిజిస్ట్రార్ ఉద్యోగం పొంది, తన కార్యక్షేత్రం సినీ రంగంగా ఎంచి, ఉద్యోగాన్ని వదిలారు. ప్రముఖ సినీ నిర్మాత బి.ఎ.సుబ్బారావు రామారావును మద్రాసు పిలిపించి, "పల్లెటూరి పిల్ల" చిత్రంలో కథానాయకుడి పాత్రను 116 రూపాయల పారితోషకం అందించారు. అయితే 1949 లో విడుదలైన "మన దేశం" ఎన్టీఆర్ కెమెరా ముందు నిలిచిన తొలి చిత్రం అయింది. తర్వాత దర్శకుడు యోగానంద్ కలిసి మద్రాసులో చిన్న గదికి మకాం మార్చారు. 1951లో నటించిన, నాటికీ నేటికీ తెలుగు ప్రజల హృదయాలలో నిలిచిన పాతాళభైరవి" చిత్రం. 10 కేంద్రాలలో శత దినోత్సవాలు జరుపుకుంది. 1956 లో లిమాయాబజార్' చిత్రానికి ఎన్టీఆర్ తీసుకున్న 7500 రూపాయల పారితోషికం నాడు అత్యధికం. తర్వాత భూకైలాస్" "వెంకటేశ్వర మహత్యం" భారీ విజయాలు సాధించగా, "శ్రీమద్విరాటపర్వం"లో ఐదు పాత్రలు పోషించి ఔరా అనిపించు కున్నారు. 1952 నుండి ఎన్టీఆర్ పారితోషికం లక్షల్లోకి చేరింది. "లవకుశ", "సీతారామ కళ్యాణం", "దాన వీర శూర కర్ణ", "నర్తనశాల", "విశ్వామిత్ర" లాంటి చిత్ర రాజాలు, ఆయన నటనకు కలికి తురాయిలుగా నిలిచాయి. "న భూతో న భవిష్యతి" అనిపించాయి. "అడవి రాముడు" "యమగోల" బాక్సాఫీసు విజయాలు సాధించాయి. చిత్ర సీమలో రారాజుగా ఉన్న ఎన్టీఆర్ "ప్రజా సేవ" వైపు తమ దృష్టిని మరల్చారు. 1978లో రాష్ట్ర కాంగ్రెస్ లో కుమ్ములాటలు, ఐదేళ్లలో 4గురు సీఎంలు మారడం, ఢిల్లీలో అధిష్టాన నిర్ణయానుసారం, సీఎంలు ఎన్నుకోబడిన సాంప్రదాయం, కాంగ్రెసు ప్రతిష్టను దిగజార్చడం జరిగింది. ఈ క్రమంలోనే 1982 మార్చి 21న హైదరాబాద్ కు చేరి, మార్చి 29 సాయంత్రం, రాజకీయ పార్టీని స్థాపించ నున్నట్లు ప్రకటించి, "తెలుగుదేశం" అని పేరు ఖాయం చేశారు. తన "చేవ్రోలెట్" కారునే "చైతన్య రథం"గా మార్పించి, దానిపై నలు మూలలా ఆంధ్రదేశ మంతటా పర్యటించి, ప్రచారం చేశారు. ఆంధ్రుల ఆత్మగౌరవ నినాదంతో, ప్రజల మనోభావాలను ప్రభావితం చేసి "ఢిల్లీలో తాకట్టు పెట్టిన ఆత్మగౌరవ పునరుద్ధరణ" పార్టీ లక్ష్యమని చాటి, ఎన్నికల బరిలో దిగి సర్వం తానే అయి, ప్రజాకర్షణతో, ఉద్వేగ భరితంగా, ఉద్రేక పూరితంగా ప్రసంగాలతో ప్రజా మద్దతు పొందారు. 1983 జనవరి 7న ప్రకటిత శాసన సభ ఫలితాలలో, 199 స్థానాలను సునాయాసంగా గెలుచుకొని, 97 ఏళ్ల కాంగ్రెస్ పాలనకు బ్రేక్ వేయ గలిగారు. టిడిపి వ్యవస్థాపక నేతలలో ఒకరైన నాదెండ్ల భాస్కర్ రావు, 1986 ఆగస్టు 16న, నాటి దేశ ప్రధాని ఇందిర, ఆంధ్ర ప్రదేశ్ గవర్నర్ రాంలాల్ సహకారంతో, ఎన్టీఆర్ ను పదవీచ్యుతుని గావించి, అధికారం హస్తగతం చేసుకోగా, ప్రజాస్వామ్య పునరుద్ధరణ ఉద్యమ ఫలితంగా, సెప్టెంబర్ 16న తెలుగుదేశం అధినేత ఎన్టీఆర్ తిరిగి ముఖ్యమంత్రి అయినారు. ఎన్టీఆర్ ఎందరో ప్రస్తుత ప్రజా ప్రతినిధులకు రాజకీయ జీవితాలను ప్రసాదించారు. విడిపోయిన తెలుగు రాష్ట్రాలకు సంబంధించి, ప్రస్తుత తెలంగాణ ముఖ్యమంత్రి కేసీఆర్, ఆంధ్రప్రదేశ్ మాజీ ముఖ్యమంత్రి నారా బాబునాయుడు, దివంగత ఎన్టీఆర్ మంత్రివర్గంలో పని చేసిన వారే కావడం విశేషం. 1985 జూన్ 1న శాసన మండలి రద్దు, హుస్సేన్ సాగర్ కట్టపై ప్రసిద్ధుల విగ్రహాల ఏర్పాట్లు, సినిమా థియేటర్లకు స్లాబ్ విధానం, 1989 లో మొత్తం మంత్రివర్గాన్ని ఏకపక్షంగా రద్దుపరచి, కొత్త మంత్రి మండలి ఏర్పాటు, నేషనల్ ఫ్రంట్ ఏర్పాటులో కీలక పాత్ర, రెండు రూపాయల కిలో బియ్యం పథకం, సంపూర్ణ మద్య నిషేధం, స్త్రీలకు ఆస్తిలో వాటా 1991 నంద్యాలలో గౌరవ సూచకంగా, నాటి ప్రధాన మంత్రి పీవీ నరసింహారావుకు పోటీ పెట్టక పోవడం, 1989... 1994 మధ్య ప్రతిపక్ష పార్టీ నేతగా వ్యవహరించడం, 1993లో లక్ష్మీపార్వతిని వివాహ మాడటం, ఆమె సహచర్యం, తారకరాముని రాజకీయ ప్రస్థానంలో, ముఖ్యాతి ముఖ్య అంశాలుగా మిగిలాయి.

# హిందీ సాహిత్య దిగ్గజం

డాక్టర్ హరివంశ్ రాయ్ బచ్చన్ ( 1907 నవంబరు 27 - 2003 జనవరి 18) 20 వ శతాబ్దం ప్రారంభంలో హిందీ సాహిత్యంలోని నయీ కవితా సాహిత్య ఉద్యమం లోని భారతీయ కవి. హిందీ సాహిత్యంలో సాటిలేని వారసత్వా న్ని మిగిల్చిన సాహిత్య దిగ్గజం ఆయన. 20వ శతాబ్దపు ఛాయా వాద ఉద్యమం మార్గదర్శకునిగా పరిగణించబడే హరివంశ్ రాయ్ బచ్చన్ గురించి ప్రస్తావించ కుండా హిందీ సాహిత్యం గురించి ప్రస్తావించడం సాధ్యం కాదు. 60 సంవత్స రాల పాటు సాగిన సాహిత్య జీవితంతో, బచ్చన్ 30కి పైగా కవితలు రాశారు. ప్రతి ఒక్కటి శక్తివంతమైన చిత్రాలతో, సమ కాలీన సామాజిక, రాజకీయ పరిస్థితులను ప్రతిబింబించేలా ఉన్నాయి. హరివంశ్ రాయ్ బచ్చన్ బ్రిటిష్ ఇండియా లోని యునైటెడ్ ప్రావి న్సెస్ ఆఫ్ ఆగ్రా లోని ప్రతాప్ గఢ్ జిల్లాకు చెందిన బాబుపట్టి గ్రామం లో కాయస్థ కులంలోని శ్రీవాస్తవ వంశానికి చెందిన అవధి భారతీయ హిందూ కుటుంబంలో నవంబర్ 27, 1907న జన్మించారు. ఆయన ముందు శ్యామాను వివాహం చేసుకోగా, ఆమె త్వరగా మరణించడంతో మళ్లీ తేజీ బచ్చన్‌ను వివాహం చేసుకున్నారు. అనేక ప్రసిద్ధ కవితలు వ్రాసారు. సిల్సిలా (1981), ఆలాప్ (1977) మరియు ఫిర్ భీ (1972) అనే బాలీవుడ్ చిత్రాలలో గీత రచయి తగా కూడా పనిచేశారు. 1941 నుండి 1957 వరకు, అలహా బాద్ విశ్వ విద్యాలయంలో ఆంగ్ల విభాగంలో అధ్యాపకునిగా బోధించారు. ఆ తరువాత రెండు సంవత్స రాలు కేంబ్రిడ్జ్ విశ్వవిద్యాలయానికి చెందిన సెయింట్ కాథరీన్ కళా శాలలో ప్రఖ్యాత ఐరిష్ రచయిత డబ్ల్యూ.బి.యీట్స్ రచనలపై పి.హెచ్.డి చేసారు. కేంబ్రిడ్జ్ యూనివర్సిటీలో పి హెచ్ డి చేసిన మొదటి భారతీయునిగా గుర్తింపు పొందారు. హరివంశ్ రాయ్ హిందీ కవిత్వం రాసేటప్పుడు సాధారణంగా సాంప్రదాయంగా ఉపయోగించే శ్రీవాస్తవ వంశ పేరుకు బదులుగా "బచ్చన్" (బాలుడు) అనే కలం పేరును ఉపయో గించారు. భారత దేశానికి తిరిగి వచ్చిన తరువాత, అలహాబాద్ విశ్వ విద్యాలయంలో ఆంగ్ల సాహిత్యం బోధించారు.

## ఈ నెల 24,25,26 తేదీల్లో నూజివీడులో జరిగే ఏఐఎస్ఎఫ్ రాష్ట్రస్థాయి
# విద్యా వైజ్ఞానిక రాజకీయ శిక్షణ తరగతులు జయప్రదం చేయండి

తల్లికి వందనం ఈ విద్యా సంవత్సరం నుంచి అమలు చేయాలి

పెండింగ్లో ఉన్న ఫీజు రియంబర్స్మెంట్ 788 కోట్లు కాదు చంద్రబాబు నాయుడు మాకు కావాల్సింది 3,580 కోట్లు విడుదల చేయాలి

పీజీ విద్యార్థులకు శాపంగా మారిన జీవో నెంబర్ 77 రద్దు చేయాలి

ఏఐఎస్ఎఫ్ ఆధ్వర్యంలో రాష్ట్ర స్థాయి శిక్షణ తరగతుల కరపత్రాలు విడుదల

ఏఐఎస్ఎఫ్ అనంతపురం జిల్లా ప్రధాన కార్యదర్శి కుల్లాయి స్వామి




**అనంతపురం జనవరి 17 ప్రజా జ్యోతి ప్రతినిధి (ఆనందరాజు) :** ఏఐఎస్ఎఫ్ రాష్ట్రస్థాయి విద్య వైజ్ఞానిక రాజకీయ శిక్షణ తరగతులు ఈ నెల 24 25 26 తేదీలలో ఏలూరు జిల్లా నూజివీడులో నిర్వహించడం జరుగుతుంది. ఈ శిక్షణా తరగతులకు సంబంధించిన కరపత్రాలను శుక్రవారం అనంతపురంలోని నీలం రాజశేఖర్ రెడ్డి భవనం నందు ఏఐఎస్ఎఫ్ ఆధ్వర్యంలో విడుదల చేయడం జరిగింది. ఈ సందర్భంగా ఏఐఎస్ఎఫ్ అనంతపురం జిల్లా ప్రధాన కార్యదర్శి కుల్లాయిస్వామి మాట్లాడుతూ కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు అవలంబిస్తున్న విద్యా వ్యతిరేక విధానాల పైన ఈ రాజకీయ శిక్షణ తరగతులలో విద్యార్థులను సైదాంతికంగా తయారు చేసేందుకు ఈ రాజకీయ శిక్షణ తరగతులు ఉపయోగపడతాయన్నారు. కేంద్రంలో అధికారంలో ఉన్న బిజెపి ప్రభుత్వం జాతీయ నూతన విద్యా విధానాన్ని రద్దు చేయాలని పేర్కొన్నారు. విద్యను పూర్తిగా కాషాయక రణ చేసే పద్ధతుల్లో బిజెపి ప్రభుత్వం ప్రయత్నం చేస్తుందని దేశ స్వతంత్రం కోసం పోరాడిన స్వాతంత్ర సమరయోధుల చరిత్రను తీసివేసి,,బ్రిటిష్ వారికి తత్తుగా పనిచేసిన వారి చరిత్రను పాఠ్యాంశాల్లో చేర్చడానికి ఏఐఎస్ఎఫ్ ఖండిస్తున్నామన్నారు.. రాష్ట్రంలో అధికారంలోకి వచ్చిన ఎన్డీఏ కూటమి ప్రభుత్వం విద్యా వ్యవస్థను పూర్తిగా విచ్ఛిన్నం చేస్తుందన్నారు మేము అధికారంలోకి వస్తే విద్యార్థులు కవి చేస్తా మీవి చేస్తామని కళ్ళు బుల్లి మాటలు చెప్పి గద్దెనెక్కి ఎనిమిది నెలలు గడుస్తున్నా విద్యార్థులకు ఇచ్చిన హామీలు అమలు చేయలేదని మండిపడ్డారు.. మేం అధికారంలోకి వస్తే ప్రతి బిడ్డకు 15వేల రూపాయలు ఇస్తామని తెలిపిన ఎన్డీఏ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత ఈ విద్యా సంవత్సరం అమలు చేయలేము రేపు విద్యా సంవత్సరం నుంచి ఇస్తామన్నారు మరి ఈ విద్యా సంవత్సరం చదువుతున్న విద్యార్థులు ఎవరిని అడగాలని ప్రశ్నించారు తక్షణమే రాష్ట్ర ప్రభుత్వం మీ విద్యా సంవత్సరం నుంచి తల్లికి వందనం అమలు చేయాలని డిమాండ్ చేశారు అదేవిధంగా రాష్ట్రవ్యాప్తంగా డిగ్రీ ఇంజనీరింగ్ పీజీ చదువుతున్న విద్యార్థులు మరియు కోర్స్ పూర్తి చేసుకున్న విద్యార్థులు 10 లక్షలకు పైగా వారి సర్టిఫికెట్లు రాక ఉద్యోగాలకు వెళ్లలేక ఉంటా ఉన్నారు.రాష్ట్ర వ్యాప్తంగా 3580 కోట్లు పెండింగ్లో ఉంటే సంక్రాంతి కానుకగా 788 కోట్లు మాత్రమే ప్రకటిస్తే మిగతా డబ్బులు ఎవరు చెల్లిస్తారని ప్రశ్నించారు మాకు కావాల్సింది 788 కోట్లు కాదు చంద్రబాబు నాయుడు 3580 కోట్లు తక్షణమే విడుదల చేయాలని డిమాండ్ చేశారు. అదేవిధంగా పీజీ విద్యార్థు లకు శాపంగా మారిన జీవో నెంబర్ 77 రద్దు చేయాలని డిమాండ్ చేశారు.విద్యా సంవత్సరం ప్రారంభమై ఆరు నెలల గడుస్తున్నప్పటికీ ఎన్నికలలో ఇచ్చినటువంటి హామీ జీవో నెంబర్ 77 దాని మాట అసలు ఎక్కడ కూడా ప్రస్తావన రాష్ట్ర ప్రభుత్వం చేయలేదన్నారు.తక్షణమే పీజీ విద్యార్థులకు శాపంగా మన జీవో నెంబర్ 77 రద్దు చేయాలని డిమాండ్ చేశారు. అదేవిధంగా ఈ విద్యా వైజ్ఞానిక రాజకీయ శిక్షణ తరగతులలో సుదీర్ఘంగా మూడు రోజులపాటు చర్చించి భవిష్యత్తు కార్యాచరణ రూపొందిస్తా మని ఈ సందర్భంగా తెలియజేశారు.ఈ శిక్షణ తరగతులకు విద్యార్థిని విద్యార్థులు పెద్ద సంఖ్యలో హాజరు కావాలని పిలుపునిచ్చారు.ఈ కార్యక్రమంలో ఏఐఎస్ఎఫ్ జిల్లా కోశాధికారి ఆంజనేయులు,జిల్లా ఆఫీస్ బేరర్స్ వెంకట్ నాయక్, వంశీ, మంజునాథ్ నగర కార్యదర్శి ఉమా మహేష్,నగర కోశాధికారి నాని,జిల్లా కార్యవర్గ సభ్యులు పవన్ తదితరులు పాల్గొన్నారు.

# ఆరోగ్యానికి మించిన సంపద లేదు





గుంతకల్ రూరల్ సీఐ ప్రవీణ్ కుమార్

ఉచిత గుండె మరియు కంటి వైద్య శిబిరానికి విశేష స్పందన

**గుంతకల్లు జనవరి 17 ప్రజా జ్యోతి ప్రతినిధి (ఆనందరాజు):** ఆరోగ్యానికి మించిన సంపద లేదు, ఆరోగ్యమే మహాభాగ్యమని ప్రతి ఒక్కరు తమ ఆరోగ్యం పట్ల శ్రద్ధ వహించాలని గుంతకల్లు రూరల్ సీఐ ప్రవీణ్ కుమార్ అన్నారు.శుక్రవారం పట్టణంలోని ధోనిముక్కల రోడ్డు నందు గల ఉన్న మిస్పా ప్రార్థన మందిరం నందు పాస్టర్ జె.మోషే, సిస్టర్ జె.కుమారి ఆధ్వర్యంలో అనంతపురం కిమ్స్ సవీరా హాస్పిటల్ వైద్యులచే ఉచిత గుండె మరియు కంటి వైద్య శిబిరం నిర్వహించడం జరిగింది.ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా గుంతకల్లు రూరల్ సీఐ ప్రవీణ్ కుమార్,జనవిజ్ఞాన వేదిక రాష్ట్ర కార్యదర్శి డాక్టర్ ఎస్.హరిప్రసాద్ యాదవ్ పాల్గొన్ని శిబిరాన్ని ప్రారంభించారు.అనంతరం వారు ప్రసంగిస్తూ ఆరోగ్యానికి మించిన సంపద లేదని ప్రతి ఒక్కరు ఆరోగ్యంపై శ్రద్ధ వహించాలని పేదరికం విద్య సామాజిక చైతన్యంతో పాటు మనం నివసించే ప్రదేశం భౌతిక వాతావరణం వంటి పలు అంశాలు ఆరోగ్యం పై ప్రభావం చూపుతాయని ప్రతి ఒక్కరు వైద్య శిబిరాన్ని వినియోగించుకోవాలని కోరారు.అనంతరం గుండె వైద్యనిపుణులు రామ్ కుమార్ కంటి వైద్య నిపుణులు కరిష్మా 400 మంది రోగులకు పరీక్షలు నిర్వహించి ఉచితంగా మందులు పంపిణీ చేశారు.ఈ కార్యక్రమంలో డాక్టర్ ఉప్పర వినోద్, క్యాంప్ ఆర్గనైజర్ రమేష్,రూరల్ పోలీస్ స్టేషన్ హెడ్ కానిస్టేబుల్ రమణ, కానిస్టేబుల్ అంజి, తదితరులు పాల్గొన్నారు.

## జనసేన పార్టీ ఫ్లెక్సీలు చింపడం పై ఆగ్రహం వ్యక్తం చేసిన కొరికాన భవాని.






**పాతపట్నం జనవరి17, ప్రజా జ్యోతి న్యూస్** పాతపట్నం నియోజకవర్గం ప్రజానీకానికి హృదయ పూర్వక నమస్కారములుతో తెలియజేయునది ఏమనగా!పవన్ కళ్యాణ్ ఆశయాలు, సిద్ధాంతాలు నచ్చి సేవే మార్గం- ప్రేమే లక్ష్యం అనే నినాదంతో నియోజకవర్గంలో ఎన్నో సేవా కార్యక్రమాలు చేసుకుంటూ.. జనసేన పార్టీని బలపరుస్తూ నియోజవర్గ ప్రజలకు ఎటువంటి కష్టము వచ్చినా నేనున్నానని భరోసా ఇస్తూ..ముందుకెళు తున్న నాపై కొంతమంది పరోక్ష దాడి చేస్తూ..నన్ను ఎదుర్కోలేక నేను పెట్టే హోర్డింగ్స్ ని కొంతమంది రౌడీ మూకలు,దుర్మార్గులు,ఈర్ష్య, అసూయలతో చించి వేయడం చేస్తున్నారు.వాళ్ళందరికీ మేము ఒకటే హెచ్చరిస్తున్నాం..మీకు దమ్ము, ధైర్యం ఉంటే,ఒక మనిషి పుట్టుక పుట్టి ఉంటే, ధైర్యంగా ముందుకు వచ్చి చేయండి.అప్పుడు నేనేంటో.. మా జనసేన పార్టీ అంటే ఏంటో చూపిస్తాం. ఎంతకాలం ఇలా ఆడంగి వెదవల్లాగా బ్యానర్లు చింపుతారు..ఈ నియోజకవర్గంలో ఎన్నో సమస్యలు ఉన్నాయి.అవి మీరు తీర్చి మీ మగతనాన్ని నిరూపించుకోండి.అంతేగాని చేతకాని ఆడంగులు లాగా మేము వేసే బ్యానర్లు చించి వేయడం సరైనది కాదు..ఒరేయ్ సవట సన్నాసి దద్దమ్మలారా!మీకే చెప్తున్నా..గుర్తుపెట్టుకోండి. ఇంకోసారి ఇది రిపీట్ అయ్యిందంటే దాని యొక్క పర్యవసానం ఎలా ఉంటుందో మీ ఊహకే వదిలేస్తున్నా..ఖబడ్దార్!అంటు ఆగ్రహం వ్యక్తం చేసిన కొరికాన భవాని .

## స్వచ్ఛ ఆంధ్ర స్వచ్ఛ దివస్ ర్యాలీ



**గుంతకల్లు జనవరి 17 ప్రజా జ్యోతి ప్రతినిధి (ఆనందరాజు):** రాష్ట్రంలో ప్రతి నెలా 3వ శనివారం 'స్వచ్ఛ ఆంధ్ర - స్వచ్ఛ దివస్' కార్యక్రమాన్ని నిర్వహిస్తుందని అందులో భాగంగానే నేడు శనివారం గుంతకల్లు పట్టణంలో ఉదయం 9 గంటలకు పట్టణంలోని అజంత సర్కిల్ నుండి ఎన్టీఆర్ సర్కిల్ వరకు ర్యాలీ నిర్వహించి, ఆంధ్రుల ఆరాధ్య దైవం,తెలుగుదేశం పార్టీ వ్యవస్థాపకులు నందమూరి తారక రామారావు వర్ధంతిని పురస్కరించుకొని స్వర్గీయ ఎన్టీఆర్ విగ్రహానికి ఎన్డీఏ కూటమి నాయకులు కార్యకర్తలతో కలిసి ఎమ్మెల్యే గుమ్మనూరు జయరాం ఎన్టీఆర్ విగ్రహానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించడం జరుగుతుంది,అనంతరం మున్సిపల్ కార్యాలయం వద్ద ఎన్టీఆర్ వర్ధంతి సందర్భంగా రక్తదాన శిబిరం నిర్వహించ డం జరుగుతుంది.ఈ కార్యక్రమానికి ఎన్డీఏ కూటమి సభ్యులు, ప్రజలు,ఎన్టీఆర్ అభిమానులు పెద్ద ఎత్తున పాల్గొనాలని ఎమ్మెల్యే తెలిపారు.

## పాతపట్నం సిడిపిఓపై తప్పుడు ఆరోపణలు సరికాదు..



**పాతపట్నం జనవరి17, ప్రజా జ్యోతి న్యూస్..** పాతపట్నం సిడిపిఓపై తప్పుడు ఆరోపణలు సరికాదని అంగన్వాడి ప్రాజెక్టు లీడర్స్ బి.శాంతామని డి. లలితమ్మ, జీ.రాణి, జి.గీతమ్మ లు అన్నారు.శుక్రవారం శివశంకర్ కాలనీలో విలేకరులతో ప్రాజెక్ట్ లీడర్లు మాట్లాడారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఇటీవల కాలంలో వచ్చిన ఆరోపణలు సరికాదని అందులో నిజం లేదన్నారు.మాకు సంప్రదించకుండా సిడిపిఓ, సూపర్వైజర్ల మీద,మా పైన ఆరోపణలు చేస్తూ అవాస్తవాలు రాయడం సరికాదని అన్నారు.యు. లీలారాణి, కే.సావిత్రి, హెచ్. ఉషారాణి లు పాల్గొన్నారు.

## ఎమ్మెల్యే గుమ్మనూరు జయరాం నూతన ఇంటి భూమి పూజ కార్యక్రమంలో పాల్గొన్న జనసేన నేత వాసగిరి మణికంఠ



**గుంతకల్లు జనవరి 17 ప్రజా జ్యోతి ప్రతినిధి (ఆనందరాజు):** పట్టణంలోని కసాపురం రోడ్డు స్థానిక పిరమిడ్ ఏరియా నందు గుంతకల్లు నియోజకవర్గం శాసనసభ్యులు గుమ్మనూరు జయరాం నూతన గృహ నిర్మాణం కొరకు చేపట్టిన భూమి పూజ కార్యక్రమంలో జనసేన పార్టీ సమన్వయ బాద్యుడు వాసగిరి మణికంఠ పాల్గొని,జనసేన పార్టీ మూలగ సిద్ధాంతాల్లో ఒకటైన పర్యావరణాన్ని పరిరక్షించే అభివృద్ధి ప్రస్థానంలో భాగంగా మొక్కను ఎమ్మెల్యే గుమ్మనూరు జయరాంకు బహుకరించి శుభాకాంక్షలు తెలియజేశారు.ఈ శుభకార్యక్రమంలో జనసేన పార్టీ సీనియర్ నాయకులు కసాపురం నందా, గాజుల రాఘవేంద్ర,కథల వీధి అంజి, సుబ్బయ్య,అమర్,ధోనిముక్కల విజయ్,ఎన్డీఏ కూటమి కుటుంబ సభ్యులు పెద్ద ఎత్తున పాల్గొన్నారు.

## ఎమ్మెల్యే గుమ్మనూరు జయరాం ఇంటి నిర్మాణం భూమి పూజ కార్యక్రమంలో పాల్గొన్న బిఎస్ కృష్ణారెడ్డి



**గుంతకల్లు జనవరి 17 ప్రజా జ్యోతి ప్రతినిధి (ఆనందరాజు):** పట్టణంలోని కసాపురం రోడ్డు నందుగల పిరమిడ్ ఏరియా నందు ఎమ్మెల్యే గుమ్మనూరు జయరాం సొంత ఇంటి నిర్మాణం కొరకు చేపట్టిన భూమి పూజ కార్యక్రమంలో టిడిపి రాష్ట్ర లీగల్ సెల్ కార్యదర్శి,మున్సిపల్ స్టార్టింగ్ కమిటీ మెంబర్ బిఎస్ కృష్ణారెడ్డి పాల్గొని ఎమ్మెల్యే గుమ్మనూరు జయరామ్ కు, వారి సోదరులు గుంతకల్లు టిడిపి ఇన్చార్జి గుమ్మనూరు నారాయణ స్వామికి ప్రత్యేక శుభాకాంక్షలు తెలియజేశారు.

## ఎమ్మెల్యే గుమ్మనూరు జయరాం నూతన స్వగృహం భూమిపూజ లో పాల్గొన్న: బిజెపి రాష్ట్ర ఉపాధ్యక్షురాలు వనగోంది విజయలక్ష్మి.



**గుంతకల్ టౌన్ ప్రజా జ్యోతి:** ఈరోజు గుంతకల్ నియోజకవర్గం.%మీూా%. గుమ్మనూరు జయరామ్ ఇంటి నిర్మాణ భూమి పూజఆహ్వానం మేరకు పూజా కార్యక్రమంలో. పాల్గొనడం జరిగింది సోదరులు నారాయణస్వామి, సీనప్ప, తో కలిసి పూజలో ఎన్డీఏ కూటమి సభ్యులతో పాల్గొన్న బిజెపి నాయకులు ఓబీసీ మోర్చా రాష్ట్ర కార్యవర్గ సభ్యులు జిఎం మహేష్ , బిజెపి మహిళా మోర్చా రాష్ట్ర ఉపాధ్యక్షురాలు వనగుంది విజయలక్ష్మి , బిజెపి పట్ట ణ కార్యదర్శి దాసరి శ్రీనివాసులు పాల్గొనడం జరిగింది

## ప్రేమ పేరుతో మోసం చేసిన యువకుడు...
### ప్రియుడి ఇంటి ముందు యువతి ఆందోళన



**గుంతకల్లు జనవరి 17 ప్రజా జ్యోతి ప్రతినిధి (ఆనందరాజు):** ప్రేమించి మోసం చేసి అన్ని విధాలుగా వాడుకొని ఇప్పుడు వదిలేసాడంటూ ఓ యువతి ప్రియుడి ఇంటి ఎదుట ఆందోళనకు చేపట్టింది. వజ్రకరూరు మండలం కొనకొండ్ల గ్రామానికి చెందిన యువతి గొరవ అనిత అదే గ్రామంలో వాలింటర్ గా పని చేస్తున్న సమయంలో కొనకొండ్ల గ్రామానికి చెందిన చాకలి సంజీవ అనే యువకుడు అమెను నమ్మించి మాయమాటలు చెప్పి వీరిద్దరూ గత ఐదు సంవత్సరాలుగా ప్రేమించుకున్నారు. వీరి పెళ్లి ఒక గదిలో చేసుకున్నారని ఆ తర్వాత నాలుగు సంవత్సరాలు ఆమె దగ్గర ఉండి తర్వాత ఆమెను వాడుకుని వదిలేసాడని యువతి పోలీస్ స్టేషన్లో ఫిర్యాదు చేయడంతో పోలీసులు అతనిపై కేసు నమోదు చేసే జైలుకు వెళ్లి వచ్చిన తర్వాత అతని కుటుంబం వేరే యువతితో పెళ్లికి సిద్ధం చేయగా శుక్రవారం గొరవ అనిత ప్రియుడి కుటుంబ సభ్యుల ఇంటి దగ్గరికి వెళ్లి వేరే పెళ్లి చేసుకోకూడదని ప్రియుడి ఇంటి ముందు యువతి ఆందోళన చేసింది. యువకుడి కుటుంబం తిరగబడడంతో ఆమె వజ్రకరూరు పోలీస్ స్టేషన్కు వెళ్లి ఫిర్యాదు చేసింది. సదరు యువతి గొరవ అణిత తనకు న్యాయం చేయాలంటూ ఆమెతో పాటు కొంతమంది మహిళలు మద్దతు తెలిపారు. తనను ప్రేమించిన అబ్బాయి తోనే పెద్దల సమక్షంలో పెళ్లి చేసి న్యాయం చేయాలని బాధితురాలు అనిత పోలీసులను కోరింది.

# ఘనంగా పూర్వ విద్యార్థుల అపూర్వ కలయిక..





పూర్వ విద్యార్థుల కలయికకు ముఖ్యఅతిథిగా హాజరైన ఎమ్మెల్యే ఎంజీఆర్..,

కార్యక్రమంలో పాల్గొన్న పెద్ద సీది హైస్కూల్ లో (1988-89) బ్యాచ్ టెన్త్ విద్యార్థులు.

పూర్వ ఉపాధ్యాయులకు పాదాభివందనం చేసిన ఎమ్మెల్యే ఎంజీఆర్ ...

**పాతపట్నం జనవరి17, ప్రజా జ్యోతి న్యూస్..** పాతపట్నం మండలం పెద్ద సీది గ్రామం జిల్లా పరిషత్తు ఉన్నత పాఠశాల 1988-89 విద్యా సంవత్సరంలో పదవ తరగతి చదివిన పూర్వ విద్యార్థుల ఆత్మీయ కలయిక నేడు ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగ 1988 -89 విద్యా సంవత్సరంలో టెన్త్ చదువుకున్న పూర్వ విద్యార్థులు అపూర్వ కలయికను నిర్వహించి పాఠశాలలో వారి పాత జ్ఞాపకాలను గుర్తు చేసుకున్నారు. విద్యార్థులు ఒకరిని ఒకరు కలుసుకొని వారి వారి కుటుంబాల పరిస్థితులను, యోగక్షేమాలను అడిగి తెలుసుకున్నారు.ఈ పాఠశాలలో విద్యను అభ్యసించిన రోజుల్లో గత స్మృతులను నెమరుచేసుకున్నారు.పాఠశాల స్థాయి



విద్యను అభ్యసించిన రోజులు ఎంతో విలువైన రోజులని ఈసందర్భంగా పలువురు పూర్వ విద్యార్థులు తమమనో భావాలను వ్యక్తపరిచారు.తమ సహ విద్యార్థులు ఎవరైనా అనారోగ్యంతో,ఆర్థిక ఇబ్బందులతో సతమతమవుతుంటే తన వంతు సహకారం ఉంటుందని ఎమ్మెల్యే ఎంజీఆర్ తెలియజేశారు. అలానే పాఠశాల అభివృద్ధికి తమ వంతు కృషిచేస్తామని తెలిపారు.ఈపాఠశాలలో తమ విద్యార్థులను తోటి ఉపాధ్యాయులను కలుసుకోవడం ఆనందంగా ఉందన్నారు. అనంతరం ఉపాధ్యాయులను విద్యార్థులు ఘనంగా సన్మానించారు,ఎమ్మెల్యే మామిడి గోవిందరావు మాట్లాడుతూ ప్రతి సంవత్సరం తమకు తోచిన విధంగా పాఠశాల అభివృద్ధి లో భాగస్వాములు కానున్నట్లు పేర్కొన్నారు.ప్రతి గ్రామంలోని పాఠశాలలో చదువుకున్న పూర్వ విద్యార్థులు చేయి చేయి కలిపితే ప్రభుత్వ పాఠశాలలు బలోపేతమై తాయని తెలిపారు.తాము చదువుకున్న పాఠశాలకు తిరిగి మౌలిక వసతులు కల్పించడానికి కృషి చేసినందుకు చాలా సంతోషంగా ఉన్నట్లు తెలిపారు. ఏది ఏమైనా పూర్వ విద్యార్థుల తీసుకున్న నిర్ణయం పట్ల పెద్ద సీది గ్రామానికి చెందిన విద్యార్థులు తల్లి దండ్రులు మేధావులు వివిధ రాజకీయ పార్టీ నాయకులు హర్షం వ్యక్తం చేస్తున్నారు.ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు విద్యార్థులు, తదితరులు పాల్గొన్నారు..

# రిజిస్ట్రేషన్లు నిలుపుదల చేయండి





సోషల్ క్లబ్ స్థలాన్ని అమ్మే ప్రయత్నాలను అడ్డుకోవాలి

ఇంచార్జి రిజిస్ట్రార్ కు పిర్యాదు చేసిన సర్పంచ్ రేగిడి లక్ష్మి,సోషల్ క్లబ్ సభ్యులు

**పొందూరు ( శ్రీకాకుళం ) :** పొందూరు మేజర్ పంచాయతీ ఆవరణంలో సర్వేశ్వర పురం రోడ్డు పరిధిలో ఉన్న సోషల్ క్లబ్ పై కబ్జా లకు పాల్పడిన వ్యక్తుల రిజిస్ట్రేషన్లను తక్షణమే నిలుపుదల చేయాలని స్థానిక సర్పంచ్ రేగిడి లక్ష్మి ,సోషల్ క్లబ్ సభ్యులు కలిసి ఇంచార్జి రిజిస్ట్రార్ సంతోష్ కు శుక్రవారం నాడు పిర్యాదు చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ పంచాయతీ ఆస్తిగా ఉన్న సోషల్ క్లబ్ స్థలం పై కొంతమంది వ్యక్తుల దేగకన్ను పడిందన్నారు. తప్పుడు దృవ పత్రాలను సృష్టించి ప్రభుత్వ ఆస్తిని ప్రవేట్ ఆస్తిగా చెప్పుకుని కోట్ల రూపాయల్లో లాభాలను అర్జించుకునే ప్రయత్నాలు చేస్తున్నారన్నారు. ఎన్నో సంవత్సరాల నుండి పలు సాంఘిక , సాహితీ , విద్య , వైద్య , సాంస్కృతిక కార్యక్రమాలను సోషల్ క్లబ్ లో నిర్వహించే వారని అన్నారు. అటువంటి సోషల్ క్లబ్ పై ఇప్పుడు కొంతమంది తప్పుడు ధ్రువ పత్రాలు సృష్టించి విక్రయించేందుకు ప్రయత్నిస్తున్నారని తెలిపారు. తక్షణమే ఆ స్థలం కు సంబంధించి తదుపరి ఉత్తర్వులు వచ్చేంత వరకు స్థలం కు సంబంధించిన ఎటువంటి లావాదేవీలు జరపకుండా చూడాల్సిందిగా కోరారు. ఈ స్థలం పై ఎవరికి రిజిస్ట్రేషన్లు చేయకుండా నిలుపుదల చేయాలని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో సోషల్ క్లబ్ సభ్యులు గుంటుకు జగన్నాథం ,వెలి శెట్టి రామచంద్ర రావు , వడగా సూర్యం , రామకృష్ణ , కామేశ్వర రావు , మరికొంతమంది సభ్యులు పాల్గొన్నారు.

# స్నేహితులంతా ఒకచోట...

**1972-77 పూర్వ విద్యార్థుల ఆత్మీయ కలయిక**

**పొందూరు , జనవరి 17 , ప్రజాజ్యోతి న్యూస్:** స్నేహితులంతా ఒకచోట కలుసుకున్నారు. చిన్న నాటి జ్ఞాపకాలను నెమరవేసుకుంటూ తమ బాల్యాన్ని గుర్తు చేసుకుని సందడి చేశారు. పొందూరు ప్రభుత్వ ఉన్నత పాఠశాల 1972 -77 వ సంవత్సరం 10 వ తరగతి విద్యార్థులందరూ మండల కేంద్రంలో గల శ్రీ పైడితల్లి అమ్మవారి ఆలయ ప్రాంగణం వద్ద తమ ఆత్మీయ కలయిక కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో 1972-77 పూర్వపు విద్యార్థులు , ఉపాద్యాయులు పాల్గొని చిన్న నాటి బాల్య స్మృతులను ,సన్నివేశాలను గుర్తు చేసుకుని సందడి చేశారు. అనంతరం పలువురి సభ్యులను ఘనంగా సన్మానించారు. ఆనాటి అనుభవాలను , అనుబంధాలను వేదికపైకి ఎక్కి పలువురు ప్రసంగించారు. పైడితల్లి అమ్మవారు ఆలయ అభివృద్ధికి తమ వంతు సహకారం అందిస్తామని ఈ బ్యాచ్ విద్యార్థులు ఈ సందర్భంగా తెలియజేశారు. ఈ కార్యక్రమంలో రిటైర్డు వార్డెన్ ఎం శ్రీరంగ నాయకులు ,



వ్యాపార వేత్త గుడ్ల ప్రభాకర రావు , రిటైర్డు గ్రేడ్ 1 ఫార్మాసిస్ట్ జి గురుమూర్తి , ఏ.బి.జి.వి బ్యాంక్ బండారు గణేష్ ,కోరుకొండ రాజశేఖర్ ,సత్యసాయి సేవా సమితి కన్వీనర్ దున్నా రాధాకృష్ణ , మాడుగుల కృష్ణా రావు, ఎస్.డి ప్రసాద్ ,ఎం మనోహర్ , గుంటుకు కృష్ణా రావు ,గుడ్ల అన్నాజీ , పూర్వపు విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.





## కొత్తూరు మండలం లో పలు ఓనిల ఫంక్షన్ కి హాజరైన లోతుగెడ్డ తులసీ వర ప్రసాద్ రావు..



**కొత్తూరు జనవరి17, ప్రజా జ్యోతి న్యూస్..** దిమిలి గ్రామం లో పల్లి కాంతారావు కుమార్తె శైలజ ఓనీల ఫంక్షన్ కి హాజరైన లోతుగెడ్డ తులసీ వర ప్రసాద్ రావు అనంతరం అల్తి గ్రామానికి చెందిన సవర పెంటయ్య కుమార్తె లావణ్య ఓనిలా ఫంక్షన్లో పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో ఆయనతో పాటు దారపు రామకృష్ణ, దారపు కాశీ బాబు, దారపు ఖగేష్, దారపు ప్రవీణ్ మొదలగు వారు ఉన్నారు.లి

## అదనపు గోదాముల నిర్మాణానికి చర్యలు

పలు గోదాముల్లో ఆకస్మిక తనిఖీ

సంతృప్తి వ్యక్తం చేసిన ఏపి వేర్ హౌజింగ్ కార్పొరేషన్ ఎం.డి గేదెల సురేష్ కుమార్





**పొందూరు , జనవరి 17 :** ఆంధ్రప్రదేశ్ వేర్ హౌజింగ్ కార్పొరేషన్ మేనేజింగ్ డైరెక్టర్ గేదెల సురేష్ కుమార్ రాజాం , పాలఖండ్యాం ,పొందూరు ప్రాంతాలలో ఉన్న గోదాములలను శుక్రవారం నాడు ఆకస్మికంగా సందర్శించారు. ఇందులో భాగంగా పొందూరు మండల కేంద్రంలో స్థానిక వ్యవసాయ మార్కెట్ కమిటీ ఆవరణంలో ఉన్న గిడ్డంగుల సంస్థ గోదాములను ఆయన తనిఖీ చేశారు. ఈ సందర్భంగా మార్కెట్ కమిటీ ఆవరణంలో 20 వేల టన్నుల సామర్థ్యం కలిగిన ఐదు గోదాములను ఆయన పరిశీలించారు. బియ్యం నిల్వలో తీసుకుంటున్న జాగ్రతలు తదితర అంశాలపై ఆయన సంతృప్తి వ్యక్తం చేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ రైతులు ఆరుగాలం శ్రమించి ఎంత కష్టపడి పంటలను పండిస్తారో అందుకు తగిన విధంగా పండించిన పంటను సరైన పద్ధతులలో గౌడౌన్ లలో నిల్వ చేసుకోవాలని సూచించారు . మార్కెట్ కమిటీ ఆవరణంలో తమ కార్పొరేషన్ తరపున త్వరలోనే రోడ్లు , గోదాములలో ఫ్లోరింగ్ వంటి పనులు చేయించడం జరుగుతుందన్నారు. నిల్వ సామర్థ్యాన్ని పెంచడం కోసం రాష్ట్రంలో అవసరమైన ప్రాంతాలలో గౌడౌనుల ఏర్పాటుకు ప్రణాలికలు సిద్ధం చేస్తున్నట్లు తెలిపారు. ఉత్తరాంధ్ర లో వీటి అవసరం అత్యధికంగా ఉందని త్వరలోనే ఏర్పాటు చేస్తామని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో ఉత్తరాంధ్ర రీజనల్ మేనేజర్ రాజశ్రీ , పొందూరు మేనేజర్ పడాల సునీత , సిబ్బంది పాల్గొన్నారు

## రిపోర్టర్ పై దాడి కేసులో ఐదుగురు అరెస్టు..

**కొత్తూరు జనవరి17, ప్రజా జ్యోతి న్యూస్** కొత్తూరు మండలంలోని మెట్టూరు బిట్-3 (ఇరపాడు) గ్రామానికి చెందిన ఎబిఎన్ ఆంధ్రజ్యోతి మీడియా జర్నలిస్ట్ సొంట్యాన రామ్ ప్రసాద్ బైక్ ను అడ్డగించి దాడి చేసిన విషయం తెలిసిందే. ఈ సంఘటనలో తీవ్రంగా గాయపడిన జర్నలిస్ట్ ఎస్ రామ్ ప్రసాద్ పోలీసులకు ఇచ్చిన ఫిర్యాదు మేరకు జర్నలిస్ట్ పై దాడి చేసిన మెట్టూరు బిట్-3(ఇరపాడు) గ్రామానికి చెందిన బిళ్ళశౌంతి సప్తగిరి, అగతముడి మురళీ, బలగ కాంతారావు, మీసాల షణ్ముఖరావు, కొమరాపు రామ్ ప్రసాద్ లను గురువారం అరెస్ట్ చేసినట్లు ఎస్ఐ ఎం.డి అమీర్ అలీ పేర్కొన్నారు. అరెస్ట్ చేసిన వారికి 41 నోటీసులు ఇచ్చినట్లు ఎస్ఐ వివరించారు.



## కనుకదుర్గమ్మను దర్శించుకున్న మాజీ ఎమ్మెల్యే జితేంద్ర గౌడ్



**గుంతకల్లు జనవరి 17 ప్రజా జ్యోతి ప్రతినిధి (ఆనందరాజు):** గుంతకల్లు మాజీ ఎమ్మెల్యే, తెదేపా రాష్ట్ర ఉపాధ్యక్షులు ఆర్. జితేంద్ర గౌడ్ విజయవాడ పర్యటనలో భాగంగా శుక్రవారం విజయవాడ శ్రీ కనక దుర్గమ్మ తల్లిని దర్శించుకోవడం జరిగింది. ఆలయ అర్చకులు స్వాగతం పలికి ప్రత్యేక పూజలు చేసి అమ్మవారి ప్రత్యేక తీర్థప్రసాదాలను,ఆశీర్వచనాన్ని అర్చకులు అందించారు. అనంతరం రాష్ట్ర ఆర్టీసీ చైర్మన్ కొనకల్ల నారాయణ రావుని మర్యాదపూర్వకంగా ఆయన చాంబర్ నందు సమావేశమై పదవిబాధ్యతలు చేపట్టిన సందర్భంగా శుభాకాంక్షలు తెలియజేయ డం జరిగింది.ఈ కార్యక్రమంలో తెదేపా రాష్ట్ర బీసీ సెల్ అధికార ప్రతినిధి పవన్ కుమార్ గౌడ్,గుత్తి మండలం మాజీ ఎంపీపీ వీరభద్రయ్య, నియోజకవర్గం కోఆర్డినేటర్ ముక్కనగారి రామాంజనేయు లు,గుత్తి మండలం క్లస్టర్ ఇంచార్జ్ మహమ్మద్ అలీ తదితరులు పాల్గొన్నారు.

# అర్జీల పరిష్కారంలో అధికారుల అలసత్వం - కలెక్టర్ అసహనం







**బాపట్ల జిల్లా ప్రజా జ్యోతి స్టాఫ్ రిపోర్టర్** విభిన్న ప్రతిభావంతుల సమస్యల పరిష్కారంలో అధికారులు సానుకూలంగా స్పందించాలని జిల్లా కలెక్టర్ జె వెంకట మురళి ఆదేశించారు ప్రత్యేకంగా ఏర్పాటు చేసిన విభిన్న ప్రతిభావంతుల సమస్యల పరిష్కార కార్యక్రమం శుక్రవారం స్థానిక కలెక్టరేట్ లోని పీజీఆర్ఎస్ హాల్ లో నిర్వహించారు దివ్యాంగుల నుంచి వచ్చిన అర్జీలను జిల్లా కలెక్టర్ స్వీకరించి గతంలో వచ్చిన అర్జీలను ఆరా తీశారు జిల్లాలో వికలాంగుల సంక్షేమ కార్యాలయం ఏర్పాటుకు ప్రతిపాదన పంపేమని చెప్పారు జిల్లా నలుమూలల నుండి జిల్లా కేంద్రానికి దివ్యాంగులు వచ్చేలా బస్సు సౌకర్యం ఏర్పాటుపై చర్చించారు దివ్యాంగులు బాపట్లకు వచ్చేలా బస్సు సౌకర్యం ఎందుకు ఏర్పాటు చేయలేదని కలెక్టర్ సంబంధిత అధికారులపై అసహనం వ్యక్తం చేశారు దివ్యాంగులు అర్జీలు పెట్టి నెల గడిచినా ఎందుకు స్పందించలేదని ఆరా తీశారు బస్సు సౌకర్యంపై వెంటనే ప్రతిపాదనలు తయారు చేసి ఆర్టీసీ అధికారులకు పంపాలని దివ్యాంగుల సంక్షేమ శాఖ ఏడి ని ఆదేశించారు ప్రభుత్వం నుంచి అనుమతి రాగానే దివ్యాంగులకు కొత్త పింఛన్ల మంజూరు ప్రక్రియ చేపడతామని తెలిపారు మంచానికి పరిమితమైన వ్యాధిగ్రస్తులకు రూ15వేలు పింఛను మంజూరు కొరకు గుంటూరు జనరల్ ఆసుపత్రికి తీసుకువెళ్లే బాధ్యత జిల్లా వైద్య శాఖ అధికారి చేపట్టాలని చెప్పారు అక్కడ ధ్రువీకరణ పత్రాలు జారీ చేస్తేనే పింఛన్ మంజూరు అవుతుందని పేర్కొన్నారు దివ్యాంగుల సమస్యలను పరిష్కరించుటకు అధికారులు చర్యలు తీసుకోవాలని సూచించారు అర్జీలను త్వరగా పరిష్కరిస్తే అర్జీ దారులు సంతోషంగా ఉంటారని తెలిపారు వచ్చిన తక్కువ అర్జీలను కూడా పరిష్కరించకపోవడం పట్ల అధికారుల నిర్లక్ష్యం కనబడుతుందని చెప్పారు అర్జీలను వెంటనే పరిష్కరించాలి లేనిచో సంబంధిత అధికారులపై తగిన చర్యలు తీసుకుంటామని తెలియజేశారు దివ్యాంగుల సంక్షేమ శాఖ అధికారి వారంలో మూడు రోజులపాటు బాపట్లలో అందుబాటులోనే ఉండి పరిష్కరించాలని జిల్లా కలెక్టర్ ఆదేశించారు ప్రజా సమస్యలపై ఆన్ లైన్ లో వచ్చిన అర్జీలను అధికారులు చూడటం లేదన్నారు అర్జీల పరిష్కారంపై సంబంధిత అర్జీదారునికి ఫోన్ చేసి అవగాహన కల్పించాలని సంబంధిత అధికారులను ఆదేశించారు కులగణన కింద వచ్చిన అర్జీలను పుర్తి స్థాయిలో పరిష్కరించాలన్నారు కులగణన అర్జీల స్వీకరణ గడువు ఈనెల 16 నుండి 20 తేదీకి ప్రభుత్వం పొడిగించిందని సూచించారు ప్రతినెల మూడవ శుక్రవారం నిర్వహించే ప్రత్యేక దివ్యాంగుల సమస్యల పరిష్కార కార్యక్రమాన్ని నాల్గొవ శుక్రవారానికి మార్చినట్లు తెలిపారు గిరిజన ప్రజల సమస్యలతో పాటు దివ్యాంగుల సమస్యల పరిష్కార కార్యక్రమం కలిపి నిర్వహిస్తామని జిల్లా కలెక్టర్ తెలియజేశారు ఈ కార్యక్రమంలో సంయుక్త కలెక్టర్ ప్రఖర్ జైన్ జిల్లా రెవెన్యూ అధికారి గంగాధర్ గౌడ్ జిల్లా అధికారులు తదితరులు పాల్గొన్నారు

## దౌర్జన్యంగా విజయ డైయిరీ ఎన్నికలు

# ప్రక్రియను టీడీపీ వర్గీయులు అడ్డుకోవడం సిగ్గుచేటు

.వైఎస్సార్సీపీ నంద్యాల జిల్లా అధ్యక్షుడు మాజీ ఎమ్మెల్యే కాటసాని రాంభూపాల్ రెడ్డి

టీడీపీ వర్గీయుల దౌర్జన్యం..వాయిదా పడ్డ ఎన్నికల ప్రక్రియ

చేతులెత్తేసిన పోలీసులు...

పథకం ప్రకారం ఎన్నికలను వాయిదా వేయించారు

ఎన్నికల వాయిదా వేయడంలో వెనుక ఎవరి హస్తం ఉంది

టీడీపీ హయాంలో పాల డైయిరీలు ఒక్కొక్కటిగా మూత పడుతున్నాయి



**కర్నూలు జనవరి 17:** నంద్యాల జిల్లా సహకార పాల్ప ఉత్తత్తి సంస్థ డైరెక్టర్ల ఎన్నికల ప్రక్రియను అధికార టీడీపీ వారు పెద్ద ఎత్తున అప్రజాస్వామ్యంగా దౌర్జన్యంగా నామినేషన్లను వేయకుండా అడ్డుకోవడం సరికాదని నంద్యాల జిల్లా వైఎస్సార్సీపీ అధ్యక్షుడు మాజీ ఎమ్మెల్యే కాటసాని రాంభూపాల్ రెడ్డి, మాజీ ఎమ్మెల్యే రామిరెడ్డి, మాజీ ఎమ్మెల్సీ గంగుల ప్రభాకర్రెడ్డి పేర్కొన్నారు. శుక్రవారం నంద్యాల విజయపాల డైయిరీకి సంబంధించి ఖాలీగా ఉన్న మూడు డైరెక్టర్ల పదవులకు ఎన్నికలను నిర్వహించేందుకు నామినేషన్లను కోరడం జరిగింది. ఈ నేపథ్యంలో నామినేషన్లను వేసేందుకు వచ్చిన పాల సొసైటీ అధ్యక్షులను టీడీపీ వర్గీయులు అడ్డుకోవడం జరిగింది. పోలీసులు ఈ పరిస్థితిని నియంత్రించలేమని ఎన్నికల అధికారి పాల డైయిరీ మేనేజింగ్ డైరెక్టర్ కు తెలియజేయడంతో ఎండీ ఈ ఎన్నికలను వాయిదా వేస్తున్నట్లు ప్రకటించడం జరిగింది. అనంతరం ఎన్నికల వాయిదాపై మాజీ ఎమ్మెల్యే కాటసాని రాంభూపాల్ రెడ్డి, మాజీ ఎమ్మెల్యే కాటసాని రామిరెడ్డి, గంగుల ప్రభాకర్రెడ్డి, విజయ్ సింహ రెడ్డి, మాజీ జెడ్పిటిసి సూర్యనారాయణ రెడ్డి, స్థానిక ఉదయానందా రెసిడెన్సి నందు మీడియా సమావేశం నిర్వహించి పరిస్థితిని వివరించారు. పథకం ప్రకారమే ఎన్నికలను వాయిదా వేశారని దీని వెనుక ఎవరి హస్తం ఉందో తెల్సాల్సిన బాధ్యత పోలీసులకు ఉందన్నారు. ఈ సందర్భంగా నంద్యాల జిల్లా వైఎస్సార్సీపీ అధ్యక్షుడు రాంభూపాల్ రెడ్డి మాట్లాడుతూ... అప్రజాస్వామికంగా ఎన్నికల ప్రక్రియను అడ్డుకోవడం ఎంతవరకు సమంజసం కాదని అన్నారు. ఖాలీగా ఉన్న డైరెక్టర్లకు సంబంధించి ఎన్నిలు నిర్వహించేందుకు కోఆపరేటివ్ సొసైటీ అధికారులు, జిల్లా కలెక్టర్ మరియు హైకోర్టు మార్గనిర్దేశంతో ఎన్నికలను జరిపేందుకు సంబంధింత అధికారులు నోటిఫికేషన్ ఇవ్వడం జరిగిందని, అయితే ఎన్నికలను సజావుగా నిర్వహించేందుకు ముందస్తుగా పోలీసులు గట్టి చర్యలు చేపట్టాల్సిందన్నారు. ఎన్నికలను అడ్డుకొనేందుకు టీడీపీ వర్గీయులు పాల ఉత్పత్తి కర్మాగారం కార్యాలయం ఎదుట దౌర్జన్యం చేసి నామినేషన్లను వేయకుండా అడ్డుకోవడం ప్రజాస్వామ్యంలో మంచిది కాదన్నారు. ఇలా దౌర్జన్యాలకు దిగి అడ్డుకోవడం చూస్తే ఎన్నికలకు విలువ లేకుండా పోతుందన్నారు. ం మాజీ ఎమ్మెల్యే రాంభూపాల్ రెడ్డి మాట్లాడుతూ... ప్రజాస్వామ్యబద్ధంగా ఎన్నికలు జరుగుతాయని ఆశించామని అయితే అందుకు విరుద్ధంగా పోలీసులే శాంతిబద్రతల సమస్య ఉందని తాము ఈ దౌర్జన్యాన్ని అదుపు చేయలేమని చేతులెత్తి ఎన్నికలను వాయిదా వేయించడం జరిగిందన్నారు. పార్టీలకు అతీతంగా జరగాల్సిన ఎన్నికలు వాయిదా వేయడంలో ఎవరి హస్తం ఉందన్నది పోలీసులే తేల్చాల్సి ఉందన్నారు. .

## స్వచ్ఛ ఆంధ్ర - స్వచ్ఛ దివాస్

# కార్యక్రమం అద్భుతంగా నిర్వహించాలి

నెల కొక థీమ్ తో 12 మాసాలకు 12 థీమ్లతో కార్యక్రమ నిర్వహణకు చర్యలు

జిల్లా కలెక్టర్ టీఎస్ చేతన్



**పుట్టపర్తి, జనవరి 17:** దేశంలోనే అత్యంత పరిశుభ్ర రాష్ట్రంగా ఆంధ్రప్రదేశ్ ను తీర్చిదిద్దాలనే లక్ష్యంతో నెలలో ఒక శనివారం "స్వచ్ఛత" కోసం అంకితం కావాలని రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు పిలుపు మేరకు ఇకపై ప్రతి మూడో శనివారం "స్వచ్ఛ ఆంధ్ర - స్వచ్ఛ దివాస్" కార్యక్రమాన్ని భారీ స్థాయిలో నిర్వహించేందుకు చర్యలు చేపట్టాలని జిల్లా కలెక్టర్ టీఎస్ చేతన్ పేర్కొన్నారు. శుక్రవారం స్థానిక కలెక్టరేట్ లోని వీడియో కాన్ఫరెన్స్ హాల్ నుండి సంబంధిత జిల్లా హెచ్వోడీలతో మరియు మున్సిపాలిటీ కమిషనర్లతో, ఎమ్మార్వోలతో, ఎంపీడీలతో స్వచ్ఛ ఆంధ్ర - స్వచ్ఛ దివాస్" కార్యక్రమాల అమలపై ముందస్తు ఏర్పాట్లపై అధికారులకు సూచనలు జారీ చేశారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ ఈ నెల 18 వ తేదీన కడప జిల్లా మైదుకూరులో రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు ప్రారంభించనున్న ఈ కార్యక్రమాన్ని జిల్లా వ్యాప్తంగా విజయవంతంగా నిర్వహించేందుకు రాష్ట్ర స్థాయి నుండి గ్రామ స్థాయి అధికారుల వరకూ ప్రతి ఒక్కరూ అంకిత భావంతో భాగస్వామ్యులు కావాలని ఆయన పిలుపునిచ్చారు. సత్ ఫలితాలను ఆశిస్తూ ఈ నెల నుండి వచ్చే 12 నెలల పాటు నెల కొక థీమ్ తో 12 మాసాలకు 12 థీమ్ లతో ఈ కార్యక్రమాన్ని నిర్వహించేందుకు చర్యలు చేపట్టడం జరిగిందన్నారు. జనవరి మాసంలో న్యూ ఇయర్ - క్లీన్ స్టార్ థీమ్ తోను, ఫిబ్రవరి మాసంలో సోర్సు-రిసోర్సు థీమ్ తోను, మార్చిలో అవాయిడ్ సింగిల్ యూజ్ ప్లాస్టిక్స్ - ప్రమోట్ రీయూజబుల్స్ థీమ్ తోను , ఏప్రిల్ లో ఇ-చెక్ థీమ్ తోను, మే లో నీరు-మీరు థీమ్ తోను, జూన్ లో బీట్ ది హీట్ థీమ్ తోను, జులై లో ఎండింగ్ ప్లాస్టిక్ పొల్యూషన్ థీమ్ తోను, ఆగస్టు లో మాన్ సూన్ హైజనిక్ థీమ్ తోను, సెప్టెంబరు లో గ్రీన్ ఏ.పి. థీమ్ తోను, అక్టోబరులో క్లీన్ ఎయిర్ థీమ్ తోను, నవంబరులో పెర్సనల్ & కమ్యునిటీ హైజిన్ థీమ్ తోను మరియు డిశంబరు మాసంలో ఆపర్చునిటీస్ ఇన్ ఇన్విరాన్మెంట్ థీమ్ తోను ఈ కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు ఆయన తెలిపారు. పర్యావరణ పరిరక్షణ అంశంలో కమ్యునిటీ ఎంగేజ్ మెంట్ ను ప్రోత్సహించడం, పరిశుభ్రమైన వాతావరణం ద్వారా ప్రజారోగ్య పరిరక్షణ, పర్యావరణంపై కాలుష్య ప్రభావాన్ని తగ్గించడం, పర్యాటకులు, యాత్రికులు మరియు పెట్టుబడిదారులను మరింత ఆహ్వానించే విధంగా ఆహ్లాదకరమైన వాతావరణాన్ని కల్పించడం, ఆర్థిక ప్రయోజనాలను మెరుగుపర్చడం మరియు పిల్లలు, భవిష్యత్ తరాల వారికి పర్యావరణ పరిశుభ్రతపై అవగాహన కల్పించడం అనే లక్ష్యాలతో ఈ కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు ఆయన తెలిపారు. మార్గదర్శకాలకు అనుగుణంగా ఈ కార్యక్రమాన్ని విజయవంతంగా నిర్వహించేందుకు ఈ కార్యక్రమంలో ప్రజాప్రతినిదులను, అన్ని వర్గాల ప్రజలను పెద్ద ఎత్తున భాగస్వామ్యులను చేయాలని ఆయన కోరారు. అన్ని MPDOలు మరియు మున్సిపల్ కమిషనర్లు రేపు సాయంత్రం తహశీల్దార్లతో సమన్వయం చేసుకుని తప్పిపోయిన పౌరుల డేటాను క్లియర్ చేయాలి. ఈ కార్యక్రమంలో, డిప్యూటీ జడ్పీ సీఈఓ వెంకటసుబ్బయ్య, డిపిఓ సమత, డి ఆర్ డి ఏ పి డి నరసయ్య, గ్రామ వార్డు సచివాలయాల నోడల్ ఆఫీసర్ సుధాకర్ రెడ్డి, డి సి హెచ్ ఓ తిపేంద్ర నాయక్, కోపరేట్ అధికారి కృష్ణ నాయక్, జిల్లాలోని అన్ని శాఖల హెచ్ ఓ డి లు తదితరులు పాల్గొన్నారు.

## పూర్వ విద్యార్థుల ఆత్మీయ సమ్మేళనం...



**పాతపట్నం జనవరి17, ప్రజా జ్యోతి న్యూస్** పాతపట్నం మండలం కోరసవాడ గ్రామంలో 2003-2004 నాటి విద్యను అభ్యసించిన పదివ తరగతి పిల్లల ఆత్మీయ సమావేశం నాటి విద్యార్థులు నేడు వారి యొక్క మధుర స్మృతులను పంచుకొనుటకు స్థానిక మండల పరిషత్ పాఠశాలలో లో ఆత్మీయ సమ్మేళనం ను విదేశాల్లో స్థిరపడ్డ పడాల రవి,అప్పలనాయుడు ఆధ్వర్యంలో ఏర్పాటు చెయ్యడం జరిగింది. ప్రస్తుతం ఎక్కడెక్కడో ఉన్నత స్థాయిల్లో వారంతా బడి ప్రాంగణంలో అడుగు పెడుతూనే హొదాల ను మరిచి ఒకరినొకరు ఆత్మీయంగా పలకరించుకుంటూ సుమారు60 మంది పూర్వ విద్యార్థులు అపూర్వ కలయికగా వచ్చారు. ఈ సమావేశం లో పూర్వ విద్యార్థులు భారీ ఎత్తున కార్యక్రమం నిర్వహించి తాము చదువు కొన్న విద్యా సంస్థ కొంత విరాళం సేకరించి ఇస్తామని తీర్మానించారు.

## ద్వి చక్ర వాహన దారులకు హెల్మెట్ పై అవగాహన..



**పాతపట్నం జనవరి17, ప్రజా జ్యోతి న్యూస్..** పాతపట్నం టౌన్ లో ఈరోజు పాతపట్నం ఏఎస్ఐ . టి.శ్రీనివాస రావు గారు సిబ్బంది తో కలసి వాహన దారులకి హెల్మెట్ తప్పని సరిగా ధరించాలి అని అవగాహన కల్పించారు.

## ముదునూరికి ప్రజల మీద ప్రేమ మరువలేనిది



**ప్రత్తిపాడు ప్రజా జ్యోతి రిపోర్టర్ శ్రీను** కాకినాడ జిల్లా ప్రత్తిపాడు మండలం పెద్దిపాలెం గ్రామానికి చెందిన బంధం చిన్నారావు కొద్ది రోజులుగా అనారోగ్యం తో బాధపడుతున్నరు వారిని ఎంఎంఆర్ ట్రస్ట్ చైర్మన్ మరియు పత్తిపాడు నియోజకవర్గ వైసిపి నాయకులు ముదునూరి కృష్ణంరాజు కాకినాడ ప్రభుత్వ హాస్పిటల్ లో పలకరించారు డాక్టర్ సంప్రదించి వైద్య సేవలు ఎలా అందుతున్నాయో అడిగి తెలుసుకున్నారు మెరుగైన వైద్యం అందించాలని డాక్టర్ని కోరారు అనంతరం బంధం చిన్న రావుకి కొంత ఆర్థిక సాయం అందజేశారు ఈ కార్యక్రమంలో దేవ లక్ష్మణ్ కోలా తాతబాబు బొల్లు నాగేశ్వరరావు జువ్వల దొరబాబు కోన బాబ్జి తదితరులు పాల్గొన్నారు

## అనివార్య కారణాల వలన ఆగిన జన్మదిన వేడుకలు




**ప్రత్తిపాడు ప్రజా జ్యోతి రిపోర్టర్ శ్రీను** ఓంకార స్వామి జన్మదిన వేడుకలు శ్రీ శాంతి ఆశ్రమం భక్తులకు శ్రేయోభిలాషులకు విజ్ఞప్తి పూజ్యశ్రీ ఓంకార స్వామి వారి 131 వ జన్మదినము 21న జరగవలసి ఉండగా అనివార్య కారణాల వలన జరగటం లేదని ఆశ్రమ యజమాన్యం తెలిపింది భక్తులు అన్యదా భావించకుండా అందరూ గమనించగలరని ఆశిస్తున్నాము

## మాదకద్రవ్యాలు రవాణాపై

# కఠిన చర్యలు తీసుకోవాలి

అక్రమ మాదక ద్రవ్యాల రవాణా, సమస్యలపై మరింత అవగాహన కార్యక్రమాలు చేపట్టాలి

: నాశ ముక్త్ భారత్ అభియాన్ యాప్ లో అవగాహన కార్యక్రమాలు అప్లోడ్ చేయాలి

: జిల్లా కలెక్టర్ డాక్టర్ వినోద్ కుమార్.వి,

**అనంతపురం, జనవరి 17 :** జిల్లా మానసిక ఆరోగ్య బృందంచే మత్తు పదార్థాలు, మాదక ద్రవ్యాలపై పాఠశాల, కళాశాలల్లో మరింత అవగాహన కార్యక్రమాలు చేపట్టాలని జిల్లా కలెక్టర్ డాక్టర్ వినోద్ కుమార్.వి, ఆదేశించారు. శుక్రవారం అనంతపురం కలెక్టరేట్లోని మినీ కాన్ఫరెన్స్ హాల్లో ఎన్సిఓఆర్డీ (నార్కో కోఆర్డినేషన్ సెంటర్, NCORD) జిల్లా స్థాయి కమిటీ సమావేశాన్ని జిల్లా కలెక్టర్ నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ డాక్టర్ వి వినోద్ కుమార్ మాట్లాడుతూ.. జిల్లా మానసిక ఆరోగ్య బృందం చే మత్తు పదార్థాలు, మాదక ద్రవ్యాలపై పాఠశాల, కళాశాలల్లో మరింత అవగాహన కార్యక్రమాలు చేపట్టాలని, ఈ సంవత్సరానికి సంబంధించిన ప్రణాళికలను తయారు చేయాలని డిఎంహెచ్ఓ మరియు మానసిక ఆరోగ్య అధికారులకు సూచించారు. వైద్య & ఆరోగ్య శాఖ వారు అనంతపురంలోని ప్రభుత్వ జనరల్ ఆసుపత్రిలో పూర్తి స్థాయి డి-అడిక్షన్ వార్డుకు ఏర్పాటు చేయడం జరిగిందని, ఈ వార్డుకు సంబంధించి పూర్తి స్థాయిలో సిబ్బంది మరియు సామగ్రి ఎంత కావాలో నివేదికలను తయారు చేయాలని అధికారులకు తెలిపారు.

# మున్సిపల్ పార్కులో చెట్లను నరికి విక్రయించిన సిబ్బందిని విధుల నుంచి తొలగించాలి

**మున్సిపల్ కమిషనర్ దివాకర్ రెడ్డికి ఫిర్యాదు చేసిన సిపిఎం నాయకులు**




**రాయదుర్గం జనవరి 17 :** రాయదుర్గం పట్టణంలోని టీచర్స్ కాలనీలో వైయస్ రాజశేఖర్ రెడ్డి మున్సిపల్ పార్కులో ఉన్న చెట్లను నరికి విక్రయించి సొమ్ము చేసుకున్న మున్సిపల్ సిబ్బంది ఫిట్టర్ జగన్నాథ్, ఏ ఈ కోదండ రాముడు, రజాక్ ముగ్గురిని తక్షణం విధుల నుంచి తొలగించాలని సిపిఎం నాయకులు డిమాండ్ చేశారు. రాయదుర్గం మున్సిపల్ కార్యాలయంలో శుక్రవారం సిపిఎం జిల్లా కమిటీ సభ్యుడు బి మల్లికార్జున, రాయదుర్గం నియోజకవర్గం సిపిఐ కార్యదర్శి నాగరాజు, కార్యవర్గ సభ్యులు మధు తదితరులు మున్సిపల్ కమిషనర్ దివాకర్ రెడ్డికి వినతిపత్రం అందజేశారు. రాయదుర్గం పట్టణ ప్రజలకు ఎంతో అహ్లాదకరంగా ఉన్న పచ్చని చెట్లను నరికి విక్రయించి సొమ్ము చేసుకోవడం పై సిపిఎం నాయకులు ఆగ్రహం వ్యక్తం చేశారు. ప్రజా వ్యతిరేక కార్యకలాపాలకు పాల్పడి అక్రమంగా పచ్చని చెట్లను నరకడంపై సరికాదన్నారు. సంబంధిత మున్సిపల్ కార్మికులను విధులను శాశ్వతంగా తొలగించే వరకు ఉద్యమం కొనసాగిస్తామని సిపిఎం నాయకులు కమిషనర్ కు విజ్ఞప్తి చేశారు. పార్కులోని చెట్లు తొలగింపు పై ఇప్పటికే వాచ్మెన్ ను తొలగించినట్లు కమిషనర్ వారికి వివరించారు. ప్రభుత్వం పచ్చని చెట్లను పెంచడానికి కోట్లాది రూపాయలు వెచ్చిస్తుండగా కిందిస్థాయి ఉద్యోగుల సిబ్బంది ప్రజలకు ఉపయోగకరంగా ఉండే పార్కులోని చెట్లను నరకడం ఎంతవరకు సమంజసమని వారు ఆందోళన వ్యక్తం చేశారు. చెట్లను నరికిన వారిపై వెంటనే చర్యలు చేపట్టి విధుల నుంచి తొలగించాలని వారు వినతిపత్రంలో కోరారు. ఈ కార్యక్రమంలో రాయదుర్గం సిపిఎం నాయకులు పాల్గొన్నారు.

# అనపర్తిలో శ్రీశ్రీశ్రీ వీరుళ్ళమ్మ అమ్మవారి జాతర తీర్థ మహోత్సవాలు ముగింపు కార్యక్రమంలో పాల్గొన్న ఎమ్మెల్యే నల్లమిల్లి.





**ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లా రిపోర్టర్ జనవరి 17:** అనపర్తిలో శ్రీశ్రీశ్రీ వీరుళ్ళమ్మ అమ్మవారి జాతర తీర్థ మహోత్సవాలు ముగింపు సందర్భంగా ప్రత్యేక పూజా కార్యక్రమంలో పాల్గొన్న ఎమ్మెల్యే నల్లమిల్లి రామకృష్ణారెడ్డి. ఈసందర్భంగా శ్రీ శ్రీ శ్రీ వీరులమ్మకమిటీ ఆధ్వర్యంలో అనపర్తి ఎమ్మెల్యే నల్లమిల్లి రామకృష్ణారెడ్డి ని సత్కరించిన ఆలయ కమిటీ సభ్యులు. ఈ కార్యక్రమంలో అనపర్తి టౌన్ NDA నాయకుల, కార్యకర్తలు పాల్గొన్నారు.

# 68ఏళ్ల తర్వాత దుర్గమ్మ అమ్మవారి జాతరకు సన్నాహకాలు





**మూడు గ్రామాల పెద్దలతో ఎమ్మెల్యే పరిటాల సునీత, పరిటాల శ్రీరామ్ సమావేశం**

**నసనకోట దుర్గమ్మ దేవాలయం వద్ద పరిటాల శ్రీరామ్ తో కలసి గ్రామ పెద్దలతో చర్చించిన పరిటాల సునీత**


**అనంతపురం జనవరి 17:** రాప్తాడు నియోజకవర్గం లో జిల్లా చరిత్రలో ఎన్నడూ లేని విధంగా ఒక అద్భుతమైన ఆధ్యాత్మిక కార్యక్రమానికి శ్రీకారం చుడుతున్నారు 68ఏళ్ల తర్వాత దుర్గమ్మ అమ్మవారి జాతర నిర్వహించేందుకు సన్నాహకాలు జరుగుతున్నాయి. రామగిరి మండలం నసనకోట-గంగంపల్లి గ్రామాల మధ్య కొలువై ఉన్న దుర్గమ్మకు 68ఏళ్ల క్రితం జాతర జరిగింది. నసనకోట, గంగంపల్లి, వెంకటాపురం గ్రామస్థులు ఐక్యంగా ఈ జాతర జరుపుకునే వారు. అయితే పలు కారణాలతో జాతర నిర్వహించలేదు. ఈ ఏడాది జాతర నిర్వహించాలని మూడు గ్రామాల ప్రజలు ఆసక్తి చూపుతున్నారు. ఇదే విషయాన్ని రాప్తాడు ఎమ్మెల్యే పరిటాల సునీత దృష్టికి తీసుకెళ్లారు. దీంతో ఆమె శుక్రవారం అమ్మవారి ఆలయం ప్రాంగణంలో మూడు గ్రామాల పెద్దలతో సమావేశం అయ్యారు. ధర్మవరం నియోజకవర్గ టీడీపీ ఇన్ ఛార్జి పరిటాల శ్రీరామ్ కూడా ఈ సమావేశంలో పాల్గొన్నారు. జాతర ఈసారి నిర్వహించా -ల్సిందేనని మూడు గ్రామాల పెద్దలు నిర్ణయించారు. అయితే ఇది ఎలా నిర్వహించాలి.. అమ్మవారి ఆలయం వద్ద ఇది సాధ్యం అవుతుందా వంటి అంశాల గురించి చర్చించారు. మూడు గ్రామాల ప్రజలు పలు అభిప్రాయాలను ఎమ్మెల్యే సునీత, శ్రీరామ్ దృష్టికి తీసుకొచ్చారు. అందరి అభిప్రాయాలు విన్న తర్వాత జాతర కచ్చితంగా నిర్వహిద్దామని ఎమ్మెల్యే సునీత, శ్రీరామ్



తెలిపారు. అయితే ఎప్పుడు ఎలా అన్నది మరోసారి సమావేశమై త్వరలోనే నిర్ణయం తీసుకుంటామని ఈ సందర్భంగా వారు వెల్లడించారు..

# సుజనా చౌదరినికలిసిన అనంత ఎమ్మెల్యే దగ్గుబాటి ప్రసాద్

**అనంతపురం అభివృద్ధి పై ఆరా తీసిన ఎమ్మెల్యే సుజునా**



**అనంతపురం జనవరి 17:** మాజీ కేంద్ర మంత్రి, విజయవాడ వెస్ట్ ఎమ్మెల్యే సుజనా చౌదరిని అనంతపురం అర్బన్ ఎమ్మెల్యే దగ్గుపాటి ప్రసాద్ కలిశారు. శుక్రవారం హైదరాబాద్ లోని సుజనా చౌదరి కార్యాలయానికి వెళ్లిన ఎమ్మెల్యే దగ్గుపాటి ఆయనతో మర్యాదపూర్వకంగా భేటి అయ్యారు. ఎమ్మెల్యే దగ్గుపాటితో సుజనా పలు అంశాలపై చర్చించారు. మొదటి సారి ఎమ్మెల్యే అయ్యారు కదా.. జిల్లా కేంద్రంలో అభివృద్ధి ఎలా ఉంది.. నేతల సహకారం ఇతరత్రా అంశాల గురించి ఆరా తీశారు. అభివృద్ధి పనులు వేగంగా సాగుతున్నాయని.. ఇంకా కీలకమైన హామీలకు నిధులు రావాల్సి ఉందని ఎమ్మెల్యే దగ్గుపాటి వివరించారు. మరోవైపు జిల్లా రాజకీయాల గురించి సుజనా ఆరా తీశారు. కూటమి పార్టీలు ఐక్యంగా ముందుకెళ్తాయని ఈ సందర్భంగా ఎమ్మెల్యే సుజనా చౌదరి స్పష్టం చేశారు. కేంద్ర సాయంతో రాష్ట్రంలో మరిన్ని అభివృద్ధి కార్యక్రమాలు జరుగుతాయని సుజనా చౌదరి అన్నారు.

# శ్రీవారి ఆర్జితసేవా టికెట్ల ఏప్రిల్ నెల కోటా విడుదల



**తిరుపతి జనవరి 17:** తిరుమల శ్రీవారి ఆర్జిత సేవా టికెట్లకు సంబంధించిన సుప్రభాతం, తోమల, అర్చన, అష్టదళ పాదపద్మారాధన సేవల ఏప్రిల్ నెల కోటాను జనవరి 18న ఉదయం 10 గంటలకు టీటీడీ ఆన్‌లైన్‌లో విడుదల చేయనుంది. ఈ సేవా టికెట్ల రిజిస్ట్రేషన్ కోసం జనవరి 18 నుండి 20వ తేదీ ఉదయం 10 గంటల వరకు ఆన్‌లైన్‌లో నమోదు చేసుకోవచ్చు. ఈ టికెట్లు పొందిన వారు జనవరి 20 నుండి 22వ తేదీ మధ్యాహ్నం 12 గంటల లోపు సొమ్ము చెల్లించిన వారికి లక్కీడిప్‌లో టికెట్లు మంజూరవుతాయి. జనవరి 21న ఆర్జిత సేవా టికెట్ల విడుదల

కల్యాణోత్సవం, ఊంజల్ సేవ, ఆర్జిత బ్రహ్మోత్సవం, సహస్రదీపాలంకార సేవా టికెట్లు మరియు ఏప్రిల్ 10 నుండి 12వ తేదీ వరకు నిర్వహించనున్న శ్రీవారి సాలకట్ల వసంతోత్సవాల ఆర్థిత సేవా టికెట్లను జనవరి 21న ఉదయం 10 గంటలకు విడుదల చేస్తారు.

**జనవరి 21న వర్చువల్ సేవల కోటా విడుదల**

వర్చువల్ సేవలు, వాటి దర్శన స్లాట్లకు సంబంధించిన ఏప్రిల్ నెల కోటాను జనవరి 21న మధ్యాహ్నం 3 గంటలకు టీటీడీ ఆన్‌లైన్‌లో విడుదల చేయనుంది.
జనవరి 23న అంగప్రదక్షిణం టోకెను... ఏప్రిల్ నెలకు సంబంధించిన అంగప్రదక్షిణం టోకెన్ల కోటాను జనవరి 23న ఉదయం 10 గంటలకు టీటీడీ ఆన్‌లైన్‌లో విడుదల చేయనుంది.

**శ్రీవాణి టికెట్ల ఆన్ లైన్ కోటా..**

శ్రీవాణి ట్రస్టు టికెట్లకు సంబంధించిన ఏప్రిల్ నెల ఆన్ లైన్ కోటాను జనవరి 23వ తేదీ ఉదయం 11 గంటలకు టీటీడీ విడుదల చేయనుంది.వృద్ధులు, దివ్యాంగుల దర్శన కోటా... వయోవృద్ధులు, దివ్యాంగులు, దీర్ఘకాలిక వ్యాధులున్నవారు తిరుమల శ్రీవారిని దర్శించుకునేందుకు వీలుగా మార్చి నెల ఉచిత ప్రత్యేక దర్శనం టోకెన్ల కోటాను జనవరి 23న మధ్యాహ్నం 3 గంటలకు టీటీడీ ఆన్‌లైన్‌లో విడుదల చేయనుంది.

**జనవరి 24న ప్రత్యేక ప్రవేశ దర్శన టికెట్ల కోటా విడుదల**

ఏప్రిల్ నెలకు సంబంధించిన ప్రత్యేక ప్రవేశ దర్శన టికెట్ల కోటాను జనవరి 24న ఉదయం 10 గంటలకు టీటీడీ ఆన్‌లైన్‌లో విడుదల చేయనుంది.
తిరుమల, తిరుపతిలలో గదుల కోటా విడుదల.... తిరుమల, తిరుపతిలలో ఏప్రిల్ నెల గదుల కోటాను జనవరి 24న మధ్యాహ్నం 3 గంటలకు ఆన్‌లైన్‌లో విడుదల చేస్తారు. ఈ నెల 27వ తారీఖున శ్రీవారి సేవ సాధారణ, నవనీత, పరాకామణి సేవ కోటాలు ఉదయం 11, మ.12 మరియు మ. 01గంటలకి యధాప్రకారం విడుదల చేస్తారు. https://ttdevasthanams.ap.gov.in వెబ్‌సైట్ ద్వారా మాత్రమే శ్రీవారి ఆర్జితసేవలు, దర్శన టికెట్లు బుక్ చేసుకోవాలని కోరడమైనది.

# వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ జిల్లా ఉపాధ్యక్షుడు మాసపల్లి సాయికుమార్ కు ఘన సన్మానం!



**ధర్మవరం జనవరి 17:** శ్రీ సత్య సాయి జిల్లా వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ జిల్లా ఉపాధ్యక్షుడిగా నియమితులైన మాసపల్లి సాయికుమార్ కు శుక్రవారం వైసిపి నాయకులు ఘనంగా సత్కరించారు. మాసపల్లి సాయికుమార్ స్వగృహంలో నందు మున్సిపల్ వింగ్ జిల్లా అధ్యక్షునిగా గజ్జల శివ, వైసిపి కౌన్సిలర్లు చింత ఎల్లయ్య, కాలంగి శ్రీనివాసులు కలిసి కేక్ కట్ చేశారు. అనంతరం మాసపల్లి సాయికుమార్ పుష్పగుచ్ఛం అందజేసి దుశ్శాలతో సన్మానించారు. గజ్జల శివ, చింత ఎల్లయ్య, కాలంగి శ్రీనివాసులు మాట్లాడుతూ.. మా మిత్రుడు మాసపల్లి సాయికుమార్ వైఎస్ఆర్సీపీ పార్టీ జిల్లా ఉపాధ్యక్షుడిగా నియమించినందుకు సంతోషకరంగా ఉందన్నారు. ఇలాగే దినదినాభివృద్ధి చెంది మరెన్నో పదవులకు అదగమించాలని కోరుకుంటున్నామన్నారు. ఈ సందర్భంగా మాసపల్లి సాయికుమార్ మాట్లాడుతూ.. నా మిత్రులు శుక్రవారం నా స్వగృహానికి వచ్చి సన్మానించి శుభాకాంక్షలు తెలిపినందుకు చాలా సంతోషంగా ఉందన్నారు. ప్రతి ఒక్కరికి కృతజ్ఞతలు తెలిపారు. నాపై నమ్మకంతో మాజీ సీఎం వైఎస్ జగన్మోహన్ రెడ్డి, ధర్మవరం మాజీ ఎమ్మెల్యే కేతిరెడ్డి వెంకటరామిరెడ్డి, శ్రీ సత్యసాయి జిల్లా అధ్యక్షురాలు ఉష శ్రీ చరణ్ సత్యసాయి జిల్లా వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ జిల్లా ఉపాధ్యక్షుడిగా నియమించినందుకు వారికి ప్రత్యేక కృతజ్ఞతలు తెలుపుకుంటున్నానన్నారు. ఈ కార్యక్రమంలో గజ్జల శివ, చింత ఎల్లయ్య, కాలంగి శ్రీనివాసులు, ఓం, దాము, కుమార్,శివ తదితరులు పాల్గొన్నారు.

# ప్రతి ఇంట్లో ఒక వ్యాపారవేత్త తయారవ్వాలి



**- అదే సీఎం చంద్రబాబు కల**

**- డ్వాక్రా సంఘాల సమైక్య అధ్యక్షుల సమావేశంలో విజయవాడ ఎంపీ కేశినేని**

**అమరావతి, జనవరి 17):** డ్వాక్రా సంఘాల ఆధ్వర్యంలో గ్రామాల్లోని ప్రతి కుటుంబంలో కుటీర పరిశ్రమల ద్వారా స్వయం ఉపాధి సాధించవచ్చు అని తద్వారా కుటుంబాల ఆర్థిక స్థితి పెంచుకోవచ్చని విజయవాడ పార్లమెంటు సభ్యులు శ్రీ కేశినేని శివనాద్ (చిన్ని) అన్నారు. శుక్రవారం విజయవాడ పార్లమెంటు సభ్యుని కార్యాలయంలో జరిగిన జిల్లాలోని అన్ని మండల డ్వాక్రా సంఘాల సమైక్యల అధ్యక్షులు సమావేశంలో ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా కేశినేని శివనాథ్ మాట్లాడుతూ.. ముఖ్యమంత్రి చంద్రబాబు ప్రతి ఇంట్లో ఒక వ్యాపారవేత్త తయారు కావాలని లక్ష్యంతో ప్రభుత్వం పని చేస్తుందని. దాన్ని సాధించడానికి జాతీయ గ్రామీణ అభివద్ధి సంస్థ, పంచాయతీరాజ్ ద్వారా అనేక కుటీర పరిశ్రమలు పై ఉపాధి అవకాశాలు అవగాహన కార్యక్రమాలు పెంపొందించడానికి రెండవసారి హైదరాబాదులో ఉన్న జాతీయ గ్రామీణ అభివద్ధి సంస్థ కు ఎన్టీఆర్ జిల్లాలోని అన్ని మండలాల్లోని డ్వాక్రా సంఘాల సమైక్య అధ్యక్షులను పంపిస్తున్నామని అన్నారు. వీరు అక్కడ ఎన్ ఐ ఆర్ డి నిర్వహిస్తున్న కుటీర పరిశ్రమలను అవగాహన చేసుకుని వారి మండలాల్లోని ఆ కుటీర పరిశ్రమలు వేటికి అణువుగా ఉన్నాయో అధ్యయనం చేసి వాటిని అమలు చేయాలని తద్వారా ప్రతి కుటుంబంలో వ్యాపారవేత్తలను తయారు చేయాలని కోరినారు. ఈ రకంగా జిల్లాలో నిరుద్యోగ యువతకు ఉపాధి కల్పించే దానికి కేంద్ర ప్రభుత్వం నుండి వస్తున్న అనేక పథకాలను ఈ జిల్లాలో అమలు చేయడానికి తను కషి చేస్తానని అన్నారు. ఈ అవకాశాన్ని జిల్లాలోని డ్వాక్రా సంఘాల్లోని సభ్యులందరూ మరియు నిరుద్యోగ యువత ఉపయోగించుకోవాలని కోరారు.

# వైద్య,ఆరోగ్య,శాఖ మంత్రి సత్య కుమార్ కు జ్ఞాపిక అందజేసిన రాష్ట్ర చేనేత నేత గిర్రాజు నగేష్



**ధర్మవరం జనవరి 16:** రాష్ట్ర వైద్య,ఆరోగ్య,శాఖ మంత్రి వై.సత్య కుమార్ యాదవ్ చేనేతల పండుగ సంక్రాంతి జ్యోతులు పండుగ విజయవంతం చేసిన సందర్భంగా ధర్మవరం లోని రాష్ట్ర చేనేత ప్రముఖులు గిర్రాజు నగేష్ గృహానికి విచ్చేసారు.ఈ సందర్భంగా గిర్రాజు నగేష్ దంపతులు ఆయనకు సాదర స్వాగతం పలికారు.మంత్రి సత్య కుమార్ కు ఒక జ్ఞాపిక అందజేశారు.వారికి మంత్రి సత్య కుమార్ చేనేత జ్యోతుల పండుగ శుభాకాంక్షలు తెలియజేసారు.

# బ్యాంక్ సిబ్బంది అంతర్గత, ఏటీఎంల భద్రతపై అప్రమత్తంగా వుండాలి



**హుస్నాబాద్ :** బ్యాంక్ మేనేజర్లు తో అంతర్గత భద్రత, ఏటీఎంలో భద్రత సీసీ కెమెరాల పనితీరు పై హుస్నాబాద్ ఏసీపి వాసాల సతీష్ సమీక్ష సమావేశం నిర్వహించారు. ప్రతి బ్యాంకు మరియు పరిసర ప్రాంతాలలో సీసీ కెమెరాలు ఏర్పాటు చేసుకోవాలి. బ్యాంకు సెక్యూరిటీ సిబ్బంది ఎల్లప్పుడూ అప్రమత్తంగా ఉండాలి. అనుమానాస్పద వ్యక్తులు ఎవరైనా కనబడినప్పుడు వెంటనే డయల్ 100 కు కాల్ చేయాలని అయన సూచించారు. బ్యాంకులలో ఏర్పాటుచేసిన సీసీ కెమెరాలు ఎలా పనిచేస్తున్నాయో ప్రతిరోజు మానిటర్ చేయాలని సూచించారు. సెక్యూరిటీ గార్డ్స్ లేని బ్యాంకులలో సెక్యూరిటీని ఏర్పాటు చేసుకోవాలని సూచించారు. బ్యాంకులో ఏ సంఘటన జరిగినా అలారం సిస్టం పనిచేసే విధంగా ఎప్పటికప్పుడు అప్రమత్తంగా ఉండాలన్నారు. బ్యాంకు లలో ఏదైనా సంఘటన జరిగితే కేసుల పరిశోధనలో బ్యాంకు అధికారులు సహకరించాలని సూచించారు. బ్యాంకులో తప్పకుండా సెక్యూరిటీ మేజర్స్ తీసుకోవాలన్నారు. ప్రజలు దాచిపెట్టుకున్న బంగారం, డబ్బులు, కాపాడడానికి సమన్వయంతో విధులు నిర్వహించాలని సూచించారు. బ్యాంకులో ఉన్న కిటికీలు, డోర్స్, స్ట్రాంగ్ రూమ్, 15 రోజులకు ఒకసారి వాటి యొక్క పనితీరు గురించి తనిఖీ చెయ్యాలని సూచించారు. బ్యాంకులలో పాయింట్స్ బుక్స్ ఏర్పాటు చేస్తామని తెలిపారు. పగలు రాత్రి విధులు నిర్వహించే అధికారులు సిబ్బంది తనిఖీలు చేస్తారని చెప్పారు. సీసీ కెమెరాలు బ్యాంక్ ఇన్ సైడ్, అవుట్ సైడ్ మెయిన్ రోడ్డుపై కూడా ఏర్పాటు చేసుకున్నచో ఏదైనా సంఘటన జరిగితే నేరస్తులను పట్టుకోవడానికి బాగా ఉపయోగపడ తాయని సూచించారు. బ్యాంకు మేనేజర్లు సంబంధిత ఎస్సైల సెల్ నెంబర్లు అందుబాటులో ఉంచుకోవాలని ఏదైనా సంఘటన జరిగితే త్వరగా సమాచారం ఇచ్చే విధంగా విధులు నిర్వహించాలని సూచించారు. మెయిన్ బ్రాంచ్ నుండి ఇతర బ్రాంచీలకు డబ్బులు తీసుకొని వెళ్లేటప్పుడు అన్ని సెక్యూరిటీ మేజర్స్ తీసుకోవాలని సూచించారు. మెయిన్ బ్రాంచ్ నుంచి వివిధ బ్రాంచీలకు క్యాష్ తీసుకొని వెళ్లేటప్పుడు ఎస్కార్ట్ సిబ్బంది అప్రమత్తంగా ఉండాలని సూచించారు. ఈ మధ్యకాలంలో బ్యాంకులపై జరుగుతున్న సంఘటనపై బ్యాంకు అధికారులు సిబ్బంది అప్రమత్తంగా ఉండాలని సూచించారు. ఈ మధ్యకాలంలో జరుగుతున్న సైబర్ నేరాల గురించి సైబర్ పోలీస్ పోర్టల్ ఏ విధంగా పనిచేస్తుంది డబ్బులు ఏవిధంగా ఫ్రిజ్ అవుతున్నాయి ఏ బ్యాంకు నుండి ఏ బ్యాంకు ట్రాన్సాక్షన్ అవుతున్నాయో ఎలా అమౌంట్ ఫ్రీజ్ అవుతుందో తదితర విషయాల గురించి బ్యాంకు అధికారులకు అవగాహన కల్పించడం జరిగింది. తెలుగులో మాట్లాడి సైబర్ నేరాలు చేయుచున్నారని వారి పట్ల కూడా బ్యాంక్ అధికారులు, మరియు ప్రజలు అప్రమత్తంగా ఉండాలని సూచించారు. బ్యాంకు పోలీస్ అధికారులు సమన్వయంతో విధులు నిర్వహించి సైబర్ నేరాలు జరిగిన బాధితులకు డబ్బులు రిటన్ వచ్చే విధంగా కోఆర్డినేషన్తో విధులు నిర్వహించాలని సూచించారు. సైబర్ నేరాలలో బాధితుల అమౌంట్ ఓల్డ్ అయిన, ఫ్రిజ్ అయినా బ్యాంకులో ఇన్వెస్టిగేషన్ గురించి బ్యాంకు స్టేట్మెంట్ బేసిక్ ఇన్ఫర్మేషన్ బ్యాంకు అధికారులు త్వరగా ఇవ్వాలని సూచించారు. ఈ సమావేశంలో హుస్నాబాద్ సీఐ శ్రీనివాస్, ఎస్ఐ మహేష్, హుస్నాబాద్ సర్కిల్ పరిధిలో వివిధ బ్యాంకుల మేనేజర్లు అధికారులు తదితరులు పాల్గొన్నారు.

# విపత్తును ఎదుర్కోవడంలో ఆపద మిత్ర వాలంటీర్లు ముందుండాలి



**కరీంనగర్ :** ప్రకృతి వైపరీత్యాల వల్ల ఏర్పడే విపత్తుల నుండి ప్రజలను రక్షించేందుకు ఆపద మిత్ర వాలంటీర్లు ముందుండాలని జిల్లా కలెక్టర్ పమేలా సత్పతి అన్నారు. జిల్లా అగ్నిమాపక శాఖ ఆధ్వర్యంలో వివిధ ప్రభుత్వ శాఖల్లో పనిచేస్తూ వాలంటీర్లుగా ఆపదమిత్ర సేవ అందించేందుకు ముందుకు వచ్చిన వారికి 12 రోజులపాటు ఆపదమిత్ర శిక్షణ ఇచ్చారు. ఈ శిక్షణ ముగింపు కార్యక్రమం శుక్రవారం కలెక్టరేట్ ఆధ్వర్యంలో జరిగింది. ఈ కార్యక్రమానికి హాజరైన జిల్లా కలెక్టర్ పమేలా సత్పతి మాట్లాడుతూ అవగాహన లేకపోవడం వల్ల నిత్యం ఎక్కడో ఒకచోట ప్రమాదాలు జరుగు తున్నాయని అన్నారు. ఈ ప్రమాదాలు ఎదుర్కునేందుకు గ్రామాల్లో, పట్టణాల్లో పనిచేసే ప్రభుత్వ రంగ ఉద్యోగులతో పాటు స్వచ్ఛందంగా ముందుకు వచ్చే వాలంటీర్లకు ఆపద మిత్ర శిక్షణ ఇస్తున్నామని తెలిపారు. ఇందులో భాగంగా ఫైర్, పోలీస్, పంచాయతీరాజ్, వైద్యశాఖ, పశుసంవర్ధక శాఖ అధికారుల ఆధ్వర్యంలో శిక్షణ ఇచ్చామని తెలిపారు. ప్రకృతి వైపరీత్యాలు, పాము, కుక్క పాటు, అగ్నిప్రమాదం, సిపిఆర్, షాట్ సర్క్యూట్, వరదలు, రోడ్డు ప్రమాదాలు సంభవించినప్పుడు తీసుకోవాల్సిన చర్యలపై శిక్షణను ఇచ్చినట్లు తెలిపారు. ఏవైనా ప్రమాదాలు జరిగినప్పుడు ఆపదమిత్ర శిక్షణ తీసుకున్న వారు ప్రమాదాల నివారణకు ముందుంటారని తెలిపారు. నైపుణ్యాలతో కూడిన ఆపదమిత్ర శిక్షణ వల్ల తమను రక్షించుకోవడంతో పాటు పది మంది ప్రాణాలు కాపాడగలరని పేర్కొన్నారు. శిక్షణకు హాజరైన వారు నేర్చుకున్న నైపుణ్యాలను, మెళకువలను మరో పదిమందికి నేర్పించాలని సూచించారు. ఆపద ఎప్పుడైనా రావచ్చని, ఆ ప్రమాదాన్ని ఎదుర్కొనేందుకు అందరూ సిద్ధంగా ఉండాలని సూచించారు. ఈ సందర్భంగా శిక్షణ పూర్తి చేసుకున్న ఆపదమిత్రకు కలెక్టర్ హెల్మెట్ అందజేశారు. ఈ కార్యక్రమంలో జిల్లా రెవెన్యూ అధికారి పవన్ కుమార్, జిల్లా అగ్నిమాపక అధికారి ఎం.శ్రీనివాసరెడ్డి, ఎస్.ఎఫ్.ఓ రాజ్ కుమార్, ఏఓ సుధాకర్ పాల్గొన్నారు

# దేవరకొండ ఏరియా ఆసుపత్రిని ఆకస్మికంగా తనిఖీ చేసిన జిల్లా కలెక్టర్ ఇలా త్రిపాఠి

**క్యాజువాలిటీ, డయాలసిస్, ఎం సి హెచ్ విభాగాల తనిఖీ, రిజిస్టర్లు, మందుల స్టాక్ పరిశీలన**

**రోగులతో ముఖాముఖి మాట్లాడి వైద్య సౌకర్యాలపై ఆరా**



**నల్గొండ :** నల్గొండ జిల్లా కలెక్టర్ ఇలా త్రిపాఠి శుక్రవారం దేవరకొండ ఏరియా ఆసుపత్రిని ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఆసుపత్రిలోని మాత శిశు సంరక్షణ విభాగాన్ని ,క్యాజువాలిటీని, డయాలసిస్ విభాగాలను తనిఖీ చేసి అక్కడ సౌకర్యాలు, రోగుల వివరాలను సూపరింటెండెంట్ బి. మంగ్యా నాయక్ ద్వారా అడిగి తెలుసుకున్నారు. అంతేకాక ఆసుపత్రికి వస్తున్న రోగుల వివరాలను, అవుట్ పేషెంట్, ఇన్ పేషెంట్ రిజిస్టర్లను తనిఖీ చేసి పరిశీలించారు. ఆసుపత్రికి చికిత్స నిమిత్తం వచ్చిన రోగులతో ముఖాముఖి మాట్లాడి సమయానికి వైద్యులు ఆసుపత్రికి వస్తున్నారా? ఎవరైనా మిమ్మల్ని వైద్యం కోసం డబ్బులు అడుగుతున్నారా? వైద్య చికిత్సలు ఎలా అందిస్తున్నారు ?అని ఆరా తీశారు . ఆసుపత్రి సూపరింటీం డెంట్, వైద్యులతో మాట్లాడుతూ ఆసుపత్రిలో అన్ని సౌకర్యాలు ఉన్నాయా ? ఏమైనా సమస్యలు ఉన్నాయా ? అని అడగగా,నీటి సమస్య ఉందని, సూపరింటిండెంట్ జిల్లా కలెక్టర్ దృష్టికి తెచ్చారు. దీంతోపాటు, రాత్రి సమయాల్లో కొంతమంది మద్యం తాగి ఆసుపత్రికి వస్తున్నారని అందువల్ల ఆస్పత్రి ఆవరణలో పోలీస్ అవుట్ పోస్ట్ ఏర్పాటు చేయాలని విజ్ఞప్తి చేయగా, పోలీసు అధికారులతో మాట్లాడి పోలీస్ అవుట్ పోస్ట్ ఏర్పాటు చేస్తామని కలెక్టర్ తెలిపారు అంతేకాక ఆసుపత్రిలో నెలకొన్న నీటి సమస్యను తక్షణమే తీర్చాలని దేవరకొండ మున్సిపల్ కమిషనర్ ను ఆదేశించారు. ఆస్పత్రిలో ప్రసవాల సంఖ్య ఎలా ఉందని? డాక్టర్ల పనితీరు తదితర విషయాలను అడిగి కనుక్కున్నారు. దేవరకొండ ప్రాంతంలో మొత్తం గిరిజనులు ఎక్కువగా ఉంటారని, వారందరికీ మంచి వైద్య సేవలు అందించాలని, ముఖ్యంగా దేవరకొండ పరిధిలో మాత, శిశు మరణాల సంఖ్య ఎక్కువగా ఉందని వీటిని తగ్గించేందుకు చర్యలు తీసుకోవాలని ఆమె డాక్టర్లను ఆదేశించారు. ఆసుపత్రిలోకి పశువులు, జంతువుల వంటివి రాకుండా గేటు వద్ద పశువుల ట్రాప్ ఏర్పాటు చేస్తామని చెప్పారు. అనంతరం జిల్లా కలెక్టర్ దేవరకొండ మున్సిపల్ పరిధిలోని తాటికల్ రోడ్ లో నిర్వహిస్తున్న రేషన్ కార్డుల సర్వే ప్రక్రియను పరిశీలించారు. ఈ సందర్భంగా సర్వే ఎలా చేస్తున్నారని సర్వే బృందాలతో అడిగి తెలుసుకున్నారు .రాష్ట్ర ప్రభుత్వం ఆదేశించిన మేరకు నూతన రేషన్ కార్డులకు అర్హత ఉన్న వాటిని ఎంపిక చేయాలని, ప్రత్యేకించి అర్హత జాబితా తయారులో ఆదాయం, ఇతర అన్ని అంశాలను పరిగణలోకి తీసుకొని అర్హులైన వారిని మాత్రమే ఎంపిక చేసే విధంగా చూడాలని ఆమె ఆదేశాలు జారీ చేశారు . దేవరకొండ ఆర్డిఓ రమణారెడ్డి, ఏరియా ఆసుపత్రి సూపరింటిండెంట్ భీ. మంగత్య నాయక్ ,తహసిల్దార్, తదితరులు జిల్లా కలెక్టర్ వెంట ఉన్నారు .

## రేషన్ కార్డు సర్వే ను పరిశీలించిన కలెక్టర్

**నల్గొండ :** రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా అమలు చేయనున్న నూతన రేషన్ కార్డుల జారీలో భాగంగా నిర్వహిస్తున్న సర్వే కార్యక్రమాన్ని పక్కగా నిర్వహించాలని జిల్లా కలెక్టర్ ఇలా త్రిపాఠీ సర్వే బృందాలను ఆదేశించారు. శుక్రవారం ఆమె నల్గొండ జిల్లా, దేవరకొండ రెవెన్యూ డివిజన్ పరిధిలోని కొండమల్లేపల్లి ,గుమ్మడవెల్లి గ్రామపంచాయతీలలో నూతన రేషన్ కార్డుల జారీకై నిర్వహిస్తున్న సర్వే ప్రక్రియను పరిశీలించారు. రేషన్ కార్డుల కోసం వచ్చిన దరఖాస్తుల జాబితా ఆధారంగా దరఖాస్తుదారుల ఆదాయం, ఆర్థిక పరిస్థితి, కుటుంబ వివరాలు, తదితర అన్ని విషయాలను పరిగణలోకి తీసుకొని అర్హులను రేషన్ కార్డులకు ఎంపిక చేయాలని ,జాబితాను గ్రామసభలో ఆమోదం తీసుకుని పంపించాలని ఆదేశించారు .ఎట్టి పరిస్థితులలో అనర్హులు రేషన్ కార్డులకు ఎంపిక కావద్దని ఆమె తెలిపారు. రాష్ట్ర ప్రభుత్వం నిర్దేశించిన షెడ్యూల్ ప్రకారం క్షేత్రస్థాయిలో పరిశీలన పూర్తి చేయాలని, అలాగే నెల 21 నుండి 24 వరకు నిర్వహించే గ్రామ సభలలో అర్హుల జాబితాను చదివి వినిపించి ఆమోదం తీసుకొని పంపించాలని చెప్పారు . దేవరకొండ ఆర్డిఓ వై.రమణారెడ్డి, తహసిల్దార్ ,తదితరులు జిల్లా కలెక్టర్ వెంట ఉన్నారు.



## బీదర్ కాల్పులకు తెగబడ్డది బీహార్ గ్యాంగే

**హైదరాబాద్ :** హైదరాబాద్ బీదర్, అఫ్జల్‌గంజ్ కాల్పుల కేసులో పోలీసులు పురోగతి సాధించారు. బీదర్‌లో కాల్పులు జరిపింది బీహార్ ముఠాగా గుర్తించారు. వారం రోజుల క్రితం ఛత్తీస్‌ఘడ్ దోపిడీకి పాల్పడిన బీహార్ ముఠా.. హైదరాబాద్ నుంచి రాయ్‌పూర్.. అక్కడ నుంచి బీహార్ వైపు వెళ్లినట్లు గుర్తించారు. బీదర్‌లో రెండు రోజులుగా రెక్కీ చేసి మరీ అమిత్ కుమార్ ముఠా దోపిడీ చేసింది. అనంతరం బీదర్‌లో దోపిడీ చేసిన నగదును హైదరాబాద్‌కు తీసుకొచ్చి ఇక్కడ రెండు బ్యాగ్‌లను కొనుగోలు చేసిన ముఠా.. అఫ్జల్‌గంజ్‌లో కొనుగోలు చేసిన బ్యాగ్‌లలోకి డబ్బులు నింపి అనంతరం పరారయ్యారు. పలు దోపిడీ కేసులో అమిత్ కుమార్ కీలక నిందితుడుగా ఉన్నట్లు తెలుస్తోంది. హైదరాబాద్ పోలీసులతో బీదర్ పోలీసులు కలిసి రాయ్‌పూర్ వెళ్లారు. రాయ్‌పూర్, బీహార్‌లో పోలీసులు సంయుక్తంగా ఆపరేషన్ నిర్వహించి దుండగులను పట్టుకుందనేందుకు యత్నిస్తున్నారు.??

## కేటీఆర్ శాంతియుతంగా ధర్నా చేయాలి

మాజీ ఎంపీ వి.హనుమంత రావు



**హైదరాబాద్ :** సీఎం రేవంత్ రెడ్డి ఆరు గ్యారంటీల గురించి ఢిల్లీలో మాట్లాడిండు. కేటిఆర్ కు దమ్ముంటే ఢిల్లీలో మాట్లాడాలని మాజీ ఎంపి వి హనుమంతరావు అన్నారు. ఆయన శాంతి యుతంగా ధర్నా చేస్తే ఆరోగ్యం బాగుంటుంది. పవర్ లో ఉన్నప్పుడు ధర్నా చౌక్ గుర్తు రాలేదు. మేము కాపాడిన ధర్నా చౌక్ లో కేటిఆర్ రోజు ధర్నా చేసినా మాకు అభ్యంతరం లేదని అన్నారు. అమిత్ షా నిండు రాజ్య సభ లో అంబేద్కర్ ను అవమానించిండు. ఇప్పుడు భారత దేశాన్ని ఆర్ఎస్ఎస్ ఛీఫ్ మోహన్ భగవత్ అవమానిస్తుండు. 1947 లో స్వాతంత్ర్య వస్తే..రామ మందిరం అయోధ్యలో కట్టినప్పుడు నిజమైన స్వాతంత్ర్య వచ్చిందని మోహన్ భగవత్ అంటుండు. భగత్ సింగ్ ,వల్లభాయ్ పటేల్ ,గాంధీ లాంటి వారు స్వాతంత్ర్యాన్ని తెస్తే బిజేపి వాళ్ళు చరిత్రను వక్రీకరిస్తున్నారు. వీళ్లలో ఇంకా మార్పు రాలేదు. వాళ్ళు తప్పు చేస్తే రాహుల్ గాంధీ ప్రశ్నిస్తున్నాడు. భారత దేశాన్ని అవమనిస్తారా అని రాహుల్ గాంధీ అంటే ఆయనను వక్రీకరిస్తున్నారని ఆరోపించారు.

## 100 మంది పంచాయితీ కార్యదర్శులకు సర్వీస్ బ్రేక్

**నల్గొండ :** నల్గొండ జిల్లా కలెక్టర్ త్రిపాఠి మరో సంచలన నిర్ణయం తీసుకున్నారు. 100 మంది పంచాయతీ కార్యదర్శుల సర్వీస్ ను బ్రేక్ చేశారు. నెలల తరబడి విధులకు గైర్హాజరు కావడంతో కలెక్టర్ కఠిన నిర్ణయం తీసుకున్నారు. ఈ మేరకు ఉత్తర్వులు కూడా జారీ అయ్యాయి.నల్గొండ జిల్లా పరిధిలో పని చేస్తున్న పలువురు పంచాయతీ కార్యదర్శులు విధులకు హాజరుకావటం లేదు. ఇదే విషయం కలెక్టర్ దృష్టికి చేరింది. రంగంలోకి దిగిన కలెక్టర్ విచారణ చేపట్టారు. అయితే 100 మంది పంచాతీయ కార్యదర్శులు? విధులకు హాజరుకావటం లేదని గుర్తించారు. వీరంతా కూడా గతేడాది జనవరి నుంచి డిసెంబర్ మాసం వరకు కూడా ఆఫీసులకు రానట్లుగా తేలింది. ఉన్నతాధికారుల అనుమతి లేకుండానే వీరంతా కూడా దుమ్మా కొట్టనట్లు విచారణలో గుర్తించారు. దీంతో కఠిన చర్యలకు సిద్ధమైన జిల్లా కలెక్టర్? సంబంధిత కలెక్టర్లపై చర్యలు తీసుకున్నారు. సర్వీస్ బ్రేక్ చేస్తూ ఉత్తర్వులు ఇచ్చారు. అంతేకాకుండా.. ప్రస్తుతం పని చేస్తున్న చోటు కాకుండా మరో చోటకు బదిలీ చేస్తూ నిర్ణయం తీసుకున్నారు.నిజానికి ఇన్ని రోజులపాటు సమాచారం లేకుండా విధులకు దుమ్మా కొట్టే సిబ్బందిని సస్పెండ్ చేయాల్సి ఉంటుందని అధికారవర్గాలు చెబుతున్నాయి. కేవలం సర్వీస్ బ్రేక్ వరకు కలెక్టర్ నిర్ణయం తీసుకున్నారని? అంతేకాకుండా వారందర్నీ తిరిగి విధుల్లోకి తీసుకున్నారని వెల్లడించాయి.మరోవైపు కలెక్టర్ ఉత్తర్వులతో ఆయా పంచాయతీ కార్యదర్శులు కంగు తిన్నారు. సర్వీస్ బ్రేక్ ఆదేశాలతో భవిష్యత్తులో ఏమైనా ఇబ్బందులు ఉంటాయా అనే ఆందోళన చెందుతున్నారు.

ఇటీవలే ఆస్పత్రిలో ఆకస్మిక తనిఖీ:

ఇక ఇటీవల జిల్లాలోని గుర్రంపోడు ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని కూడా కలెక్టర్ త్రిపాఠి ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సమయంలో కమ్యూనిటీ హెల్త్ ఆఫీసర్ హరిలాల్‌తో పాటు విధుల్లో ఉండాల్సిన ఎనిమిది మంది ఉద్యోగులు ఎలాంటి అనుమతి లేకుండా విధులకు గైర్హాజరయ్యారు. ఈ విషయాన్ని తీవ్రంగా పరిగణించిన కలెక్టర్ చర్యలు తీసుకున్నారు.ఒప్పంద ఉద్యోగులైన ఫార్మాసిస్టు శ్యామ్, ల్యాబ్ టెక్నీషియన్ సంధ్య, డేటా ఎంట్రీ ఆపరేటర్ మాధవి, అటెండర్లు శ్రీనివాస్, అరుణ జ్యోతి, ఎల్లమ్మలను విధుల నుంచి తొలగించారు. ఈ మేరకు ఉత్తర్వులు జారీ చేశారు. ఇద్దరు ప్రభుత్వ సిబ్బంది అయిన ఫార్మాసిస్టు భాగ్యమ్మ, అటెండర్ లక్ష్మీనారాయణలను సస్పెండ్ చేయాలని జిల్లా వైద్యాధికారికి సూచించారు.

## షేక్ పేటలో అగ్ని ప్రమాదం

**హైదరాబాద్ :** హైదరాబాద్‌లోని షేక్‌పేట్ భారీ అగ్నిప్రమాదం చోటు చేసుకుంది. శుక్రవారం ఉదయం ఐదున్నర గంటలకు ఈ ఘటన చోటు చేసుకుంది. షేక్‌పేట్‌లోని రిలయన్స్ ట్రెండ్స్ షాపు ఉన్న బిల్డింగ్‌లో ఈ ఘటన జరిగింది. అదే బిల్డింగ్ లో సెకండ్ ఫ్లోర్‌లోవున్న ఆకాష్ ఎడ్యుకేషన్ ఇన్‌స్టిట్యూట్‌లో తొలుత మంటలు చెలరేగాయి.అక్కడి నుంచి పైఅంతస్తులకు మంటలు వ్యాపించాయి. ప్రమాదం గురించి సమాచారం అందు కున్న వెంటనే చుట్టు పక్కల ప్రాంతాల నుంచి ఫైర్ ఇంజన్లు అక్కడికి చేరుకున్నాయి. దాదాపు మూడు గంటలపాటు శ్రమించి మంటలను అదుపులోకి తెచ్చాయి. ప్రమాద సమయంలో బిల్డింగ్‌లో ముగ్గురు వ్యక్తులున్నారు. వారిని సురక్షితంగా కాపాడారు ఫైర్ సిబ్బంది.ఈ ఘటనపై జిల్లా ఫైర్ ఆఫీసర్ స్పందించారు. సెకండ్ ఫ్లోర్‌లో అధికంగా ఫర్నిచర్ ఉండడంతో పైఅంతస్థుల వరకు మంటలు వ్యాపించాయన్నారు. ఇంకా లోపల ఎవరైనా ఉన్నారా అనేదానిపై తనిఖీ చేస్తున్నట్లు చెప్పుకొచ్చారు. అగ్నిప్రమాదం ఎలా జరిగింది? అనేదానిపై విచారణ మొదలైంది. షార్ట్ సర్క్యూట్ కారణమా? లేక మరేమైనా జరిగిందా? అనేదానిపై లోతుగా విచారణ మొదలుపెట్టారు అధికారులు.


## పోటీ పరీక్షలకు ఉచిత కోచింగ్

**గద్వాల :** గద్వాల జిల్లాలోని టీజీ బీసీ స్టడీ సర్కిల్ నందు డిగ్రీ ఉత్తీర్ణులైన నిరుద్యోగ యువతీ యువకులకు ఎస్. ఎస్. సి, ఆర్ ఆర్ బి మరియు బ్యాంకింగ్ సేవల యందు వందరోజులు ఉచిత కోచింగ్ ఇవ్వనున్నట్లు టి . జి.బి.సి స్టడీ సర్కిల్ డైరెక్టర్ కె.రాములు ఒక ప్రకటనలో తెలిపారు. కోచింగ్ కొరకు బీసీ విద్యార్థులకు 75% ఇతర విద్యార్థులకు 25% రిజర్వేషన్ ప్రకారం సీట్లు కేటాయించినట్లు తెలిపారు. ఈనెల 20 నుంచి ఫిబ్రవరి 9వ తేదీ వరకు ఆన్లైన్ వెబ్సైట్ నందు దరఖాస్తు చేసుకోవాల్సిందిగా తెలిపారు. ఫిబ్రవరి 15 నుండి కోచింగ్ తరగతులు ప్రారంభం చేయనున్నట్లు,కోచింగ్ అనంతరం స్టడీ మెటీరియల్ ఇవ్వనున్నట్లు తెలిపారు. వయోపరిమితి 39 సంవత్సరాలు ఉండి,తల్లిదండ్రుల వార్షిక ఆదాయం గ్రామీణ ప్రాంతం వారికి 1.50 లక్షల లోపు పట్టణ ప్రాంత వాసులకు 2.00 లక్షల లోపు కలిగి ఉండాలని అన్నారు. ఇతర వివరములకు ఫోన్ నెంబర్: 08546-293022, సెల్ నెంబర్: 9985434941 కి సంప్రదించాలని ఈ అవకాశాన్ని అర్హత గల విద్యార్థులు సద్వినియోగం చేసుకోవాలని ఈ సందర్భంగా ఆయన కోరారు.

## షాబాద్‌లో బీఆర్ఎస్ రైతు దీక్ష పాల్గొన్న కేటీఆర్

**వికారాబాద్ :** ఎన్నికల సమయంలో రైతులకు ఇచ్చిన హామీలు నెరవేర్చకుండా కాంగ్రెస్ ప్రభుత్వం చేసిన మోసానికి వ్యతిరేకంగా ఇవాళ చేవెళ్ల నియోజకవర్గం షాబాద్ మండల కేంద్రంలో రైతు దీక్ష ను బీఆర్ఎస్ నిర్వహించింది. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా బీఆర్ఎస్ పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ కే.తారకరామారావు హాజరయ్యారు.

# అలసటను దూరం చేసే ఎనర్జీ డ్రింక్స్..



ఎనర్జీగా ఉంటే ఎన్ని పనులు అయినా చేయవచ్చు. ఒక్కోసారి ఎక్కువగా పని చేసినా, ఎండలో తిరిగినా కూడా అలసటకు గురవుతూ ఉంటారు. అలాంటి సమయంలో కళ్లు తిరిగి చాలా మంది కింద పడిపోతారు. మీకు కొద్దిగా నీరసంగా అనిపించినా ఈ డ్రింక్స్ తాగితే మంచి రిలీఫ్ దొరుకుతుంది. ఎంత బలంగా ఉన్నా కొన్ని సందర్భాల్లో అలసట చెందుతూ ఉంటారు. కంటిన్యూగా ఇంట్లో లేదా బయట పని చేసినా, ఎండల్లో పని చేసినా త్వరగా నీరసం వస్తూ ఉంటుంది. ప్రయాణాల్లో కూడా చాలా మంది నీరస పడుతూ ఉంటారు. అలాంటి సమయంలో ఈ జ్యూసులు తాగితే మళ్లీ యాక్టివ్ అవుతారు. నీరసాన్ని తగ్గించే డ్రింక్స్‌లో దోసకాయ జ్యూస్ కూడా ఒకటి. నిమ్మరం పిండిన దోసకాయ జ్యూస్ తాగితే.. శరీరానికి సత్తువ లభిస్తుంది. నీరసం పోయి మళ్లీ యాక్టీవ్ అవుతారు. జీర్ణ క్రియకు కూడా మేలు చేస్తుంది. ద్రాక్ష రసం తాగినా కూడా నీరసం పోయి మళ్లీ యాక్టీవ్ అవుతారు. ఇందులో ఉండే గుణాలు నీరసాన్ని దరి చేరకుండా చేస్తాయి. నీరసంగా ఉన్న సమయంలో కొబ్బరి నీళ్లు తాగినా కూడా అలసట, నీరసం తగ్గుతాయి. మళ్లీ బాడీ యాక్టీవ్ అవుతుంది. నిమ్మరసం తాగినా కూడా ఆరోగ్యానికి చాలా మంచిది. ఈ నిమ్మ కాయ నీళ్లు అలసటను తగ్గించి.. శరీరంలో శక్తిని పెంచుతాయి. మంచి ఎనర్జీని ఇస్తాయి. గ్రీన్, టీలు తాగినా కూడా నీరసం తగ్గి.. శరీరం యాక్టీవ్ అవుతుంది. శరీరాన్ని రీఫ్రెష్ చేసే డ్రింక్స్‌లో చియా సీడ్స్ కూడా ఒకటి. నీళ్లలో నానబెట్టి వీటిని తాగినా అలసటను తగ్గిస్తాయి. చెరకు రసం తాగినా కూడా మంచి ఎనర్జీ లభిస్తుంది. మిరియాలు, జీలకర్ర పొడి, నిమ్మరసం కలిపిన మజ్జిగ తాగినా కూడా అలసట పోయి.. మంచి ఎనర్జీ లభిస్తుంది.

# దంతాల ఆరోగ్యం కోసం...



మీ దంతాలను బలంగా, ఆరోగ్యంగా ఉంచడానికి సరైన ఆహారాన్ని తీసుకోవడం చాలా ముఖ్యం. ఎర్రని అరటిపండు, ఆపిల్, ఆరెంజ్ వంటి పండ్లు దంతాలను శుభ్రం చేస్తాయి, బలాన్ని ఇస్తాయి. ఎర్రని అరటిపండు, మాగ్నీషియం, కాల్షియం, మాంగనీస్ వంటి పోషకాలను కలిగి ఉండి దంతాలపై మలినాలను తొలగిస్తుంది. ఆపిల్‌లోని ఫైబర్, నీరు, మాలిక్ ఆమ్లం పళ్ళు శుభ్రం చేస్తాయి. ఆరెంజ్ లోని సీ విటమిన్, ఐరన్ దంతాలను బలపరుస్తాయి. అలాగే, ఉసిరికాయ, ఎండుద్రాక్ష వంటి ఆహారాలు కూడా దంతాలకు బలం అందిస్తాయి. ఈ పండ్లు, కూరగాయలు రోజూ తీసుకుంటే దంతాలు ఆరోగ్యంగా ఉంటాయి. మీ దంతాలను కాపాడుకోవడం అంటే ఒక్క బ్రష్ చేయడం కాదు దృఢంగా, ఆరోగ్యంగా ఉంచడం కూడా ముఖ్యమే. మీరు తీసుకునే ఆహారంలో కొన్ని ఆహారాలను చేర్చడం ద్వారా మీరు మీ దంతాలు ఆరోగ్యంగా కాపాడుకోవచ్చు. సరైన ఆహారాన్ని తీసుకోవడం వల్ల దంతాలు, చిగుళ్లకు అవసరమైన పోషకాలను అందిస్తుంది. అంతేకాకుండా, కరకరలాడే పండ్లు, కూరగాయలు సహజంగా మీ దంతాలను శుభ్రపరుస్తాయి. పైగా మీ చిగుళ్ళను ఉత్తేజపరుస్తాయి. ఇంతకి ఇప్పుడు ఎలాంటి ఆహారాలు తీసుకోవాలో తెలుసుకుందాం. దంతాల ఆరోగ్యానికి ఎర్రని అరటిపండు చాలా మంచిది. ఇందులో ఉండే మాగ్నీషియం, కాల్షియం, మాంగనీస్ వంటి పోషకాలు దంతాలపై ఉన్న మలినాలను తొలగించడంలో సహాయపడుతాయి. ఇవే కాకుండా ఈ ఎర్రని అరటి పండుతో ఆరోగ్య ప్రయోజనాలు చాలానే ఉన్నాయి. ముఖ్యంగా ఈ అరటిపండ్లలో ఉండే కాల్షియం దంతాలను బలంగా చేస్తుంది. దంతాలు బలహీనంగా లేదా ఊగిపోతే ఈ పండ్లను తినండి. రోజు ఈ పండును తినడం వల్ల నోటి సమస్యలు కూడా తగ్గుతాయి. అలాగే రాత్రి ఈ పండును తినడం వల్ల దంతాల నుండి రక్తస్రావం, దంతాల పతనం లాంటి సమస్యలు ఉండవు. బేకింగ్ సోడా, అరటిపండు, కొబ్బరి నూనె కలిపి పేస్ట్ చేసి బ్రష్ చేస్తే దంతాలు పగిలిపోవడం, మచ్చలు రావడం మానుకుంటాయి.

ఆపిల్‌లో ఉన్న ఫైబర్, నీరు దంతాలను సురక్షితంగా ఉంచుతుంది. ఇది దంతాలపై ఉన్న మచ్చలను కూడా తొలగిస్తుంది. ఈ ఆపిల్ నోట్లో దుర్వాసన తగ్గించి, నోటి కీటకాలను కూడా బయటపెట్టిస్తుంది. ఆపిల్‌లో ఉన్న మాలిక్ ఆమ్లం దంతాలను శుభ్రం చేస్తుంది. ఆరెంజ్ లో ఉన్న సీ విటమిన్, ఐరన్ దంతాలను శుభ్రపరచి బలం ఇస్తుంది. ఆరెంజ్ లోని మాలిక్ ఆమ్లం దంతాలపై ఉండే మచ్చలను తొలగించి, వాటిని శుభ్రంగా చేస్తుంది. ఆరెంజ్ లో ఉండే నీరు, ఫైబర్ నోటి ఆరోగ్యాన్ని మెరుగుపరుస్తాయి. దీంతో కీటకాలు, దుర్వాసన తగ్గుతాయి. ఆరెంజ్ తినడం వల్ల నోట్లో ఉన్న బ్యాక్టీరియా శక్తిని కోల్పోతాయి. నోటి సమస్యలు కూడా తగ్గుతాయి.

# షుగర్ పేషెంట్లు అరటి పండ్లు తినొచ్చా?



ఆరోగ్యానికి మేలు చేసే పండ్లలో అరటి పండు ఒకటి. అందుకే దీనిని అన్ని వయసుల వారు తినేందుకు ఇష్టపడతారు. పైగా అన్ని కాలాల్లో అన్ని ప్రాంతాల్లో అందుబాటు ధరలో లభ్యమవుతుంది. అయితే షుగర్ పేషెంట్లు అరటి పండ్లు తినొచ్చా? లేదా? అనే సందేహంతో దీనిని దూరం పెడుతుంటారు. అరటిపండు అందరికీ అందుబాటులో ఉండే పండ్లలో ఒకటి. అవి ఏడాది పొడవునా అన్ని ప్రాంతాల్లో అన్ని కాలాల్లో అందుబాటులో ఉంటాయి. ఇది ఫైబర్, పొటాషియం, మంచి కార్బోహైడ్రేట్లు, విటమిన్ సి వంటి అనేక పోషకాలతో నిండి ఉంటుంది. అరటిపండులో కార్బోహైడ్రేట్లు పుష్కలంగా ఉంటాయి. అరటిపండు అందరికీ అందుబాటులో ఉండే పండ్లలో ఒకటి. అవి ఏడాది పొడవునా అన్ని ప్రాంతాల్లో అన్ని కాలాల్లో అందుబాటులో ఉంటాయి. ఇది ఫైబర్, పొటాషియం, మంచి కార్బోహైడ్రేట్లు, విటమిన్ సి వంటి అనేక పోషకాలతో నిండి ఉంటుంది. అరటిపండులో కార్బోహైడ్రేట్లు పుష్కలంగా ఉంటాయి. ఈ కారణంగానే కొందరు అరటి పండుకు దూరంగా అంటారు. అయితే డయాబెటిస్ పేషెంట్లు అరటి పండు తింటే రక్తంలో షుగర్ లెవెల్స్ పెరుగుతాయా? అనే సందేహం చాలా మందికి ఉంటుంది. అరటిపండులో చక్కెర, కేలరీలు పుష్కలంగా ఉంటాయి. ఇవి ఇన్సులిన్ స్థాయిలను పెంచుతాయి. అరటిపండ్లు తినడం వల్ల రక్తంలో చక్కెర ఖచ్చితంగా పెరుగుతుందని పోషకాహార నిపుణులు చెబుతున్నారు. అరటిపండ్లు రక్తంలో చక్కెరను ఎందుకు పెంచుతాయంటే.. ఇందులో ఉండే ఫైబర్ కంటెంట్‌తోపాటు చక్కెర శాతం ముఖ్యకారణం. ఎందుకంటే ఫైబర్ రక్తంలో చక్కెర శోషణను నెమ్మదిస్తుంది. అయితే వీరు అరటి పండు మితంగా తింటే సరిపోతుంది. మీరు బరువు తగ్గడానికి ప్రయత్నిస్తున్నట్లయితే అరటి పండు మంచి ఎంపికే. అరటిపండ్లలోని అధిక ఫైబర్ కంటెంట్ శరీర బరువును త్వరగా తగ్గిస్తుంది. ఇది జీవక్రియను మెరుగుపరచడం ద్వారా బరువు తగ్గడంలో సహాయపడుతుంది. అరటిపండ్లు మీ డైట్‌లో జోడించవచ్చు.

# సమస్యలను తగ్గించే పచ్చి బఠానీలు



రెగ్యులర్‌గా వంటల్లో వాడే వాటిల్లో పచ్చి బఠానీలు కూడా ఒకటి. వీటితో ఎన్నో రకాల రెసిపీలు తయారు చేసుకోవచ్చు. పచ్చి బఠానీలు తినడం వల్ల చాలా వరకు కొన్ని రకాల సమస్యలను రాకుండా చేస్తుంది. తరచూ ఆహారంలో చేర్చుకోవడం వల్ల ఉండే బెనిఫిట్స్ అన్నీ ఇన్నీ కావు. పచ్చి బఠానీల గురించి ప్రత్యేకంగా పరిచయాలు అవసరం లేదు. ప్రోటీన్‌కి, పోషకాలను అందించడంలో బెస్ట్ అని చెప్పొచ్చు. ప్రతి రోజూ కనీసం ఓ గుప్పెడు తీసుకున్నా ఎన్నో సమస్యలను కంట్రోల్ చేస్తుంది. పచ్చి బఠానీలను తీసుకోవడం వల్ల ఎన్ని సమస్యలను తగ్గించుకోవచ్చో ఇప్పుడు చూద్దాం. పచ్చి బఠానీల్లో గ్లైసెమిక్ ఇండెక్స్ అనేది చాలా తక్కువగా లభిస్తుంది. ప్రోటీన్, ఫైబర్ మెండుగా లభిస్తుంది. కాబట్టి వీటిని తరచూ ఓ మోతాదులో తీసుకుంటే డయాబెటీస్ కంట్రోల్ అవుతుంది. రక్తంలో షుగర్ లెవల్స్ పెరగకుండా చేస్తుంది. పచ్చి బఠానీలు తీసుకోవడం వల్ల జీర్ణ సమస్యలు, ముఖ్యంగా మలబద్ధకం సమస్యలు రాకుండా అడ్డుకుంటుంది. కడుపు ఆరోగ్యాన్ని పెంచుతుంది. పెద్ద పేగు క్యాన్సర్ రాకుండా చేస్తుంది. ఈ క్యాన్సర్ వచ్చిన వారు వీటిని తింటే త్వరగా కోలుకుంటారు. గర్భిణీలు పచ్చి బఠానీలను తినడం వల్ల చక్కగా ఫోలేట్ అందుతుంది. వీటిని రెగ్యులర్‌గా తీసుకుంటే ఎంతో ఆరోగ్యంగా ఉంటారు. బిడ్డ మెదడు, వెన్నెముక బాగా అభివృద్ధి చెందుతాయి. వీటిని తినడం వల్ల గుండె ఆరోగ్యం కూడా మెరుగు పడుతుంది. శరీరంలో రోగ నిరోధక శక్తిని పెంచడంలో కూడా ఇవి బాగా సహాయ పడతాయి. ఇన్ఫెక్షన్లు, ఇతర వ్యాధులు సోకుండా మిమ్మల్ని కాపడతాయి. శరీరంలో పేరుకు పోయిన బ్యాడ్ కొలెస్ట్రాల్‌ను కూడా తగ్గిస్తుంది. బరువు తగ్గడంలో హెల్ప్ చేస్తాయి.

# మునగాకు ప్రయోజనాలు



మునగ ఆకులు అనేక పోషకాలు కలిగిన అద్భుతమైన కూరగాయ. ఇవి రోగనిరోధక శక్తిని పెంచి, రక్తపోటును నియంత్రించడంలో కీలక పాత్ర పోషిస్తాయి. ముఖ్యంగా మునగాకుతో తయారుచేసిన సూప్ రోజూ తీసుకోవడం వల్ల బీపీ పెరగడం లేదా తగ్గడం వంటి సమస్యల నుంచి ఉపశమనం పొందవచ్చు. మునగ ఆకులు హీమోగ్లోబిన్ ను పెంచడంలో సహాయపడటంతో పాటు శరీరానికి కావలసిన ఫైబర్, ఖనిజాలు అందిస్తాయి. రాత్రివేళ మునగ ఆకులను ఉపయోగించడం మానుకోవడం మంచిది. ఈ ఆకులను సరిగ్గా ఉపయోగించి బీపీ సమస్యను సహజంగా నియంత్రించండి. అయితే, ఈ చిట్కాలను పాటించే ముందు వైద్యులను సంప్రదించడం మంచిది. రక్తపోటు (బీపీ) పెరగడం, తగ్గడం వంటి సమస్యలు మనలో చాలా మందిని బాధిస్తున్నాయి. కానీ ఈ సమస్యకు ఒక అద్భుత పరిష్కారం మన పక్కనే ఉంది. అదే మునగాకు. ఇది ఆరోగ్యానికి అనేక రకాలుగా ఉపయోగపడుతుంది. మునగాకుల ప్రయోజనాలు, వీటిని ఎలా వినియోగించాలో ఇప్పుడు తెలుసుకుందాం. మునగ ఆకులు వివిధ పోషకాలతో నిండి ఉంటాయి. వీటిలో ఫైబర్, ఐరన్, కాల్షియం, ప్రొటీన్లు, అలాగే విటమిన్ %ూ, జ% లాంటి ముఖ్యమైన పోషకాలు అధికంగా ఉంటాయి. ఈ ఆకు రోగనిరోధక శక్తిని పెంచడంలో, గాయాలు త్వరగా మానడంలో, హీమోగ్లోబిన్ స్థాయిని మెరుగుపరచడంలో కీలక పాత్ర పోషిస్తుంది. అంతేకాకుండా, మునగాకులు శరీరానికి అవసరమైన శక్తిని అందించడంతో పాటు, రక్తపోటు నియంత్రణలో సహాయపడుతాయి. బీపీ సమస్యతో బాధపడేవారు తరచుగా మందులు తీసుకుంటూ ఉంటారు. కానీ బీపీని నియంత్రించడానికి మునగాకులు కూడా సహాయపడుతాయి. ప్రత్యేకించి, మునగ ఆకుల సూప్ త్రాగడం ద్వారా రక్తపోటు సమస్యలను సమర్థవంతంగా నియంత్రించవచ్చు. మునగ ఆకులోని ఫైటోకెమికల్స్ రక్తనాళాల్లోని ఒత్తిడిని తగ్గించి రక్తప్రవాహాన్ని సజావుగా చేస్తాయి. ఇది రక్తపోటును నియంత్రించడంలో సహాయపడుతుంది.

## బిజినెస్

### దేశంలోనే అతిపెద్ద మొబిలిటీ గ్లోబల్ ఎక్స్‌పో




భారతదేశంలోనే అతిపెద్ద మొబిలిటీ ఎక్స్‌పో అయిన భారత్ మొబిలిటీ గ్లోబల్ ఎక్స్‌పో 2025ను జనవరి 17 న ఉదయం 10:30 గంటలకు న్యూఢిల్లీలోని భారత్ మండపంలో ప్రధాన మంత్రి నరేంద్ర మోదీ ప్రారంభించనున్నారు. ఎక్స్‌పో మొత్తం మొబిలిటీ వాల్యూ చైన్‌ను ఒకే గొడుగు కింద ఏకం చేయడం లక్ష్యంగా పెట్టుకుంది. న్యూఢిల్లీలోని భారత్ మండపంలో జనవరి 17న 'ఇండియా మొబిలిటీ గ్లోబల్ ఎక్స్‌పో 2025'ని ప్రధాని నరేంద్ర మోదీ ప్రారంభించనున్నారు. ఇది దేశంలోనే అతిపెద్ద మొబిలిటీ ఎక్స్‌పో, ఇది మొబిలిటీ రంగంలోని అన్ని అంశాలను ఒకే వేదికపైకి తీసుకురావడానికి ప్రయత్నిస్తోంది. జనవరి 17 నుండి 22 వరకు భారత్ మండపం యశోభూమి, ఇండియా ఎక్స్‌పో సెంటర్, గ్రేటర్ నోయిడాలోని మార్ట్ అనే మూడు ప్రదేశాలలో ఎక్స్‌పో జరుగుతుంది. ఈ కార్యక్రమంలో 9 ప్రదర్శనలు, 20కి పైగా సమావేశాలు, పెవిలియన్లు ఉంటాయి. దీనితో పాటు, వివిధ రాష్ట్రాల ప్రత్యేక సమావేశాలు మొబిలిటీ రంగంలో తమ విధానాలు, పథకాలను ప్రదర్శిస్తాయి. ప్రపంచవ్యాప్తంగా ఉన్న ఎగ్జిబిటర్లు, సందర్శకులతో ఈవెంట్ ప్రపంచ ప్రాముఖ్యతను సంతరించుకుంటుంది. ఇది ఇంజినీరింగ్ ఎగుమతి ప్రమోషన్ కౌన్సిల్ భారతదేశం, ఇతర భాగస్వామ్య సంస్థల సహకారంతో కేంద్ర ప్రభుత్వ మద్దతుతో కార్యక్రమం నిర్వహిస్తున్నారు. ఇదిలావుంటే, భారతదేశంలో ఆటోమొబైల్ అమ్మకాలు 2024లో 11.6% వృద్ధిని నమోదు చేయడం గమనార్హం, మొత్తం అమ్మకాలను 25 మిలియన్ యూనిట్లకు తీసుకువెళ్లింది. ఇప్పటి వరకు ఇదే అతిపెద్ద సంఖ్య. ద్విచక్ర వాహనాల అమ్మకాలు 1.95 కోట్ల యూనిట్లలో 14.5% వృద్ధి చెందడం ఈ వృద్ధికి ప్రధాన కారణం. ప్యాసింజర్ వాహనాలు, మూడు చక్రాల వాహనాలు కూడా రికార్డు స్థాయిలో అమ్మకాలను నమోదు చేశాయి. 2024లో, భారతదేశం ప్రపంచంలో మూడవ అతిపెద్ద కార్ మార్కెట్‌గా కొనసాగుతుంది. అక్టోబర్ నుండి డిసెంబర్ త్రైమాసికంలో, ప్యాసింజర్ వాహనాలు, వాణిజ్య వాహనాలు మరియు త్రిచక్ర వాహనాలు ఎన్నడూ లేని విధంగా అత్యధిక వృద్ధిని నమోదు చేశాయి.

### ఇన్ఫోసిస్ లాభాల్లో 11.5 శాతం వృద్ధి




ప్రస్తుత ఆర్థిక సంవత్సరం (2024-25) డిసెంబర్‌తో ముగిసిన తృతీయ త్రైమాసికం (క్యూ3)లో దిగ్గజ ఐటి సేవల కంపెనీ ఇన్ఫోసిస్ 11.46శాతం పెరుగుదలతో రూ.6,806 కోట్ల నికర లాభాలు ప్రకటించింది. గతేడాది ఇదే త్రైమాసికంలో 6,106 కోట్ల లాభాలు నమోదు చేసింది. క్రితం క్యూ3లో కంపెనీ రెవెన్యూ 7.58 శాతం పెరిగి రూ.41,764 కోట్లకు చేరింది. ఇంతక్రితం ఏడాది ఇదే క్యూ3లో రూ.38,821 కోట్ల రెవెన్యూ ఆర్జించింది. గడిచిన క్యూ3లో కంపెనీ నిర్వహణ లాభాల్లో 21.3 శాతం వృద్ధి సాధించింది. క్లయింట్లకు దగ్గర కావడంపై దృష్టి కేంద్రీకరించామని ఇన్ఫోసిస్ సిఇఒ సలీల్ పరేఖ్ తెలిపారు. వైవిధ్యభరితమైన డిజిటల్ ఆఫరింగ్స్‌తో విజయం సాధించగల మని చెప్పడానికి తమ ఆర్థిక ఫలితాలే నిదర్శనమన్నారు. డిసెంబర్ త్రైమాసికంలో కంపెనీలో కొత్తగా 5,591 మంది ఉద్యోగులు చేరారు. దీంతో మొత్తం ఉద్యోగుల సంఖ్య 3,23,379 మందికి చేరుకుందని ఆ కంపెనీ తెలిపింది.

# ఈ బడ్జెట్‌లో రూ.15 లక్షల ఆదాయంపై పన్ను తగ్గనుందా?




కొత్త పన్ను విధానాన్ని మరింత ఆకర్షణీయంగా మార్చాలని, ఎక్కువ మంది పన్ను చెల్లింపుదారులను ఆకర్షించాలని ప్రభుత్వం భావిస్తోంది. తద్వారా ఆదాయపు పన్ను శ్లాబ్ రేట్లను మరింత తగ్గించవచ్చని అంటున్నారు. పాత విధానంలో అనేక పన్ను మినహాయింపులు ఉండేవి. ఈ బడ్జెట్‌లో కేంద్ర ప్రభుత్వం మధ్యతరగతి ప్రజలపై పన్ను భారాన్ని తగ్గించే అవకాశం ఉంది. రాయిటర్స్ వార్తా సంస్థ నివేదిక ప్రకారం, ఫిబ్రవరి బడ్జెట్‌లో వార్షిక ఆదాయం రూ. 15 లక్షల వరకు పన్ను రేటును తగ్గించవచ్చని చెబుతున్నారు. ప్రభుత్వ వర్గాల నుంచి ఈ సమాచారం అందినట్లు నివేదిక పేర్కొంది. అయితే ఎంతమేర పన్ను తగ్గింపు ఉంటుందన్న వివరాలు లేవు. ప్రస్తుతం రెండు ఆదాయపు పన్ను వ్యవస్థలు ఉన్నాయి. పాత పన్ను విధానం, కొత్త పన్ను విధానం 2020లో అమలులోకి వచ్చింది. పాత విధానంలో అనేక పన్ను మినహాయింపులు ఉండేవి. అందువల్ల ఆదాయపు పన్ను చెల్లింపుదారులు ఇప్పటికీ పాత పన్ను విధానాన్ని ఉపయోగిస్తున్నారు. కొత్త పన్ను విధానంలో పన్ను రేటు తక్కువగా ఉన్నప్పటికీ, పన్ను మినహాయింపులు కూడా చాలా తక్కువ. ప్రస్తుతం పాత పన్ను విధానంలో రెండున్నర లక్షల రూపాయల వరకు ఆదాయానికి పన్ను మినహాయింపు ఉంది. ఆదాయానికి 2.5 నుండి 5 లక్షలు. 5 పన్ను విధింపు. 5 నుంచి 10 లక్షల మధ్య ఆదాయంపై 20% పన్ను ఉంటుంది. పది లక్షల రూపాయల పైబడిన ఆదాయానికి 30% పన్ను ఉంది. పాత పన్ను విధానంలో ప్రధాన ఆకర్షణ రూ.2 నుంచి 3 లక్షల ఆదాయానికి పన్ను మినహాయింపు అవకాశం. కొత్త పన్ను విధానంలో రూ. 3 లక్షల ప్రారంభ ఆదాయానికి పన్ను మినహాయింపు ఉంది. రూ.3 నుంచి రూ.7 లక్షల చొప్పున ఆదాయానికి 5 శాతం పన్ను ఉంది. సెంటుకు రూ.7 నుంచి రూ.10 లక్షలకు 10 శాతం, రూ.10 నుంచి రూ.12 లక్షల ఆదాయానికి 15 శాతం, రూ.12 లక్షలకు పైబడిన ఆదాయానికి 30 శాతం పన్ను ఉంది. కొత్త పన్ను విధానంలో ఇకపై పన్ను మినహాయింపు లేదు. అయితే తక్కువ పన్ను ఉంటుంది. అలాగే రూ.7 లక్షల వరకు ఆదాయానికి పన్ను రాయితీ ఉంది. అంటే వార్షిక ఆదాయం రూ.7 లక్షలు ఉంటే ఎలాంటి పన్ను చెల్లించాల్సిన అవసరం లేదు.

# రిలయన్స్‌కు రూ.18,540 కోట్ల లాభాలు




ముకేష్ అంబానీకి చెందిన రిలయన్స్ ఇండిస్ట్రీస్ అంచనాలు మించి రెవెన్యూ, నికర లాభాలు సాధించింది. ప్రస్తుత ఆర్థిక సంవత్సరం డిసెంబర్‌తో ముగిసిన మూడో త్రైమాసికం (క్యూ3)లో 7.4 శాతం వృద్ధితో రూ.18,540 కోట్ల నికర లాభాలు సాధించింది. అదే సమయంలో కంపెనీ రెవెన్యూ 7 శాతం పెరిగి రూ.2.43 లక్షల కోట్లుగా చోటు చేసుకుంది. రిలయన్స్ రూ.18,330 కోట్ల మేర లాభాలు, రూ.2.39 లక్షల కోట్ల రెవెన్యూ సాధించొచ్చని మార్కెట్ నిపుణులు వేసిన అంచనాల కంటే మెరుగైన ఫలితాలు ప్రకటించడం విశేషం. రిలయన్స్ జియో ఇన్ఫోకమ్ 2024-25 క్యూ3లో 26 శాతం వృద్ధితో రూ.6,861 కోట్ల నికర లాభాలు ప్రకటించింది. ఇంతక్రితం ఏడాది ఇదే క్యూ3లో రూ.5,447 కోట్ల లాభాలు నమోదు చేసింది. ఇదే సమయంలో రూ.27,697 కోట్లుగా ఉన్న రెవెన్యూ.. గడిచిన క్యూ3లో 19.4 శాతం వృద్ధితో రూ.33,074 కోట్లకు ఎగిసింది. ఏడాదికేడాదితో పోల్చితే గడిచిన క్యూ3లో వినియోగదారుడి నుంచి సగటు రెవెన్యూ (ఎఆర్‌పియు) 12 శాతం పెరిగి రూ.203.3గా నమోదయ్యిందని తెలిపింది. 2024 డిసెంబర్ ముగింపు నాటికి జియో వినియోగదారుల సంఖ్య 48.2 కోట్లుగా ఉందని తెలిపింది.

---

## స్పోర్ట్స్

### టీమిండియా ఆటగాళ్లకు కఠిన నిబంధనలు విధించిన బీసీసీఐ..

# పాటించకపోతే నిషేధమే?

2024 సంవత్సరంలో రోహిత్ శర్మ కెప్టెన్సీలో టీమిండియా ఐసీసీ టీ20 ప్రపంచ కప్ 2024 టైటిల్‌ను గెలుచుకుంది. ఆస్ట్రేలియా టూర్‌లో టెస్టు సిరీస్ ఓటమితో భారత క్రికెట్‌లో హర్షాతిరేకాలు వ్యక్తమవుతున్నాయి. బీసీసీఐ మొదట టీమిండియా ఆటగాళ్లకు మార్గదర్శకాలను జారీ చేసింది. ఇందులో కుటుంబ ప్రయాణాలపై పరిమితి విధించారు. అంతే కాదు దేశవాళీ క్రికెట్ ఇకపై ప్రతీ ఆటగాడికి తప్పనిసరి అయిపోయింది. ఇటువంటి పరిస్థితిలో ఆటగాల్లు ఈ రూల్స్ పాటించకపోతే, ఎలాంటి చర్చలు తీసుకుంటారో తాజాగా బయటకు వచ్చింది. అవేంటో ఇప్పుడు చూద్దాం..

బీసీసీఐ మార్గదర్శకాలలో, దేశవాళీ క్రికెట్, కుటుంబ సభ్యుల ప్రయాణంపై ఆంక్షలు విధించారు. ప్రాక్టీస్ సెషన్‌ల కోసం జట్టుతో కలిసి రావడంపైనా ఆంక్షలు పెట్టారు. ఇకపై ప్రతి సీనియర్ లేదా జూనియర్ ఆటగాడు దేశవాళీ క్రికెట్ ఆడాలని బీసీసీఐ కోరుతోంది. అయితే ఒక ఆటగాడి కుటుంబం అతనితో రెండు వారాల పాటు పర్యటనలో ఉండవచ్చు. ఇందులో బీసీసీఐ వసతికి మాత్రమే చెల్లిస్తుంది, మిగిలిన ఖర్చులను ఆటగాళ్లే స్వయంగా భరించాల్సి ఉంటుంది.

అదే సమయంలో, ప్రాక్టీస్ సెషన్‌లో టీమ్ ఇండియాలోని ప్రతి ఆటగాడు హాజరు కావాలని బీసీసీఐ కోరింది. జట్టుతో కలిసి ఒక వేదిక నుంచి మరొక వేదికకు వెళ్లవలసి ఉంటుంది. కాగా, టీమ్‌తో కలిసి ఉండటం వంటి వాటిపై ఎక్కువ దృష్టి పెట్టారు. ఏ సిరీస్ లేదా టూర్ సమయంలో ప్లేయర్‌లు ఇకపై ప్రకటనలను షూట్ చేయలేరు.



**కచ్చితంగా పాటించాల్సిందే..**

ఈ విధంగా, ఒక ఆటగాడు బీసీసీఐ మార్గదర్శకాలలో చేర్చిన ఏ అంశంమైనా అనుసరించలేకపోతే, సదరు ఆటగాడు సెలక్షన్ కమిటీ ఛైర్మన్, ప్రధాన కోచ్ నుంచి అనుమతి తీసుకోవలసి ఉంటుంది. అంతే కాకుండా ఇందులో ఎవరైనా ఆటగాడు తప్పు చేసి పట్టుబడితే అతనిపై క్రమశిక్షణా చర్యలు తీసుకోవచ్చు.

**ఐపీఎల్ ఆడటంపై కూడా నిషేధం విధించే అవకాశం..**

ఒక ఆటగాడు ఈ విధానాలను సరిగ్గా అనుసరించకపోతే, టోర్నమెంట్‌లు, సిరీస్‌లు, ఐపీఎల్‌లో కూడా ఆడటానికి బోర్డు అతన్ని అనుమతించదు. ఇది కాకుండా, బోర్డు ఆటగాళ్ల జీతాలు, ఒప్పందాలపైనా భారీ ఎఫెక్ట్ చూపించే ఛాన్స్ ఉందంట.

### రాష్ట్రపతి చేతుల మీదుగా ఖేల్ రత్న అందుకున్న షూటర్ మనూభాకర్, చెస్ చాంపియన్ గుకేశ్

**న్యూఢిల్లీ:** ఒలింపిక్స్ మెడలిస్ట్ షూటర్ మనూ భాకర్, చెస్ వరల్డ్ చాంపియన్ డీ గుకేశ్.. ఇవాళ మేజర్ ధ్యాన్ చంద్ ఖేల్ రత్న అవార్డులు అందుకున్నారు. రాష్ట్రపతి ద్రౌపది ముర్ము చేతుల మీదుగా ఆ అవార్డులను స్వీకరించారు. రాష్ట్రపతి భవన్‌లో ఈ వేడుక జరిగింది. హాకీ కెప్టెన్ హర్మన్‌ప్రీత్ సింగ్, పారాలింపిక్ గోల్డ్ విన్నింగ్ హైజంపర్ ప్రవీణ్ కుమార్ కూడా ఖేల్ రత్న పురస్కారాలను అందుకున్నారు. 22 ఏళ్ల షూటర్ మనూ భాకర్ .. ఒకే ఒలింపిక్స్‌లో రెండు మెడల్స్ గెలిచిన తొలి భారతీయ క్రీడాకారిణిగా నిలిచింది. గత ఏడాది ఆగస్టులో జరిగిన క్రీడల్లో ఆమె 10మీ ఎయిర్ పిస్తోల్, 10మీ ఎయిర్ పిస్తోల్ మిక్స్‌డ్ టీం ఈవెంట్లలో బ్రాంచ్ మెడల్ గెలుచుకున్నది. ఇక 18 ఏళ్ల చెస్ చాంపియన్ గుకేశ్.. యువ ప్రపంచ చాంపియన్ అయ్యాడు. చైనాకు చెందిన డింగ్ లీరెన్‌ను ఓడించి ఆ టైటిల్ అందుకున్నాడు. విశ్వనాథన్ ఆనంద్ తర్వాత ఆ ఘనత సాధించిన రెండో చెస్ క్రీడాకారుడిగా నిలిచాడు.




### రంజీ ట్రోఫీ నుంచి కోహ్లీ ఔట్



ఛాంపియన్స్ ట్రోఫీ 2025కి ముందు విరాట్ కోహ్లీకి సంబంధించి కీలక వార్త బయటకు వచ్చింది. వచ్చే నెలలో టీమిండియా ఛాంపియన్స్ ట్రోఫీ ఆడాల్సి ఉంది. టీమ్ ఇండియా ఫిబ్రవరి 20న బంగ్లాదేశ్‌తో తన ప్రచారాన్ని ప్రారంభించనుంది. ఇందుకు కేవలం ఒక నెల మాత్రమే మిగిలి ఉంది. దీనికి ముందు కోహ్లీ విషయంలో టెన్షన్ పెంచే వార్తలు వచ్చాయి. ఆస్ట్రేలియా పర్యటనలో కోహ్లీ గాయపడ్డాడు. ఆస్ట్రేలియా నుంచి తిరిగి వచ్చిన తర్వాత అతని గాయం గురించిన రహస్యం వెలుగులోకి వచ్చింది. సిడ్నీలో జరుగుతున్న బోర్డర్ గవాస్కర్ ట్రోఫీ చివరి టెస్టులో కోహ్లీ గాయపడ్డాడు. అతను మెడ గాయంతో బాధపడ్డాడు. ఆ తర్వాత టీమిండియా ఫిజియో అతనికి చికిత్స అందించాడు. మెడ గాయం కారణంగా సౌరాష్ట్రతో జరిగే ఢిల్లీ రంజీ ట్రోఫీ మ్యాచ్‌కు కోహ్లీ దూరమయ్యే అవకాశం ఉందని, జనవరి 23 నుంచి 26 వరకు సౌరాష్ట్రతో రాజ్‌కోట్‌లో తలపడనున్న సంగతి తెలిసిందే. టైమ్స్ ఆఫ్ ఇండియా ప్రకారం సిడ్నీలో కోహ్లీ మెడకు గాయం కావడంతో భారత జట్టు ఫిజియో అక్కడ చికిత్స అందించినట్లు తెలుస్తోంది. కోహ్లీ మెడ బెణికిందని, ఇందుకోసం ఇంజెక్షన్ తీసుకోవలసి వచ్చిందని, అతను మిగిలిన రెండు రంజీ మ్యాచ్‌ల్లో పాల్గొనలేదు. మొదటి మ్యాచ్‌లో మాత్రం ఎట్టి పరిస్థితిలో ఆడలేదు అని తెలుస్తోంది. సెలెక్టర్‌లకు ఈ మేరకు అప్‌డేట్ ఇవ్వనున్నట్లు భావిస్తున్నారు. అయితే, మెడకు గాయం కావడంపై కోహ్లీ వైపు నుంచి ఎలాంటి సమాచారం లేదని ఢిల్లీ అండ్ డిస్ట్రిక్ట్ క్రికెట్ అసోసియేషన్ (డీడీసీఏ) అధికారి స్పోర్ట్స్ టాక్‌కి తెలిపారు. సుదీర్ఘ ఆస్ట్రేలియా పర్యటన నుంచి తిరిగి వచ్చిన కోహ్లీ ముంబైలో తన కుటుంబంతో నాణ్యమైన సమయాన్ని గడుపుతున్నాడు. విరాట్ కోహ్లీ రంజీ ట్రోఫీ మ్యాచ్ ఆడి దశాబ్దానికి పైగా గడిచింది. అతను చివరిసారిగా 2012లో రంజీ ట్రోఫీ మ్యాచ్ ఆడాడు. ఆస్ట్రేలియా టూర్‌లో పేలవమైన ఫామ్‌తో కోహ్లీ పలు విమర్శలను ఎదుర్కోవలసి వచ్చింది. దేశవాళీ క్రికెట్‌లో ఆడేందుకు సలహాలు తీసుకోవడం ప్రారంభించాడు. కాగా, కాంట్రాక్ట్ ఆటగాళ్లు తమ ఖాళీ సమయంలో దేశవాళీ క్రికెట్ ఆడాలనే నిబంధనను బీసీసీఐ అమలు చేసింది. అంతకుముందు, ప్రధాన కోచ్ గౌతమ్ గంభీర్ కూడా దేశవాళీ క్రికెట్ గురించి మాట్లాడాడు, ఆ తర్వాత కోహ్లీ కూడా దేశవాళీ క్రికెట్ ఆడటం గురించి చర్చ మొదలైంది.

# సూపర్‌స్టార్ కోసం గ్లోబల్‌స్టార్




మహేశ్‌బాబు రాజమౌళి కాంబినేషన్‌లో రాబోతున్న 'ఎస్ఎస్ఎంబీ29' కోసం ప్రపంచవ్యాప్తంగా సినీ ప్రియులు ఎదురుచూస్తున్నారు. ఈ చిత్రం సెట్స్ మీదకి ఎప్పుడు వెళ్తుందా అని ఆసక్తిగా ఉన్నారు. ఇటీవల ఈ చిత్రాన్ని సైలెంట్‌గా పూజా కార్యక్రమాలతో ప్రారంభించారు. ఈ సినిమా ప్రకటించినప్పటి నుంచే రకరకాల ఉహాగానాలు వైరల్ అయ్యాయి. ఏదీ అధికారికంగా ప్రకటించనప్పటికీ ఈ సినిమాకు సంబంధించిన ఏ వార్త అయినా క్షణాల్లో వైరల్‌గా మారుతున్నాయి. ఇప్పుడు మరో వార్త నెట్టింట వార్తలు చక్కర్లు కొడుతున్నాయి. గ్లోబల్‌స్టార్, బాలీవుడ్ బ్యూటీ ప్రియాంకా చోప్రా ఈ సినిమాలో నటించనున్నట్లు ఎన్నో రోజులుగా వార్తలు వస్తున్న సంగతి తెలిసిందే! తాజాగా ఆమె హైదరాబాద్ చేరుకున్నారు. దీంతో మహేశ్- రాజమౌళి ప్రాజెక్ట్ కోసమే హైదరాబాద్‌కు వచ్చారంటూ కామెంట్స్ వినిపిస్తున్నాయి. ఆమె విమానాశ్రయంలో కనిపించిన వీడియోలు సోషల్ మీడియాలో షేర్ అవుతున్నాయి. ఈ సినిమా షూటింగ్‌పై త్వరలోనే అధికారిక అప్‌డేట్ వచ్చే అవకాశం ఉందని ఫ్యాన్స్ ఎక్స్‌పెక్ట్ చేస్తున్నారు. సినిమా టైమింగ్‌లు ఇటీవల ఈ చిత్రం హైదరాబాద్‌లో అల్యూమినియం ఫ్యాక్టరీలో పూజా కార్యక్రమాలతో మొదలైంది. కథా నేపథ్యం మినహా దీనికి సంబంధించి ఇప్పటి వరకు అధికారికంగా ఎలాంటి సమాచారాన్ని బయట పెట్టలేదు. అమెజాన్ అడవుల నేపథ్యంలో సాగే ఈ కథలో విదేశీ నటులు కనిపించనున్నారు. దుర్గా ఆర్ట్స్‌పై కె.ఎల్.నారాయణ ఈ చిత్రాన్ని నిర్మిస్తున్నారు.



# మూడు రోజుల్లోనే.. సంక్రాంతికి వస్తున్నాం బ్రేక్ ఈవెన్ పూర్తి

అనిల్ రావిపూడి దర్శకత్వంలో టాలీవుడ్ యాక్టర్ వెంకటేశ్ హీరోగా.. ఐశ్వర్యారాజేశ్, మీనాక్షి చౌదరి ఫీ మేల్ లీడ్ రోల్స్‌లో నటించిన చిత్రం సంక్రాంతికి వస్తున్నాం సంక్రాంతి కానుకగా జనవరి 14న థియేటర్లలో గ్రాండ్‌గా విడుదలైన ఈ చిత్రం సంక్రాంతి బ్లాక్ బస్టర్‌గా నిలిచింది. తాజాగా ఈ మూవీ వసూళ్లకు సంబంధించి క్రేజీ వార్త ఒకటి ఇండస్ట్రీ సర్కిల్‌లో రౌండప్ చేస్తోంది. గ్రాండ్‌గా ఓపెనింగ్ వసూళ్లతో మొదలైన ఈ చిత్రం రెండు, మూడో రోజు కూడా అదే మేనియాను కొనసాగించింది. సంక్రాంతికి వస్తున్నాం గుంటూరు, సీడెడ్ ప్రాంతాల్లో బ్రేక్ ఈవెన్ మార్క్ పూర్తి చేసుకుందని ఫిలింనగర్ సర్కిల్ సమాచారం. ఈ వీకెండ్‌కు ఇతర ప్రాంతాల్లో బ్రేక్ ఈవెన్‌ను బీట్ చేయనున్నట్టు ట్రేడ్ సర్కిల్ టాక్. ఈ చిత్రం కేవలం విడుదలైన మూడు రోజుల్లోనే గ్లోబల్ బాక్సాఫీస్ వద్ద రూ.100 కోట్ల మార్క్‌ను అధిగమించి టాక్ ఆఫ్ ది ఇండస్ట్రీగా నిలుస్తోంది. రాబోయే రోజుల్లో మరెన్ని రికార్డులు క్రియేట్ చేస్తుందనేది ఆసక్తికరంగా మారింది. ఈ చిత్రంలో నరేశ్, పాపులర్ మరాఠీ యాక్టర్, యానిమల్ ఫేం ఉపేంద్ర లిమాయే, కోలీవుడ్ నటుడు వీటీవీ గణేశ్ కీలక పాత్రలు పోషించారు. ట్రయాంగిల్ క్రైమ్ డ్రామా నేపథ్యంలో వచ్చిన ఈ మూవీని దిల్ రాజు సమర్పణలో శిరీష్ నిర్మించారు. ప్రమోషన్స్‌లో భాగంగా ఎంగేంజింగ్‌గా సాగే ఇంటర్వ్యూలు, చార్ట్ బస్టర్ పాటలు, ఇంప్రెసివ్ ప్రోమోలు.. ఇలా ప్రతీ విషయం సినిమా చుట్టూ మంచి బజ్ క్రియేట్ చేయడంలో కీ రోల్ పోషించాయనడంలో ఎలాంటి సందేహం లేదు.



# ఏం గురాయించి చూస్తున్నవ్.. వీరమల్లు మాట వినాలి..

**పవన్ కల్యాణ్ హరిహరవీరమల్లు ఫస్ట్ సింగిల్ వీడియో**

టాలీవుడ్ యాక్టర్ పవన్ కల్యాణ్ పవన్ కల్యాణ్ టైటిల్ రోల్‌లో నటిస్తోన్న మోస్ట్ అవెయిటెడ్ ప్రాజెక్ట్ హరిహరవీరమల్లు జ్యోతికృష్ణ దర్శకత్వం వహిస్తున్నాడు. ఇస్మార్ట్ భామ నిధి అగర్వాల్ ఫీ మేల్ లీడ్ రోల్‌లో నటిస్తోంది. ఈ మూవీ రెండు పార్టులుగా రానుండగా.. హరిహరవీరమల్లు పార్ట్ 1 మార్చి 28న ప్రపంచవ్యాప్తంగా గ్రాండ్‌గా విడుదల కానుంది. ఈ నేపథ్యంలో మేకర్స్ ఫస్టి సింగిల్ వినాలి.. వీరమల్లు మాట వినాలి ప్రోమో కూడా విడుదల చేయగా.. నెట్టింట వైరల్ అవుతోంది. తాజాగా ఫుల్ లిరికల్ వీడియో సాంగ్ లాంచ్ చేశారు. ఏం గుల్పామ్ ఏం గురాయించి చూస్తున్నవ్ భయపెట్టనీకా..? ఓహెూ చాలా మందిని చూసినాంలే బిడ్డా. హే మునిమాణిక్యం చూసినవా.. గురాయించి చూస్తుండు బేటా.. మన లెక్క తెల్వదు.. వినాలి.. వీరమల్లు మాట చెబితే వినాలి.. అంటూ తెలంగాణ యాసలో పవన్ కల్యాణ్ స్టైల్‌లో సాగుతున్న లిరిక్స్ ఆకట్టుకుంటూ.. అభిమానులను థ్రిల్ చేస్తున్నాయి. పెంచల్ దాస్ రాసిన ఈ పాటను ఎంఎం కీరవాణి కంపోజిషన్‌లో పవన్ కల్యాణ్ పాడాడు. ఈ సాంగ్ సినిమాకే హైలెట్‌గా నిలువనుందనడంలో ఎలాంటి సందేహం లేదు. పీరియాడిక్ డ్రామా నేపథ్యంలో వస్తోన్న ఈ మూవీలో బాలీవుడ్ నటుడు, దర్శక నిర్మాత అనుపమ్ ఖేర్, అర్జున్ రాంపాల్, నర్గీస్ ఫక్రీ కీలక పాత్రలు పోషిస్తున్నారు. లెజెండరీ మ్యూజిక్ డైరెక్టర్ ఎంఎం కీరవాణి మ్యూజిక్, బ్యాక్ గ్రౌండ్ స్కోర్ అందిస్తున్నాడు. ఈ చిత్రాన్ని మేఘ సూర్య ప్రొడక్షన్ బ్యానర్‌పై ఏ దయాకర్‌రావు నిర్మిస్తున్నారు. ఏఎం రత్నం సమర్పకుడిగా వ్యవహరిస్తున్నారు. క్లైమాక్స్‌లో వచ్చే రెడ్ డ్రెస్ ఫైట్‌ను 42 రోజులపాటు చిత్రీకరించారని ఇన్‌సైడ్ టాక్. ఇక ఈ చిత్రంలో ఇంట్రో సాంగ్, టైగర్ ఫైట్, మహల్ యాక్షన్ పార్ట్, కుస్తీ ఫైట్ సీన్, చార్మినార్ యాక్షన్ సన్నివేశాలు, ప్రీ ఇంటర్వెల్, ఇంటర్వెల్ భారీ యాక్షన్ సీక్వెన్స్, క్లైమాక్స్ వార్ సీన్ అభిమానులకు గూస్ బంప్స్ తెప్పించబోతున్నాయట.

## ఓటీటీలోకి వచ్చేసిన 'పాతాల్ లోక్ సీజన్ 2'

కరోనా లాక్‌డౌన్ టైంలో వచ్చి బ్లాక్ బస్టర్ అందుకున్న వెబ్ సిరీస్‌లలో పాతాల్ లోక్ ఒకటి. క్రైమ్ థ్రిల్లర్‌గా వచ్చిన ఈ వెబ్ సిరీస్‌ను స్టార్ క్రికెటర్ విరాట్ కోహ్లి భార్య నటి అనుష్కా శర్మ నిర్మించగా.. జైదీప్ అహ్లావత్, అభిషేక్ బెనర్జీ, స్వస్తిక ముఖర్జీ, గుల్ పనాగ్ తదితరులు ఈ సిరీస్‌లో కీలక పాత్రలో నటించారు. హాథీ రామ్ చౌదరిగా పోలీస్ ఇన్‌స్పెక్టర్ పాత్రలో జైదీప్ అహ్లావత్ మంచి మార్కులు సంపాదించాడు. అయితే ఈ వెబ్ సిరీస్‌కి సీక్వెల్ తీసుకువస్తున్నట్లు మేకర్స్ ప్రకటించిన విషయం తెలిసిందే. పాతల్ లోక్ సీజన్ 2 అంటూ రాబోతున్న ఈ సిరీస్‌లో కూడా లీడ్ రోల్స్‌లో జైదీప్ అహ్లావత్‌తో పాటు, ఇష్వాక్ సింగ్, తిలోతమా షోమ్, గుల్ పనాగ్ నటిస్తున్నారు. ఇప్పటికే సీజన్‌కి సంబంధించిన ట్రైలర్‌ను విడుదల చేయగా.. ఫుల్ రెస్పాన్స్ అందుకుంది.



Printed and Published by V. Srinivas Reddy on behalf of M/s Sai Krishna Publications, Owned by M/s Sai Krishna Publications Printed at Sree Seshasai Enterprises, Plot No. 98/1, Co-operative Industrial Estate, IDA, Gandhinagar, Quthbullapur Mandal, Medchal-Malkajgiri Dist, Telangana. Published at Plot No. 3, Flat No.13, Surya Saroj Apartments, HUDA Complex, Saroornagar Ranga Reddy District.(Hyd) - 500 035, Telangana. Editor : V. SRINIVAS REDDY, cell:9440231967 RNI No. APTEL/2010/36516, prajajyothiadilabad@gmail.com